మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 46 • పేజీలు:12+16 • వెల: రూ.5 బుధవారం • 17-1-2018 www.manamnews.com /manamnews



నరేంద్ర మోదీ..

విప్లవ నాయకుడు

భారత్‌తో సంబంధాలు బలోపేతం

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

వ్యవసాయం, శాస్త్ర, రక్షణ రంగాల్లో ఇరు దేశాల సహకారం: మోదీ

భారత్-ఇజ్రాయెల్ మధ్య 9 రంగాలలో ఒప్పందాలు

7లో..



తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

3లో..

కొరియా కంపెనీలకు కేటీఆర్ విజ్ఞప్తి

వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ

టెక్స్‌టైల్స్ సిటీ దైగులో పర్యటన



తుమ్ము ఆపితే!

పెను ప్రమాదం తప్పదని శాస్త్రవేత్తల హెచ్చరిక

గొంతులో గాయం.. మెదడు నరాలు చిట్లే ముప్పు

లండన్, జనవరి 16:

సాధారణంగా పదిమందిలో ఉన్నప్పుడో, ఆఫీసులో పని చేసుకుంటున్నప్పుడో తుమ్ములు వస్తే ఆపేసుకోడానికి ప్రయత్నించేవాళ్లు చాలా మందే ఉంటారు. కానీ అది ఎంత ప్రమాదకరమో తెలుసా? తుమ్ము మిగతా 6లో..





పంపిణీ... పకడ్బందీ!

'పాస్‌బుక్'ల కోసం గ్రామానికో నోడల్ అధికారి

మార్చి 11కల్లా ఊరూరికీ చేర్చే ఏర్పాటు చేయాలి

ప్రజాప్రతినిధులుసహా అందరూ భాగం కావాలి

ఇకపై జిల్లా మొత్తానికీ ఒకే రెవిన్యూ కోర్టుండాలి

రాష్ట్రంలో నాలుగువేల కొత్త పంచాయతీలకు రూపు

ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ యోచన

మార్చి 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు!

రాష్ట్ర ఆర్థిక కమిషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయింపు

ప్రగతి భవన్‌లో కలెక్టర్లతో సమీక్షలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, జనవరి 16:

రాష్ట్రంలో మార్చి 11 నుంచి ఏకకాలంలో రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ కోసం గ్రామానికో నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. మంగళవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఆయన అనేక అంశాలపై సమీక్షించారు. పాస్‌పుస్తకాల పంపిణీలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మండలి చైర్మన్, వైస్-చైర్మన్, మిగతా 6లో..



హజ్ సబ్సిడీ ఖిల్లాస్

ఈ ఏడాది నుంచే తీసేసిన కేంద్రం

'సగౌరవ ప్రగతి' లక్ష్యం.. సబ్సిడీతో ముస్లింలకు ఉపయోగం లేదు

ఏజెన్సీలే లాభపడుతున్నాయి.. ఆ సొమ్ము బాలికల విద్యకు ఇస్తాం

నౌకామార్గంలోనూ హజ్ యాత్ర.. దాంతో తగ్గనున్న ఖర్చు

కేంద్రమంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ వెల్లడి.. ఏఐఎంపీఎల్బీ హర్షం

6లో..

ఇదీలోకం!



ఈసారి కోళ్ల పందెంలో కాదే..

కుర్చీల పందెంలో బెట్టుకాసి సంపాదించా..!



నన్ను చంపే

కుట్ర

నా గొంతు నొక్కేస్తున్నారు

ఎన్‌కౌంటర్ చేసేస్తారేమో!

వీహెచ్‌పీ అధినేత తొగాడియా

కేంద్రంపై పరోక్ష ఆరోపణలు

7లో..

విద్యా సంస్థలేవీ?

ఇతర రాష్ట్రాలకు ఇస్తున్నారు.. మాకు ఇవ్వరా?



రాష్ట్రం వచ్చాక ఒక్క సంస్థ కూడా ఇవ్వలేదు

ట్రిపుల్ ఐటీ ఏమైంది.. కేవీలపై స్పందనేదీ

ట్రైబల్ వర్సిటీకి భూమి ఇచ్చినా నిధులేవీ?

కేంద్రాన్ని నిలదీసిన డిప్యూటీ సీఎం కడియం

ఢిల్లీలో ప్రాథమిక, ఉన్నత విద్యపై సమావేశం

హైదరాబాద్, జనవరి 16(మనం ప్రతినిధి):

రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణకు ఒక్క విద్యాసంస్థను కూడా కేటాయించలేదని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ''అన్ని రాష్ట్రాలకు ట్రిపుల్ ఐటీ ఇచ్చారు. తెలంగాణకు ఇవ్వలేదు. రాష్ట్రం ఏర్పడ్డాక కేంద్రం ఒక్క విద్యాసంస్థను కూడా కేటాయించలేదు. కొత్త మిగతా 6లో..



కొత్త రాజ్యాంగ

ధర్మాసనం

ఐదుగురు జడ్జిలతో సీజేఐ ఏర్పాటు

ఆ 'నలుగుర్నీ' మినహాయించిన మిశ్రా

జడ్జి చతుష్టయంపై జూనియర్ ఆగ్రహం

7లో..

వారాంతంలో ఊరట!

సుప్రీం సంక్షోభానికి చుక్క పడలేదు

రెబెల్ జడ్జిలతో చీఫ్ జస్టిస్ భేటీ

చక్కబడుతుందని ఆశిద్దాం: ఏజీ

7లో..

వాతావరణం

తెలుగు రాష్ట్రాలలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. బుధవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది. పగటిపూట వేడి, రాత్రిళ్లు చలి గాలులు ఉండే అవకాశముంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 31 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 45 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య ఉ.7.47 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా.10.16 తదుపరి శ్రవణం; శేషవర్జ్యం: ఉ.6.07 వరకు, వర్జ్యం: తె.2.44-4.31; దుర్ముహూర్తం: మ.12.04-12.48; రాహుకాలం: మ.12.26-1.49; అమృతఘడియలు: మ.3.08-4.55; శుభసమయం: లేదు;

సూర్యోదయం: 6.53

సూర్యాస్తమయం: 5.59

పెట్రో మంటలు!

రికార్డు స్థాయికి ధరలు.. మూడేళ్ల గరిష్ఠానికి చేరిక

పెరుగుతున్న ముడి చమురు ధరలు

ఢిల్లీలో లీటర్ డీజిల్ 61.88..పెట్రోల్ 71.27

ముంబైలోనే అత్యధికం.. లీటర్ పెట్రోలు 79.15

హైదరాబాద్‌లో డీజిల్ లీటరు 67.08

పెట్రోల్ లీటరు 75.37కు చేరిక



న్యూఢిల్లీ, జనవరి 16:

పెట్రోల్, డీజిల్ ధరలు మండుతున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు అమాంతం పెరగడంతో.. దేశీయంగానూ పైపైకి దూసుకుపోతూ దాదాపు మూడేళ్ల గరిష్ఠానికి చేరుకున్నాయి. మంగళవారం లీటరు డీజిల్ ధర రూ.61.88కు చేరుకోగా.. లీటర్ పెట్రోల్ ధర రూ.71 దాటింది. ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.71.27గా ఉంది. 2014 ఆగస్టు మిగతా 6లో..





అల్లుడు దొంగ!

అత్తగారింట దోపిడీ... నంగనాచిలా బురిడీ

కారం చల్లి ఆధారాలు మాయంచేసే యత్నం

సీసీటీవీ ఫుటేజీలలో దొంగల్లుడి గుట్టురట్టు

అమీర్‌పేట, జనవరి 16 (మనం న్యూస్):

పిల్లనిచ్చిన మామకే సున్నం పెట్టాడో అల్లుడు దొంగ! సనత్ నగర్ బీకే గూడలో డిసెంబరు 31న చోటు చేసుకున్న ఈ ఉదంతం వివరాలను వెస్ట్‌జోన్ డీసీపీ ఎ.వెంకటేశ్వరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు... ఎస్.ఆర్.నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నివసించే బి.ఆంథోనీ తన భార్యతో పాటు నవంబరు 20న అమెరికా వెళుతూ తమ అత్తగారిని ఇంట్లో వదిలి వెళ్లారు. ఆంథోనీ కూతురు జోష్న, జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేసే అల్లుడు హ్యారీ ఆంథోనీ పాస్కల్ (34) మిగతా 6లో..

తంమనిషిలాంటి సోఫియా!

ఈ చిత్రంలో చూస్తున్న రోబో పేరు సోఫియా! మనుషులకు ఉండేటటువంటి తెలివి దీని సొంతం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కలిగిఉండే ఈ రోబోను హాంగ్‌కాంగ్‌కు చెందిన హాన్సన్ రోబోటిక్స్ సంస్థ తయారు చేసింది.
ఆ సంస్థ వ్యవస్థాపకుడు డేవిడ్ హాన్సన్‌కు ఆ రోబో ప్రేమతో ఆపిల్‌ను



9 ఏళ్ల క్రితం మరణించాడు.. అయినా వాంగ్మూలం ఇచ్చాడు!



భోపాల్, జనవరి 16: చనిపోయిన వ్యక్తి వాంగ్మూలం ఇచ్చాడు, ఆ వ్యక్తి మరణించిన 9 ఏళ్ల తర్వాత ఈ వాంగ్మూలం ఇచ్చినట్టు ఓ అధికారి నివేదిక సమర్పించడం విశేషం. మధ్యప్రదేశ్ లోకాయుక్తలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న అధికారి, భూ కుంభకోణంపై దర్యాప్తు జరిపారు. ఈమేరకు వాంగ్మూలంతో కూడిన నివేదికను ప్రత్యేక కోర్టుకు సమర్పించారు. నివేదికలో 9 ఏళ్ల క్రితం మరణించిన వ్యక్తి వాంగ్మూలం, మరణ ధృవీకరణ పత్రం కూడా ఉంది. 141 మంది రైతులకు చెందిన 800 ఎకరాల వ్యవసాయ భూమిని వారి అంగీకారం లేకుండానే వేలం వేసిన కుంభకోణంపై సాగుతున్న దర్యాప్తులో ఇలాంటి ఎన్నో మలుపులు చోటుచేసుకుంటున్నాయి. స్థానిక గ్రామీణ బ్యాంకు ఇచ్చిన రుణాన్ని తిరిగి తీర్చనందుకు రూ. 1,600 కోట్ల విలువైన భూములను కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలప్రకారం కేవలం రూ. 1.5 కోట్లకు వేలం వేశారు. దీనిపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించిన లోకాయుక్త 2013, జూలైలోనే పలువురు అధికారులతోపాటు, వేలంలో భూమిని సొంతం చేసుకున్న వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కుంభకోణంపై సాగుతున్న దర్యాప్తులో భాగంగా బాధితుడైన రాధేలాల్ అనే రైతు వాంగ్మూలాన్ని 2013, ఏప్రిల్ 20న నమోదు చేసినట్టు పేర్కొన్నారు. కాగా తాను 8,000 రూపాయల రుణాన్ని తిరిగి స్థానిక గ్రామీణ బ్యాంకుకు చెల్లించలేకపోయినందున, తన 7.10 ఎకరాల వ్యవసాయ భూమిని అతి చవకగా వేలంలో అమ్మేసినట్టు రాధేలాల్ చెప్పినట్టు వాంగ్మూలంలో ఉంది. మరోవైపు తమ గ్రామానికే చెందిన సర్పంచ్ మాత్రం రాధేలాల్ 2004, ఆగస్టు 16న మరణించినట్టు మరణ ధృవీకరణ పత్రం ఇచ్చారు.



సోషల్ మీడియాలో దుష్ప్రచారం

- సైన్యానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు: రావత్

న్యూఢిల్లీ, జనవరి 16: భారత సైన్యానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారని, దీనిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ పేర్కొన్నారు. 70వ సైనిక దినోత్సవం సందర్భంగా సోమవారం న్యూఢిల్లీలోని కరియప్ప మైదానంలో జరిగిన కార్యక్రమంలో రావత్ పాల్గొన్నారు. సరిహద్దుల్లో పాకిస్థాన్ చొరబాట్లను ప్రోత్సహిస్తోందని, మన సైనిక దళాలు దీటుగా ఎదుర్కొంటున్నాయని, ఆ దేశం ఎప్పుడూ విజయం సాధించలేదని చెప్పారు. భారత్, చైనా సరిహద్దుల్లో ఉద్రికత్తలను రావత్ ప్రస్తావిస్తూ.. మన సైన్యం దురాక్రమణలను అడ్డుకుంటుందని, వాస్తవాధీన రేఖ వెంబడి రక్షణ కల్పించడం మన ప్రధాన కర్తవ్యమని అన్నారు. సైన్యం కోసం ఆధార్ ఆధారిత మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందని రావన్ పేర్కొన్నారు.

3,547 కోట్లతో అసాల్ట్ రైఫిల్స్ కొనుగోలు

న్యూఢిల్లీ, జనవరి 16: దాదాపు 13 ఏళ్ల తర్వాత నూతన తరం అసార్ట్ రైఫిల్స్, సీక్యూబీ కార్బైన్స్ కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 3,547 కోట్ల వ్యయంతో 72,400 అసాల్ట్ రైఫిల్స్, 93,895 కార్బైన్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని డీఏసీ సమావేశం నిర్ణయం తీసుకుంది. అలాగే, ఆయుధ కొనుగోళ్లకు సంబంధించి నిబంధనలను కూడా సులభతరం చేసే ప్రతిపాదనలకు డీఏసీ ఆమోదించింది. అసాల్ట్ రైఫిల్స్‌ను ప్రపంచ దేశాల మార్కెట్ల నుంచి సేకరించనున్నారు. ఈ మేరకు త్వరలో గ్లోబల్ టెండర్లను పిలవనున్నారు.

అఫ్ఘాన్‌లో భారత ఎంబసీపై రాకెట్ దాడి

- స్వల్పంగా దెబ్బతిన్న భవనం.. సిబ్బంది సురక్షితం



న్యూఢిల్లీ, జనవరి 16: ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని భారతీయ ఎంబసీపై క్షిపణి దాడి జరిగింది. భవనం స్వల్పంగా దెబ్బతింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేసింది. ఎంబసీలోని ఉద్యోగులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపింది. ఐటీబీపీ భద్రతా బలగాలు ఉండే మూడు బ్యారక్‌లకు చేరువలో రాకెట్ పడినట్లు విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ పేర్కొన్నారు. అయితే, భారతీయ ఎంబసీ లక్ష్యంగానే ఈ దాడి జరిగిందా? అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

కొరియా ద్వీపం చుట్టూ అమెరికా 'అణు' బాంబర్లు

- పెద్ద సంఖ్యలో మోహరింపు

సియోల్/టోక్యో, జనవరి 16: కొరియా ద్వీపకల్పం చుట్టూ అమెరికా స్టెల్త్ బాంబర్లను భారీ సంఖ్యలో మోహరిస్తోంది. గ్వామ్ దీవులను ఉత్తరకొరియా లక్ష్యంగా చేసుకున్న నేపథ్యంలో ఇప్పటికే అక్కడ బీ2ఎస్, బీ-1బీఎస్ బాంబర్లను మోహరించిన అమెరికా.. తాజాగా అణ్వాయుధాలను మోసుకెళ్లగల ఆరు బి-52 బాంబర్లను తరలించింది. వీటితోపాటు మరో 300 మంది సుశిక్షితులైన ఆర్మీ సిబ్బందిని కూడా ఆండర్సన్ బేస్‌కు పంపింది. కాగా, వచ్చే నెలలో సియోల్‌లో వింటర్ ఒలింపిక్స్ జరగనున్న నేపథ్యంలో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌సహా నేలమీద, నీటిమీద పోరాడగల షిప్‌ను ఆ ప్రాంతంలో దించుతోంది. ఇది అతి సాధారణ విషయమని, కేవలం భద్రతపరమైన చర్యల్లో భాగంగానే స్టెల్త్ బాంబర్స్ ను రంగంలోకి దించుతున్నామని అమెరికా మిలటరీ అధికారులు చెబుతున్నారు. ఒలింపిక్స్ ముగిసేవరకూ ఎలాంటి యుద్ధ విన్యాసాలను నిర్వహించటం లేదని వాషింగ్టన్ అధికార వర్గాలు తెలిపాయి. సియోల్‌తో చర్చలకు అమెరికా నెమ్మదిగా చేరువవుతోందని ఉత్తరకొరి యా చెబుతోంది. మరోపక్క కొరియాకు చెందిన ఇరు వర్గాల నేతలు రెండో దశ చర్చలను కొనసాగిస్తున్నారు. తాజా చర్చలు సఫలమైతే ఉత్తరకొరియా ఈ క్రీడల్లో పాల్గొనడానికి మార్గం సుగమం అవుతుంది.

భారత్‌తో మీకు ముప్పలేదు..

- పాక్‌ను సముదాయిస్తున్న అమెరికా
- స్వయంగా వెల్లడించిన పాకిస్థాన్ ప్రభుత్వం

ఇస్లామాబాద్, జనవరి 16: భారత్‌తో పాకిస్థాన్‌కు ఎటువంటి ముప్పులేదని, పాక్ ప్రభుత్వాన్ని సముదాయించే ప్రయత్నం అమెరికా చేస్తోందని, పాక్ రక్షణ శాఖామంత్రి ఖుర్రం దస్తగిర్ ఖాన్ వెల్లడించారు. 'ఇస్లామాబాద్, వాషింగ్టన్ మధ్య ఉన్న అపార్థాలను తొలగించేందుకు మర్యాద పూర్వక భేటీ తక్షణం జరగాలి, ఈ భేటీలో దాపరికం లేకుండా అన్ని విషయాలపై కరాఖండిగా చర్చలు జరపాలి'అని ఖుర్రం అభిప్రాయపడ్డారు. పాక్ పార్లమెంట్‌లో ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని చదివి వినిపించిన ఆయన, సరిహద్దు రేఖ వద్ద భారత్ ప్రదర్శిస్తున్న ఆవేశాన్ని అమెరికా తక్కువ చేసి చూపిందని ఆరోపించారు. భారత్‌పట్ల తమ వ్యూహాత్మక వైఖరిని మార్చుకోవాలంటూ వాషింగ్టన్ చెబుతూ వస్తోందన్నారు. పాక్-అమెరికా మధ్య సంస్థాగతమైన విభేదాలను భారత్ ఆసరాగా చేసుకుందని ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వా'డీలా'

ఆహార పంపిణీ కేంద్రాలుగా అంగన్‌వాడీ సెంటర్లు



- అద్దె భవనాలు, అరకొర వసతులతో అవస్థ
- సిబ్బంది కొరతతో పెరుగుతున్న ఇబ్బందులు
- ఉన్నతాధికారుల అరకొర పర్యవేక్షణతో తిప్పలు
- కార్యకర్తలపై అధికమవుతున్న పని భారం

హైదరాబాద్, జనవరి 16(మనం ప్రతినిధి): అరకొర వసతి, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది కొరత, పెరుగుతున్న పని భారం వంటి సమస్యలతో రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు లక్ష్య దూరంగా పని చేస్తున్నాయి. ఆయా సమస్యల కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నపిల్లల ఆహార పంపిణీ కేంద్రాలుగా మారాయి. ప్రీ ఎడ్యుకేషన్ ఊసే లేకపోగా, రెండు నుంచి మూడు గంటల పాటు పిల్లలను కేంద్రంలో ఉంచి, ఆహారం పెట్టి తిరిగి పంపేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపణలు చేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణతో పాటు చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నిర్మూలించిండం, ప్రీ ప్రైమరీ విద్యను అందించడం కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఇవి ఆహార పంపిణీ కేంద్రాలుగా మారిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విధానంలో నడవాలని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలకు, లబ్ధిదారులకు సేవలు అందించాలని మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు ఉన్నాయి. ఈ మేరకు ఓ టైమ్ టేబుల్‌ను కూడా ఆ శాఖ విడుదల చేసింది. కానీ అది ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. అంగన్‌వాడీల నిర్వాహకులు ఇచ్చే నివేదికలను చూసి ఉన్నతాధికారులు అంతా సవ్యంగా నడుస్తోందని మిన్నకుండిపోవడం గమనార్హం

ఆది నుంచి అవస్థలే..

ప్రారంభం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు అరకొర వసతుల మధ్యే నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో చాలా కేంద్రాలను నేటికి అద్దె భవనాలను నిర్వహిస్తున్నారు. వసతుల లేమితో ఇబ్బంది పడుతున్న నిర్వాహకులకు అద్దె చెల్లింపు తలనొప్పిగా తయారయ్యింది. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలకు సంబంధించిన అద్దెను ప్రభుత్వమే చెల్లిస్తుంది. అయితే ప్రభుత్వం నుంచి రెండు లేదా మూడు నెలలకు ఒకసారి బిల్లు మంజూరు అవుతోంది. ఈ లోపు నిర్వాహకులు, భవన యజమా



నులకు మధ్య గొడవలు తప్పడం లేదు. అంతేకాక అంగన్‌వాడీ కేంద్రాలకు ఇళ్లు అద్దెకు దొరకడం కూడా కష్టంగా మారింది. నామామత్రపు అద్దెకు రెండు గదుల ఇళ్లు కేటాయించడంతో పాటు, కేంద్రానికి బాలింతలు, గర్భిణులు, చిన్నారులు వస్తుండడంతో నీళ్ల వాడకం, మరుగు దొడ్డి వినియోగం అధికంగా ఉంటుంది. దీంతో ఇల్లు ఇచ్చేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. దీనికి తోడు ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా అందులో అంగన్‌వాడీ కార్యకర్తలను భాగస్వామ్యులను చేస్తోంది. ఓవైపు బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సంబంధించి పనులను నిర్వహిస్తున్న కార్యకర్తలకు అదనంగా సర్వేలు, సమావేశాలు అంటూ నిత్యం ఏదో ఒక కార్యక్రమం ఉంటుంది.

చిన్నపిల్లలకు దొడ్డు బియ్యమేనా..?

వసతి గృహాల్లో, పాఠశాలల్లో సన్నబియ్యం భోజనం అందిస్తూ, చిన్నపిల్లలకు, గర్భిణులకు బాలింతలకు దొడ్డు బియ్యంతో కూడిన ఆహారం అందించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇక గుడ్డు విషయంలోనూ అనేక ఆరోపణలు ఉన్నాయి. గుత్తేదారులు పౌల్ట్రీలో మిగిలి పోయిన చిన్నసైజు గుడ్లను సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

వసతుల లేమి, సిబ్బంది కొరత

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు సుముఖంగానే ఉన్నప్పటికీ కేంద్రాల్లో వసతులను చూసి వెనకడుగు వేస్తున్నారు. పలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, గదులు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవు. టైం టేబుల్‌లో పిల్లలు నిద్రించేందుకు సమయాన్ని కేటాయించిన అధికారులు అందుకు అవసరమైన వసతి కల్పనపై మాత్రం దృష్టి పెట్టలేదు. సరైన వసతి లేక చాలా కేంద్రాల్లో ఆరుబయటే వంట చేస్తున్నారు. కొన్ని అంగన్‌వాడీలకు శాశ్వత భవనాలు ఉన్నప్పటికీ సిబ్బంది లేకపోవడంతో కేంద్రాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ప్రహరీలు లేక మరుగుదొడ్లను బయటివా రు ఉపయోగిస్తుండడంతో కొద్ది రోజులకే అవి నిరుపయోగంగా మారుతున్నాయి. అరకొర సిబ్బందితో ఈ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. రాష్ట్రంలోని అనేక కేంద్రాల్లో ఆయాలు, టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేంద్రాల పనితీరును పర్యవేక్షించే అధికారుల పోస్టుల కూడా ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత వల్ల అనుకున్న లక్ష్యాలు సాధించలేకపోతున్నారు. ప్రభుత్వ పథకాల ప్రకారం సభలు, సమావేశాలకు అంగన్‌వాడీ కార్యకర్తలను, టీచర్లను వినియోగించడం కూడా సెంటర్ల నిర్వహణకు ఇబ్బందిగా మారింది.

రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల వివరాలు

రాష్ట్రవ్యాప్తంగా 149 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 99 ప్రాజెక్టులు ఉండగా, అర్బన్ ప్రాంతాల్లో 25, ట్రైబల్ ప్రాంతాల్లో మరో 25 ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల కింద 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 31,711 మంది అంగన్‌వాడీలు ఉన్నారు. ఇవేకాక 3,989 మినీ అంగన్‌వాడీలు ఉన్నాయి.

చిన్నారుల వివరాలు..

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 22,28,150 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో గర్భిణులు, బాలింతలు 5,31,310 మంది ఉన్నారు. ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులు 10,42,679 మంది ఉన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు చిన్నారులు 6,54,165 మంది పిల్లలు ఉన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులు

149 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 5,479 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 1360 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 1010 మినీ అంగన్‌వాడీ పోస్టులు, 3,109 హెల్పర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పాక్ కవ్వింపులపై భారత్ ప్రతీకారం

- ఏడుగురు పాక్ జవాన్లు మృతి



న్యూఢిల్లీ, శ్రీనగర్, జనవరి 16: సరిహద్దుల్లో పదేపదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. శనివారం కూడా రాజౌరీలోని నియంత్రణ రేఖ వద్ద పాక్ కాల్పులు జరపగా.. ఓ భారత జవాను ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆగ్రహించిన భారత్ ప్రతీకార చర్యకు దిగింది. పాక్ సైన్యంపై కాల్పులు జరిపి ఏడుగురు జవాన్లను హతమార్చింది. కాగా పాక్ అధికారులు తమ సైన్యంలో నలుగురు జవాన్లు మరణించారని ప్రకటించారు.సోమవారం ఉదయం పూంఛ్ జిల్లాలోని నియంత్రణ రేఖ వెంబడి పాక్ రేంజర్స్‌పై భారత సైన్యం కాల్పులు జరిపిందని ఓ సీనియర్ ఆర్మీ అధికారి తెలిపారు. ఈ కాల్పుల్లో ఏడుగురు పాక్ సైనికులు మృతి చెందారని, మరో నలుగురు గాయపడ్డారని ఆయన పేర్కొన్నారు. ఆర్మీ డే(జనవరి 15) రోజు భారత్‌కు ఇది పెద్ద విజయంగా పలువురు అభివర్ణిస్తున్నారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు పాక్ అధికారులు కూడా ఈ వార్తను ధృవీకరించారు. ''నియంత్రణ రేఖ వెంబడి భారత్ దళాలు కాల్పులు జరపగా, పాక్ తిప్పికొట్టింది. ఈ ఘటనలో నలుగురు జవాన్లు మరణించగా, ముగ్గురు భారత్ సైనికులు కూడా మరణించారని'' పాకిస్థాన్ ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ పేర్కొన్నట్లు పాకిస్థాన్ డెయిలీ డాన్ తెలిపింది.

ఐదుగురు జైషే ఉగ్రవాదుల హతం

శ్రీనగర్‌కు వంద కిలోమీటర్ల దూరంలోని యూరి సెక్టార్ వద్ద సరిహద్దులో చొరబాటుకు యత్నించిన ఐదుగురు జైషే మహమద్ ఉగ్రవాదులు భారత్ దళాల చేతిలో హతమయ్యారు. పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి ప్రవహించే జేలం నది గుండా దేశంలోకి వచ్చేందుకు యత్నించిన ఉగ్రవాదులను భారత్ దళాలు గుర్తించి, కాల్పులు జరపగా ఐదుగురు ఉగ్రవాదులు మరణించారు. నాలుగు మృతదేహాలను దళాలు స్వాధీనం చేసుకోగా, ఒక మృతదేహం ఉగ్రవాదుల్లో నది దాటేందుకు యత్నించిన పడవలోనే ఉంది.

హరియాణలో కామాంధుల ఉన్మాదం

- మైనర్ బాలికలపై అత్యాచారం
- వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి



హరియాణ, జనవరి 16: హరియాణాలో కామాంధుల దాహానికి ఇద్దరు బాలికలు బలయ్యారు. హరియాణా రాష్ట్రం కురుక్షేత్ర జిల్లాకు చెందిన పదిహేనళ్ల బాలికను చిత్రహింసలకు గురిచేసి అత్యాచారం చేసి చంపగా, పానిపట్ జిల్లాకు చెందిన పదకుండేళ్ల బాలికను చంపి, ఆపై అత్యాచారం చేశారు. కురుక్షేత్రకు సమీపంలోని ఓ గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందిన ఓ పదిహేనళ్ల బాలిక ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. నిరుపేద కుటుంబ నేపథ్యం అయినప్పటికీ డాక్టర్ కావాడమే లక్ష్యంగా శ్రమిస్తోంది. గత మంగళవారం ట్యూషన్‌కు వెళ్లి కనిపించకుండా పోయిన బాలిక శనివారం ఉదయం జింద్ జిల్లాలోని ఓ చెరువు వద్ద శవమై కనిపించింది. అర్ధనగ్నంగా ఉన్న బాలిక మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కూడా కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, బాలికను చిత్రహింసలకు గురి చేసి, అత్యాచారం చేసి చంపారని, ఇద్దరు కంటే ఎక్కువ మంది ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని పోలీసుల తెలిపారు. ఈ కేసుకు సంబంధించి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఈ ఘటనతో సంబంధం ఉందని భావిస్తున్న ఓ యువకుడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

హరియాణాలోని పానిపట్‌లో జరిగిన మరో దుర్ఘటనలో దళిత సామాజిక వర్గానికి చెందిన పదకుండేళ్ల బాలిక కామాంధుల చేతిలో బలయ్యింది. తమ సహకరించలేదన్న కోపంతో ఆ బాలికను చంపిన కిరాతకులు ఆపై అత్యాచారం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. పానిపట్ జిల్లాలోని ఉర్లాన్ కాలన్ జిల్లాకు చెందిన 11ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్(28), సాగర్(22) శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఎత్తుకెళ్లి బలాత్కారం చేయబోయారు. బాలిక ప్రతిఘటించడంతో ఆమెను తన చున్నీతోనే చంపి, ఆపై అత్యాచారం చేశారు. తిరిగి రాత్రి 11 గంటల సమయంలో గ్రామ శివారులోని చెరువు వద్ద మృతదేహాన్ని పడేశారు.

సన్యాసిగా మారనున్న ఐఐటీయన్


- అమెరికాలో ఇంజినీర్ కెరీర్‌కు గుడ్‌బై
- ప్రశాంతత కోసమే దీక్ష అన్న కెమికల్ ఇంజినీర్

ముంబై, జనవరి 16: ఐఐటీ బాంబేలో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తీ చేశాడు, పెద్ద జీతంతో అమెరికాలో స్థిరపడ్డాడు, ఇవేవీ తనకు సంతృప్తినివ్వలేకపోతున్నాయన్న ఆవేదన.. సీన్ కట్ చేస్తే... సన్యాసాన్ని స్వీకరించేందుకు నిర్ణయం తీసుకున్నాడు. ఇదంతా 29 ఏళ్ల సాకేత్ పారేఖ్ అనే వ్యక్తి గురించి, త్వరలో యూఎస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలని కూడా ప్రణాళిక వేసుకున్న ఈయన, తన సీనియర్‌తో చాట్ చేస్తూ జైన సన్యాసిగా మారాలనే కఠోర నిర్ణయం తీసుకోవడం విశేషం. ముంబైలోని బోరివ్లిలో ఈనెల 22వ తేదీన 16మంది దీక్ష తీసుకోనుండగా, సాకేత్ కూడా వారిలో ఒకరిగా నిలవడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

మరో ఐఐటీయన్ చెబితే..

నిజానికి సాకేత్ వైష్ణవాన్ని అవలంభించే కుటుంబం నుంచి వచ్చినప్పటికీ, తన సీనియర్ భావిక్ షా అనే ఐఐటీయన్ సలహాతో జైనమతాన్ని స్వీకరించేందుకు సిద్ధమయ్యారు. భావిక్ కూడా 2013లో తన కెరీర్‌ను వదిలి, దీక్ష తీసుకున్నాడు. నాస్తికుడైన సాకేత్, తనకు జీవితంలో ప్రశాంతత లేకుండా పోయిందని చెప్పుకొచ్చాడు, కానీ దీక్ష తీసుకోవాలని నిర్ణయించిన క్షణం నుంచి మనసులో తెలియని ప్రశాంతతను ఆస్వాదిస్తున్నట్టు మీడియాకు వివరించాడు. మరికొన్ని రోజుల్లో లక్షల రూపాయాల జీతాన్ని వదిలి, అత్యాధునిక జీవితాన్ని వదిలి, కేవలం సన్యాసిగా, సాధువుగా మాత్రమే జీవించనున్నాడు. దీక్ష తీసుకునే కార్యక్రమానికి సాకేత్ తల్లి, సోదరి కూడా హాజరవుతున్నారు. 'కొన్నేళ్ల క్రితం నాన్న మరణించారు, నేను జైనమతం స్వీకరించి, సన్యాస దీక్షను తీసుకుంటానని నాతల్లికి నచ్చజెప్పేందుకు చాలా సమయం పట్టింది, కానీ సన్యసించడంలో మాత్రమే నాకు సంతోషం ఉందని తేల్చి చెప్పాను, దీంతో ఆమె ఇక మారు మాట్లాడలేక పోయింది' అంటున్న సాకేత్‌తోపాటు దీక్ష తీసుకుంటున్నవారిలో అత్యధికులు 30 ఏళ్ల లోపువారే!

ధార్మిల్ అనే 16 ఏళ్ల కుర్రాడు గంటలతరబడి ఫోన్లో ఫన్నీ వీడియోలు చూస్తూ, యూట్యూబ్‌తో ఎక్కువగా కాలక్షేపం చేసేవాడు. మూడేళ్లక్రితం ఆచార్య యుగ్భూషణ్‌సుర్జి అనే జైన మతగురువు



మాటలు విన్న ధార్మిల్‌లో ఆధ్యాత్మిక చింతన విపరీతంగా పెరిగి, ఆఖరుకి తల్లి దండ్రులను ఒప్పించి, 9వ తరగతి తరువాత స్కూల్ మానేసి, ప్రైవేటుగా 10వ తరగతి పరీక్షలు రాసాడు. జైనమత పవిత్ర గ్రంథాలు చదువుతూనే 10వ తరగతి పరీక్షల్లో 87 శాతం మార్కులు సాధించిన ధార్మిల్‌కూడా దీక్ష తీసుకుంటున్న వారిలో ఒకరు కావడం విశేషం. కాగా ఇటీవలికాలంలో విద్యాధికులు, ప్రముఖ వ్యాపారులు, టీనేజర్లు జైనమతంలో దీక్ష తీసుకునేందుకు పెద్ద ఎత్తున వస్తుండడం సరికొత్త రికార్డు సృష్టిస్తోంది. దేశ విదేశాల్లోని ప్రముఖ విద్యాసంస్థల్లో చదివి, ప్రముఖ కంపెనీల్లో ఆరంకెల్లో జీతాలు తీసుకుంటున్నవారు జైనమతం పట్ల ఆకర్షితులవుతున్నారు.

పోలీసు భవనం జిల్లాకే తలమానికం



- రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్‌లో నిర్మాణ పనుల పరిశీలన

నాగర్‌కర్నూల్, జనవరి 16(మనం ప్రతినిధి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ చౌరస్తాలో నిర్మిస్తోన్న పోలీసు భవన సదుపాయం జిల్లాకే తలమానికం అవుతుందని రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన ఆయన పోలీసు భవన సముదాయ నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ డీజీపీకి ఘన స్వాగతం పలికారు. డీజీపీ భవన సముదాయ వివరాలను వివరించారు. భవన సముదాయానికి సంబంధించిన మ్యాపులను డీజీపీ పరిశీలించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ వీలైనంత త్వరగా పనుల పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తొలుత జిల్లా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. డీజీపీ వెంట హైదరాబాద్ రీజియన్ ఐజీపీ స్టీఫెన్ రవీంద్ర తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా డీఎస్పీ, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.



నేడు ఢిల్లీకి మంత్రి హరీశ్

- కందుల కొనుగోలుపై కేంద్రానికి విజ్ఞప్తి!

హైదరాబాద్, జనవరి 16: రాష్ట్ర మార్కెంట్ శాఖ మంత్రి హరీశ్‌రావు బుధవారం వెళుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కందుల కొనుగోలు పరిమితిని పెంచాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని కోరనున్నట్లు సమాచారం. ఈ సీజన్‌లో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల కందులు దిగుబడి కానుందని అంచనా. కాగా కేంద్రం 33 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనేందుకు సుముఖత చూపింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ మార్కెటింగ్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులకు లబ్ధి చేకూర్చేలా కొత్త పద్ధతులను ప్రవేశపెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కనీస మద్దతు ధర, చెల్లింపులపై చర్చించారు. బకాయిలు చెల్లించాలని ఆదేశించారు. కోహెడ మార్కెట్ ఏర్పాటు, ఆధునీకరణకు సంబంధించి 15 రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారధి, కమిషనర్ డాక్టర్ జగన్మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మిబాయి, డిప్యూటీ డైరెక్టర్‌లు లక్ష్మణుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్ పనులకు సహకరించండి

- ఆంధ్రప్రదేశ్ మంత్రి దేవినేనికి హరీశ్ లేఖ
- అంగీకరిస్తే కర్ణాటకతో త్రైపాక్షిక సమావేశం

హైదరాబాద్, జనవరి 16 (మనం న్యూస్): రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) ఆధునీకరణ పనులకు సహకరించాలంటూ తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు ఆయన ఓ లేఖ రాశారు. ఆర్డీఎస్ హెడ్‌వర్క్ పనులకు సంబంధించి చర్చలకు రావాలని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఏపీ సహకరిస్తే జూలైలోగా ఆర్డీఎస్ పనులు పూర్తి చేస్తామని లేఖలో తెలిపారు. తెలంగాణ, కర్ణాటక, ఏపీ ఆయకట్టుదారుల ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులకు ఏపీ చొరవ చూపాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం కర్ణాటకతో త్రైపాక్షిక చర్చలు జరుపుదామన్నారు. ఏపీకి అనువైన తేదీలను సూచిస్తే సమావేశం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రాజోలి బండ ఆయకట్టు రైతుల కోసం తమకు సహకరించాలని హరీశ్‌లో లేఖలో విన్నవించారు.

ఆ ఖైదీలను విడుదల చేయండి


- క్షమాభిక్ష పెట్టి, ఎన్నికల హామీని నెరవేర్చండి
- కేసీఆర్‌కు కాంగ్రెస్ నేత రేవంత్ బహిరంగ లేఖ



హైదరాబాద్, జనవరి 16(మనం ప్రతినిధి): దీర్ఘకాలంగా జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి రాసిన బహిరంగ లేఖను మీడియాకు విడుదల చేశారు. ఐదు సంవత్సరాలు వాస్తవ శిక్ష పూర్తిచేసిన మహిళా ఖైదీలను, ఏడు సంవత్సరాల శిక్ష పూర్తి చేసుకున్న మగ ఖైదీలను గణతంత్ర దినోవత్సవం రోజున విడుదల చేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన కోరారు. గత ప్రభుత్వాలు పలు సందర్భాల్లో ప్రత్యేక జీవోల ద్వారా ఖైదీలను విడుదల చేసిన విషయాన్ని ఆయన లేఖలో ప్రస్తావించారు. అధికారంలో వచ్చిన తర్వాత ఐదేళ్ల శిక్ష కాలం పూర్తి చేసుకున్న ఖైదీలను విడుదల చేస్తామని, తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ పలు మార్లు వాగ్దానం చేశారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడి నాలుగేళ్లు అవుతుందని, కేసీఆర్ ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం కేసీఆర్ ప్రభుత్వం ప్రసాదించిన క్షమాభిక్ష వందలాది మంది ఖైదీలను నిరాశ పరిచిందని పేర్కొన్నారు. ఐదేళ్ల శిక్ష పూర్తి చేసిన వారిని కాకుండా 12 నుంచి 14 సంవత్సరాలు వాస్తవ శిక్ష , ఆరు సవంత్సరాల రిమిషన్‌తో కలిపి 18 నుంచి 20 సంవత్సరాలు శిక్ష పూర్తి చేసుకున్న వారికి మాత్రమే క్షమాబిక్ష పెట్టి విడుదల చేశారని రేవంత్ గుర్తు చేశారు. ఈ కాల పరిమితి మూలంగా వందలాది మంది విడుదలకు నోచుకోలేదని తెలిపారు. ఈ సారైనా ఐదు సంవత్సరాలు వాస్తవ శిక్ష పూర్తి చేసుకున్న వారిని విడుదల చేసేందుకు జీవో ఇవ్వాలని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిని లేఖలో కోరారు.

గోదావరిలో మిగులు జలాలేవీ?

- నదుల అనుసంధానంపై జాగ్రత్త
- సర్కారుకు పొంగులేటి సుధాకర్ రెడ్డి సూచన



హైదరాబాద్, జనవరి 16 (మనం న్యూస్): నలభై ఏల్ల వరదను ఏళ్ల వరదను పరిగణలోకి తీసుకుంటే గోదావరిలో మిగులు జలాలు లేవని తేలిందని, నదులు అనుసంధానికి అఖిలపక్షం అభిప్రాయాలను తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నదుల అనుసంధానం చేయాలని ప్రతిపాదనలు చేస్తూ రాష్ట్రాలతో జాతీయ జలవనరుల అభివద్ధి సంస్థ బుధవారం ఢిల్లీలో సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు 110 సంవత్సరాల లెక్కల ప్రకారం, మన కొత్త ప్రాజెక్టులకు 40 సంవత్సరాల ప్రకారం సీడబ్ల్యూసీ అనుమతిలిచ్చిందని, ఈ సమావేశంలో పోలవరం రీడిజైన్ దిశగా సర్కార్ కషి చేయాలని ఆయన అన్నారు. రాజకీయ ప్రయోజనాలకంటే తెలంగాణ ప్రయోజనాలు ముఖ్యమని సర్కార్ గుర్తించాలని, ఈ విషయంలో చంద్రబాబు నాయుడు రహస్య ఎజెండాతో ముందుకు వెళ్తున్నారని, ఆయన నక్క జిత్తుల ఎత్తుల్లో పడవద్దని సూచించారు. నీటి యుద్ధాలు రాకుండా ఉండాలంటే నీళ్లను జాగ్రత్తగా వాడుకోవాలని, మన అవసరాలు తీరిన తర్వాతనే మిగతా నీటిని కిందకు వదలాలని ఆయన తెలిపారు. చాలామంది రైతుల పాస్‌పుస్తకాలు బ్యాంకుల్లో ఉన్నాయని, బకాయిల కింద వాటిని బ్యాంకర్లు తీసుకున్నారని, ఆ రైతుల పరిస్థితి ఎలా అని ఆయన ప్రశ్నించారు. రెతులకు గిట్టుబాటు ధర రావడం లేదని, ఆ దిశగా సర్కార్ కృషి చేయాలని, కంది రైతుల బకాయిలను చెల్లించాలని ఆయన కోరారు.

కాల్వలు, చెక్ డ్యాంలు నిర్మించండి

ప్రాజెక్టులకు సమాంతరంగా పనులు.. మానేరుతో కరీంనగర్‌కు జీవకళ

- జిల్లాలోని అన్ని ప్రాంతాలు పచ్చగా..
- సింగూరుతో 'మెతుకు సీమ' పేరు సార్థకం
- రిజర్వాయర్ల వద్ద వసతి గృహాలు: సీఎం కేసీఆర్



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మంగళవారం కలిసిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, జనవరి 16: తెలంగాణ రాష్ట్రానికి శాశ్వత ప్రయోజనం కలిగే రీతిలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సాగుతున్నదనీ, అదే తరహాలో కాల్వల నిర్మాణం, చెక్ డ్యాంల నిర్మాణం, చెరువులను నింపుకోవడం కూడా జరగాలని సీఎం కేసీఆర్ సూచించారు. తదనుగుణంగా వివరంగా అధ్యయనం చేసి పనులు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ కోసం ఒక ఉజ్వలమైన భవిష్యత్ రూపకల్పనలో భాగమే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణమని సీఎం పేర్కొన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన రిజర్వాయర్ల నిర్మాణం, కాల్వల నిర్మాణం, పంప్ హౌజుల నిర్మాణం, చెక్ డాంల నిర్మాణం, టన్నెల్ నిర్మాణం, రిజర్వాయర్లు రాబోతున్న స్థలాలలో వసతి గృహాల నిర్మాణం వంటి అంశాలపై సీఎం కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం ప్రగతిభవన్ లో సాగునీటి శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సాగునీటి శాఖ మంత్రి టీ హరీశ్‌రావు, ఈఎన్సీ మురళీధర్ రావు, ఎంపీ ప్రభాకర్ రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ సేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ సలీం, సీఎంవో అధికారి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ఎగువ మానేరు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండిపోయే అవకాశం లేదని, అప్పర్ మానేరు నుంచి లోయర్ మానేరు ఒక జీవధార లాంటిదనీ, ఇప్పుడు జరుగుతున్న పనులు పురోగతి సాదిస్తున్న కొద్దీ, కరీంనగర్ జిల్లా దక్షిణ ప్రాంతం ఎప్పుడూ సజీవంగా ఉంటుందని అన్నారు. అలాగే కాకతీయ కాలువ మరో జీవధార అనీ, గోదావరి మీద నిర్మిస్తున్న బ్యారేజీలతో ఉత్తర కరీంనగర్ కూడా ఒక జీవధారలాగా అవుతుందనీ, ఒక్క కరీంనగర్ జిల్లాలోనే వివిధ రకాల సాగునీరు అందడం మూలాన నాలుగు జీవదారాలు ఎల్లప్పుడూ ఉంటాయనీ సీఎం అన్నారు. దీనివల్ల నిత్యం పచ్చదనంతో పాటు, హరితహారానికి కూడా మేలు జరుగుతుందన్నారు. అలాగే సింగూరు ప్రాజెక్టు ఒక్కసారి నిండితే ఐదేళ్ల దాకా ఇబ్బంది ఉండదని, కొండపోచమ్మ , మల్లన్న సాగర్ వరకూ కూడా జీవదారేననీ, దీనివల్ల మెదక్ జిల్లాకున్న మెతుకుసీమ అనే పేరు సార్థకమవుతుందని చెప్పారు. ఈ ఏడాది జులై-ఆగస్టు నాటికల్లా మిడ్ మానేరు నింపడం సాధ్యమవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. ఎస్సారెస్పీ ఎప్పటికీ నిండి నీళ్ళతో ఉండాల్సిన అవసరం వుందని, దీనిమీదే మిషన్ భగీరథ ఆధారపడి ఉందని సీఎం పేర్కొన్నారు. మిడ్ మానేరులో నీళ్ళు వచ్చే సరికల్లా బ్యారేజులన్నీ పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. మిడ్ మానేరు నుంచి అనంతగిరివరకు ఓపెన్ చానెల్ పని పూర్తియిపోయిందని, మిగిలిపోయిన టన్నెల్ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతగిరి, రంగనాయక సాగర్ రిజర్వాయర్ల పనులు కూడా వేగవంతం చేయమన్నారు. కరువు ప్రాంతాలు సస్యశ్యా మలం కావడానికి ఎంత త్వరగా వీలుంటే అంత త్వరగా సాగునీరు ఇవ్వాలనీ, వచ్చిన నీళ్లువచ్చిన వెంటనే చెరువులు నింపుకుంటూ పోవాలనీ సూచించారు. వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి ఉపయోగంలోకి రావాలంటే చెరువులు నింపడం తప్పనిసరి అని ఆయన అన్నారు. మిడ్ మానేరు నీళ్లతో చెరువులు, చెక్ డ్యాంలు నింపాలని సూచించారు. అలాగే, అనంతగిరి, రంగనాయక్‌సాగర్‌లోకి ఎత్తిపోసే పంప్ హౌజ్ పనులను కూడా వేగవంతం చేయాలని సీఎం చెప్పారు. మల్లన్న సాగర్ కింద వుండే కాల్వల పనులను కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. మల్లన్నసాగర్ నుంచి సింగూరుకు గ్రావిటీ ద్వారానే నీళ్ల తరలించాలని సూచించారు. గ్రావిటీ ద్వారా ఎక్కువ ప్రాంతాలు సాగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. జాతీయ రహదారి నుండి మెదక్ పట్టణం వరకూ, అలాగే గజ్వేల్, దుబ్బాక, సిద్ధిపేట నియోజకవర్గాలలో ఒక్క కుంట భూమి కూడా మిగలకుండా సాగులోకి రావాలని సీఎం చెప్పారు.



శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి ఎస్ఆర్ఎస్‌పీ కాలువకు నీరు లిఫ్ట్ చేసేందుకు అనుమతి ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న టీఎస్ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ

గంధమల, బస్వాపూర్ రిజర్వాయర్ల పనుల పురోగతిని కూడా ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గంధమల దాకా, అక్కడి నుండి బస్వాపూర్ దాకా కాల్వల నిర్మాణం పురోగతిని సమీక్షించారు. మంజీరా, దుందుభి, కనగల్ వాగు, మూసీ, పాకాల లాంటి ఉపనదుల మీద చెక్ డ్యాంలను నిర్మించాలన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ లాంటి రిజర్వాయర్లన్న చోట మంచి వసతి గృహాలను నిర్మించాలని మంత్రి హరీశ్‌రావుకు సీఎం సూచించారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

దక్షిణ కొరియా కంపెనీలకు కేటీఆర్ విజ్ఞప్తి

- వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ
- టెక్స్‌టైల్స్ సిటీ డైగులో పర్యటన



హైదరాబాద్, జనవరి 16: తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణ కొరియా పారిశ్రామిక వేత్తలకు మంత్రి కేటీఆర్ పిలుపినిచ్చారు. రెండు రోజుల పాటు ఆ దేశంలో పర్యటిస్తున్న కేటీఆర్ మంగళవారం వివిధ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న వ్యాపార, పెట్టుబడులు అవకాశాలను మంత్రి వివరించారు. ముఖ్యంగా ఆటోమోబైల్, టెక్స్‌టైల్స్, ఫార్మా, ఐటీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. ఆటోమోబైల్ దిగ్గజం హ్యూందయ్ కార్పొరేషన్ కార్యనిర్వాహక ఉపాద్యక్షులు నామ్ గుహ్నేతో సమావేశమయ్యారు. తెలంగాణలో ఆటోమోబైల్ రంగంలో ఉన్న పెట్టబడుల అవకాశాలను వివరించారు. ముఖ్యంగా టీఎస్ఐపాస్ ద్వారా సింగిల్ విండో అనుమతుల విధానం పైన హ్యూందయ్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. హ్యూందయ్ రోటెమ్, గ్లోబల్ రైల్వే విభాగం డైరెక్టర్ కేకే యూన్‌తోనూ కేటీఆర్ భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీలో అగ్రగామిగా ఉన్న వోసీఐ సీఈవో వూ హ్యూన్ లీతో నూ సమావేశమయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా ముప్పయ్ మూడు ప్రాంతాల్లో తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఈ కంపెనీని తెలంగాణకు ఆహ్వానించారు. అనంతరం.. మొబైల్ ఇంటర్నెట్ బిజినెస్ అసోషియేషన్ (మెయిబా)తో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను ఫిబ్రవరిలో తెలంగాణలో జరగనున్న ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌కు అహ్వానించారు. 500లకుపైగా కంపెనీలు సభ్యులుగా ఉన్న ఈ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఒక అవగాణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఒప్పందం మేరకు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చువల్ రియాలిటీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ వంటి అంశాల్లో కలిసి పనిచేస్తాయి. తదుపరి అనంతరం టెక్స్ టైల్ పరిశ్రమల వర్గాలతో సమావేశం అయ్యారు. ముఖ్యంగా టెక్స్టైల్ పరిశ్రమల సమాఖ్య కొఫోతి చైర్మన్ కిహూక్ సుంగ్,ఇతర కంపెనీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. కిహూక్ చైర్మన్‌గా ఉన్న యంగ్వాన్ సంస్థ ఇప్పటికే కాకతీయ టెక్స్‌టైల్స్ పార్కులో 300 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు అంగీకరించింది. కాగా, కొరియా టెక్స్‌టైల్ సిటీ పేరుగాంచిన డైగు మెట్రోపాలిటన్ నగరంలోనూ కేటీఆర్ బృందం పర్యటించింది. నగర డిప్యూటీ మేయర్ కిమ్ యాన్ చాంగ్ తో సమావేశం అయిన మంత్రి నగరంలో టెక్స్టైల్ పరిశ్రమల పారిశ్రామిక ప్రగతి పైన చర్చించారు. డైగు నగర ఇన్నోవేషన్, ఆర్థిక విభాగ సభ్యులతో భేటీ అయిన మంత్రి కేటీఆర్ వారిని ఇమేజ్ టవర్ ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని కోరారు. మంత్రి బృందంలో ప్రభుత్వ సలహాదారు ఎంపీ వివేక్, పరిశ్రమ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు ఉన్నారు.





బీసీలపై కేసీఆర్‌ది కపట ప్రేమ: వీహెచ్

హైదరాబాద్, జనవరి 16 (మనం న్యూస్): ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ కేసీఆర్‌కు గ్రామాలు కనపడుతున్నాయని, బీసీలు కనిపిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంత రావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రికి బీసీలు గుర్తు రాలేదా అని, ఇప్పుడు మాత్రం ఓట్ల రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలు కేసీఆర్ కపట ప్రేమను అర్థం చేసుకోవాలన్నారు. బీసీలకు క్యాబినెట్‌లో తగిన ప్రాధాన్యత కల్పించలేదని, బీసీలపై చిత్తశుద్ధి ఉంటే క్రిమిలేయర్ ఎత్తివేయాలని ఆయన తెలిపారు. కులాల మధ్య చిచ్చు పెడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలకు కేసీఆర్ పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. పంచాయతీ రాజ్ చట్టాన్ని వ్యతిరికిస్తున్నామని, అసెంబ్లీలో బిల్లుకు మద్దతు ఇవ్వమన్నారు. పరోక్ష ఎన్నికల్లో డబ్బులు ఉన్నవాళ్లే గెలుస్తారని ఆయన వ్యాఖ్యినించారు.

కనీస హక్కులు కాలరాస్తున్న టీఆర్ఎస్

- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మందకృష్ణ, ప్రతాప్‌రెడ్డికి పరామర్శ

కేసీఆర్‌ది నిరంకుశ పాలన

హైదరాబాద్, జనవరి 16(మనం ప్రతినిధి): టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల కనీస హక్కులను కాలరాస్తోందని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. చంచల్‌గూడా జైలులో ఉన్న మందకృష్ణ మాదిగ, టీడీపీ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డిని మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ కేసీఆర్ నియంతలా పాలన చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మందకృష్ణ ఎస్సీ వర్గీకరణ కోసం చాలా కాలంగా పోరాడుతున్నారని, హక్కుల కోసం పోరాడుతున్న ఆయనను అన్యాయంగా జైలులో పెట్టారని విమర్శించారు. వర్గీకరణ ఉద్యమ సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన భారతి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇచ్చిన ముఖ్యమంత్రి, అదే భారతి సంస్మరణ సభ పెట్టిన మందకృష్ణను అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. అసెంబ్లీలో వర్గీకరణ చేయాలని తీర్మానం పెట్టి అఖిలపక్షాన్ని ప్రధాన మంత్రి దగ్గరకు తీసుకుపోతామని చెప్పిన ముఖ్యమంత్రి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. బెయిల్ పైవచ్చి ఇంట్లోనే నిరసన దీక్ష చేపడితే కూడా అరెస్ట్ చేసి మళ్లీ జైలుకు పంపించారని, ఇంత కంటే నిరంకుశత్వం మరొకటి ఉండదన్నారు. రాష్ట్రంలో దారుణమైన పాలన సాగుతోందని, అణగారిన వర్గాల హక్కులను కేసీఆర్ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. మిర్చికి గిట్టుబాటు ధర కావాలని కోరిన గిరిజన రైతులకు ఖమ్మంలో బేడీలు వేసి జైలుకు పంపించారని ఉత్తమ్ కుమార్ గుర్తు చేశారు. తనపై గజ్వేల్‌లో పోటీ చేసిన ప్రతాప్ రెడ్డిపై అనేక తప్పుడు కేసులు పెట్టి వేధించడంతో పాటు, జైలుకు పంపించారని విమర్శించారు. ఉస్మానియాలో బీసీ విద్యార్థి మురళి ఆత్మహత్య చేసుకుంటే కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించలేదన్నారు. తన సొంత గ్రామానికి చెందిన మురళికి అండగా ఉన్నందుకే ప్రతాప్ రెడ్డిని జైలుకు పంపారని ఆరోపించారు. ఉత్తమ్ వెంట ఎమ్మెల్యే సంపత్, మాజీ మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి ఉన్నారు.



జైలులో మంద కృష్ణ మాదిగను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

బుధవారం, జనవరి 17

ఆర్థిక సంస్కారం

విదేశీ ప్రత్యక్ష మదుపులు (ఎఫ్‌డీఐ) రాబట్టడం ఆర్థికాభివృద్ధికి ఆలంబనగా భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా అనేక సంస్కరణలను ముందుకు తెచ్చింది. సింగిల్ బ్రాండ్ చిల్లర వర్తకంలోకి నూరు శాతం, ఎయిర్ ఇండియాలోకి 49 శాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తూ నరేంద్ర మోదీ సర్కారు తాజాగా తీసుకున్న నిర్ణయం దేశ ప్రయోజనాలకు ఎలా ఉపకరిస్తాయన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. వాటితో పాటు విద్యుత్ ఎక్స్చేంజీల్లో, నిర్మాణ రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలకు వీలు కల్పించింది. ఆ మేరకు కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై పలువర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిని ఆవాహన చేసుకునేందుకు ఇప్పటికే ప్రమాదకర ఎఫ్‌డీఐ బిల్లును తీసుకురావడమే కాకుండా, ప్రతిపక్షాల ఆక్షేపణలను సైతం లెక్క పెట్టకుండా సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని పూర్తిగా తొలగించి బహుళజాతి సంస్థలకు అప్పగించేందుకు వేగంగా చర్యలు తీసుకుంటోంది. ప్రతిపక్షంలో ఉన్నపుడు రిటైల్ రంగంలోకి ఎఫ్‌డీఐల ప్రవాహాన్ని, యూపీఏ ప్రభుత్వం ఎఫ్‌డీఐలను సింగిల్ బ్రాండ్‌లోకి పరి మితంగా అనుమతించినపుడు వ్యతిరేకించిన బీజేపీ, అధికారంలోకి రాగానే దానికి పూర్తి భిన్నమైన వైఖరి తీసుకోవడం కొత్తేమీ కాదు. గతంలో మహారాష్ట్రలో అమెరికా విద్యుత్ కార్పొరేట్ సంస్థ ఎన్‌రాన్ చేపట్టిన విద్యుత్ ప్లాంట్ వ్యతిరేక ఉద్యమంతో ఆ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ వెనువెంటనే ఎన్‌రాన్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి అన్నిరకాల అనుమతులను మంజూరు చేయడం నుంచి ప్రస్తుతం రిటైల్ రంగ సంస్కరణలు దాకా అనేక సంస్కరణల పట్ల అలానే వ్యవహరించింది.

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరిదశ ఆర్థిక విధానాన్ని ప్రకటించాల్సిన తరుణంలో కేంద్ర మంత్రివర్గం చేపట్టిన అనేక సంస్కరణలు వివాదాస్పదంగా మారాయి. వీటిల్లో కీలకమైనది 49 శాతం విదేశీ పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించడం. ఆరునెలల క్రితం ఆర్థిక వ్యవహారాలపై మంత్రివర్గ కమిటీ ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో వ్యూహాత్మకంగా మదుపుల ఉపసంహరణ చేపట్టనున్నట్లు ప్రకటించిన తర్వాత ఎఫ్‌డీఐలను అనుమతిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దాంతో సింగపూర్ ఎయిర్‌లైన్స్–టాటా కూటమి, జెట్ ఎయిర్‌వైస్ సంస్థలు ప్రధాన పోటీదారులుగా నిలువనున్నారు. కేంద్ర బడ్జెట్ సమావేశాలు సమీపిస్తున్నప్పటికీ వ్యూహాత్మకంగా 15 వేల కోట్ల రూపాయల మదుపుల ఉపసంహరణ లక్ష్యంలో 28 శాతం మాత్రమే పూర్తవడంతో చివరి బడ్జెట్‌కు ముందు కేంద్ర సర్కార్ సంస్కరణలను వేగవంతం చేస్తోంది. 2015లో రూ.105 కోట్లు, 2016–17లో రూ. 300 కోట్ల మేర నిర్వహణా లాభాలు సాధించిన ఎయిర్ ఇండియాను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన సిఫారసులను పెడచెవిన పెట్టిన కేంద్రం విదేశీ విమానయాన సంస్థలకు ఎయిర్ ఇండియాను కట్టబెట్టేందుకు సంస్కరణల ద్వారా రంగం సిద్ధం చేసింది. ప్రైవేట్ విమానయాన సంస్థలకన్నా మెరుగైన సేవలు అందిస్తున్న జాతీయ ఎయిర్‌లైన్స్ సంస్థలను విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాలతోపాటు ప్రైవేట్ విమానయాన సంస్థలకు ధారాదత్తం చేయడం అన్యాయం. అందువల్ల విమానయాన సంస్థ సిబ్బంది హక్కులకు భంగం వాటిల్లడమే కాకుండా, విమానయాన రంగం వేగంగా పెరుగుతున్న తరుణంలో ప్రభుత్వ ఖజానాకు చెందవలసిన ఆదాయం ప్రైవేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టడం ఆర్థిక రంగానికి ఒకరకంగా దహన సంస్కారం జరపడమేనని విమర్శలు వస్తున్నాయి.

ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలోకి 49 శాతానికి మించిన నిధులు రాకుండా నియంత్రించే బాధ్యత ఆర్బీఐ, విదేశీ పెట్టుబడుల నియంత్రణ శాఖపై ఉండేది. అయితే మోదీ మంత్రివర్గం చేపట్టిన సంస్కరణల ప్రకారం ఎఫ్‌డీఐలపై ఆర్బీఐ వంటి సంస్థల నియంత్రణ లేకుండాపోయి, ఆర్థిక వ్యవస్థలో నయా వలస విధానం మరింత లోతుగా వ్యవస్థీకృతమవుతుంది. రిటైల్ రంగంలో ప్రవేశించే విదేశీ కంపెనీలు స్థానిక రైతుల నుంచి 30 శాతం మేర ఉత్పత్తులను విధిగా సేకరించాలన్న నిబంధన కూడా వర్తించకుండా భిన్నంగా కొత్త సంస్కరణ ప్రకారం ఆ కార్పొరేట్ కంపెనీలు ఐదేళ్ల వరకు మినహాయింపు పొందడం అన్యాయం. ప్రస్తుతం సింగిల్ బ్రాండ్ రంగంతో సహా ఎఫ్‌డీఐలు వందశాతం చొరబడేందుకు ఆస్కారం లభించాక దేశంలోని దాదాపు నాలుగు కోట్ల మంది చిల్లర వర్తకులు, దుకాణదారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు అభివృద్ధి చెందిన దేశాలు దేశీయంగా ఆర్థిక రక్షణ విధానాలను, వెనకబడిన, వర్ధమాన దేశాల్లో సరళీకృత ఆర్థిక విధానాలను అమలుచేసే వ్యూహానికి భారత పాలకవర్గాలు తలొగ్గడం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే.

కుట్ర



కుట్రలు రకరకాలు
గాలి పీల్చటం
ఆకలి తీర్చుకోవటం
బతుకు యుద్ధం చేయటం

మన ఓట్ల మెట్లమీదుగా అసెంబ్లీలోకి పాకిన కోటిగాడు
అమాంతం కోట్లీశ్వర్యావైపోవటం కుట్ర కాదు
ఆకుపచ్చని దోసిళ్ల పట్టి రైతులు
మద్ధతు ధర కోసం రోడ్లమీద నినాదాలవటం కుట్ర
రైతుల చెమట చుక్కలతో పాటగట్టటం కుట్ర

ప్రజల నెత్తురైన వేల కోట్ల పచ్చని కరెన్సీ కాగితాలను
రాజముద్రతో మేసిన దొంగ – నేతల భుజాల మీదుగా విదేశాల్లో వాలటం
అమాయకంగా మరెవరైనా కుట్ర అనుకునేరు?

దేశంనోట్లో పిడికెడన్నం మెతుకులవ్వాలని – అప్పువడ్డ మట్టిమనిషి
తీర్చలేక గుండెల్లో అదే నాగలి దింపుకుంటున్నాడు చూడు – అది కుట్ర
చావుకు సమాధానం రాసివ్వమంటావా? – అదీ కుట్రే

పొలాలను సామూహికంగా ఉరితీయటం
మట్టికి సంకెళ్లు బిగించటం
వాడు రాసుకున్న నిఘంటువు భాషలో కుట్ర కాదు

మట్టినీ – నీళ్లనూ కలిపి అన్నాన్ని పుట్టించటం
గుప్పెడు మట్టివిసిరి ఆకలిని తరిమేయటం
పొగరెక్కిన వాని తెల్లబట్టల కళ్లకు కుట్రగా కనిపిస్తుంది
ఈ దేశంలో రైతుగా పుట్టటమే పెద్దకుట్ర


– తోకల రాజేశం
9676761415

కవిత

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com



మంచిమాట




‘ విలువలేని మనుషులు కేవలం తినడానికి, తాగడానికి మాత్రమే బతుకుతారు. కానీ, విలువలున్న మనుషులు జీవించడానికి మాత్రమే తింటారు, తాగుతారు. ’

– సోక్రటీస్

మృత్యునీడల్లో అసెంబ్లీ ఎన్నికలు

వ్యవసాయ రుణాలు చెల్లించడంలో అశక్తులైన రైతుల ఆత్మహత్యల ఉదంతాలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయ రంగంలో నిరాశ నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. 2015లో 8,007 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో ప్రతి పదిమందిలో నలుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అదే 2014 విషయానికొస్తే ప్రతి పదిమందిలోనూ ఇద్దరు ఆత్మహత్యలు చేసుకున్నారు. గత 11 ఏళ్ళుగా గ్రామీణ ప్రాం తాల్లో రైతులపై రుణభారం పెరిగిందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇటీవల గుజరాత్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ గుజరాత్‌లో బీజేపీ 16 స్థానాలు కోల్పోయింది. గ్రామీణ ప్రాంతాల్లో 40 శాతం నియోజకవర్గాల్లో మాత్రమే విజయం సాధించింది. దీన్నిబట్టి గ్రామీణ ఆర్థికవ్యవస్థలో ఏ మేరకు అశాంతి నెలకొనివుందో అర్థంచేసుకోవచ్చు. ఈ ఏడాది మరో ఎనిమిది రాష్ట్రాల్లో అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో ఎక్కువ బీజేపీ పాలిత రాష్ట్రాలే ఉన్నాయి. చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా గ్రామీణ రుణభారమెంత పెరిగిందో, ఆత్మహత్యలు, నిరాశ నిస్పృహలు ఏ మేరకు పేరుకుపోయి వున్నాయో పరిశీలించాల్సి ఉంది. రైతుల్లో పేరుకుపోయిన నిరాశా నిస్పృహల ప్రభావం వచ్చే ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై పడే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

అనిశ్చితి వాతావరణంలో వ్యవసాయరంగంలో ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో వీటిని వాతావరణ మార్పులకు అంటకడుతూ, మరింత దారుణస్థితిని ఎదుర్కొనవలసిన పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయి. వ్యవసాయరంగం ఇక్కట్ల పరిస్థితిల్లోనే ఎనిమిది రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేస్తామంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ప్రధాన భూమిక పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 123.6 మిలియన్ల మంది గ్రామీణ ప్రాంతాల్లో నివశిస్తున్నారని 2011 జనాభా లెక్కలు చెబుతున్నాయి. ఈ జనాభా ప్రస్తుతం మెక్సికో (ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన 11వ దేశం) జనాభాతో సమానం. ఈ మూడు రాష్ట్రాల్లో వ్యవసాయాభివృద్ధి క్షీణించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో పంటల ధర లు తగ్గిపోయి, రుణాలు రద్దుచేయాలని రైతులు డిమాండ్ చేస్తుండగా ప్రభుత్వం మాత్రం అధిక ధరలు కల్పిస్తామని హామీలిచ్చి రైతులను బుజ్జగించే యత్నాలకు దిగిందని 2017 డిసెంబర్‌లో ఒక ఆంగ్ల పత్రిక పేర్కొన్నది. రుణాలు చెల్లించలేక, వ్యవసా యం గిట్టుబాటుగా కనిపించక పోవడంతో రైతులు నిరాశ నిస్పృహల మధ్య ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.



2014 కంటే 2015లో రైతుల ఆత్మహత్యలు 41.7 శాతం పెరిగాయి. జాతీయ క్రైమ్ రికార్డుల ప్రకారం, 2014లో రుణాలు తీసుకున్న రైతుల్లో 20.6 శాతం మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2013లో గ్రామీణప్రాంతాల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు అప్పుల పాలయ్యారు. 2002 కంటే ఈ సంఖ్య 26.5 శాతం ఎక్కువ. 2013లో గ్రామీణ రుణభారం సుమారు 1.03 లక్షల (ప్రతి ఒక రైతుకు) రూపాయలుగా ఉన్నది. అంటే, ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 మోటారు సైకిలు ధరతో (1.09 లక్షల రూపాయలు) ఒక్కొక్కరి రుణభారం సమానం అన్నమాట. ఇదే ఐఫోన్ ధర 1.02 లక్షలు, పానాసోనిక్ 55 అంగుళాల ఫ్లాట్ స్క్రీన్ టీవీ 0.99 లక్షల రూపాయలు పలుకుతున్న విషయం తెలిసిందే. ఇది గ్రామీణ ప్రాంతాలకు, పట్టణ ప్రాంతాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో 833 మిలియన్ల మంది నివశిస్తున్నారు. మొత్తం జనాభాలో ఇది 68.8 శాతం. వీరిలో అత్యధికులు పేదలే.

2013 నాటికి ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకులు, బీమా కంపెనీలు 56 శాతం రుణాలు అందించాయి. మిగిలిన రుణాలు సంస్థాగతం కాని సంస్థలైన మనీలెండర్స్, స్నేహితులు అందించేవి. రుణభారంతో కుంగిపోయి 2015లో ఆత్మహత్యలు చేసుకున్న వారిలో (మొత్తం 3,097 మంది) ఎక్కువ మంది (1,293 మంది) మహారాష్ట్రకు చెందినవారే ఉన్నారు. మొత్తం ఆత్మహత్యల్లో వీరి శాతం 41.7గా ఉన్నది. ఆ తరువాత స్థానం కర్ణాటక ఆక్రమించింది. 946 మంది ఆ రాష్ట్రంలో (30.5 శాతం) ఆత్మహత్యలకు పాల్పడగా, తరువాతి స్థానం తెలంగాణ (632 మంది – 20.4 శాతం) ఆక్రమించింది. ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల రైతులు కూడా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారు. ఆయా రాష్ట్రాల్లో చిన్నకారు రైతులు (హెక్టార్ భూమి ఉన్నవారు) అప్పుల ఊబిలో మునిగిపోయి ఉన్నారు. పంట దిగుబడి సరిగాలేకపోవడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, చేసిన అప్పులు తీర్చలేక మళ్లీమళ్లీ అప్పులు చేయడం వంటి వాటివల్ల ప్రైవేట్ రంగం, ప్రభుత్వరంగం నుంచి రెండురంగాల నుంచి రైతులు అప్పులు అందుకున్నారు.

గ్రామీణ రంగంలో ప్రధాన రుణ వనరు అయిన ప్రైవేట్ వ్యక్తుల నుంచి 2013లో 28.6 శాతం మంది రైతులు రుణసాయం పొందారు. అదే 2002లో 19.6 శాతం రైతులు ప్రైవేట్ రుణాలు పొందారు. ప్రభుత్వ రంగ సంస్థల కంటే ప్రైవేట్‌రంగ సంస్థల నుంచి రుణం పొందటం, తక్కువ సమయంలో రుణం లభించడం వంటి కారణాలతో ప్రభుత్వం రంగ బ్యాంకులపై కంటే ప్రైవేట్‌రంగ సంస్థలపైనే ఎక్కువమంది రైతులు ఆధారపడుతున్నారని 2013లో రిజర్వ్‌బ్యాంక్ నివేదిక తెలియజేస్తోంది. వడ్డీరేట్లు ఎక్కువైనా ప్రైవేట్ రంగంపైనే రైతులు ఎక్కువభాగం ఆధారపడి ఉన్నారు.

2017లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు 36,359 కోట్లు, 30,000 కోట్ల రూపాయల మేర రైతు రుణమాఫీని ప్రకటించాయి. అయితే, ప్రభుత్వరంగ సంస్థల నుంచి రుణంపొందిన వారే ఈ మాఫీకి అర్హులు కావడంతో చాలా తక్కువ మంది లబ్ధిపొందారు. 2016 మార్చి నాటికి వ్యవసాయ రంగంలో 51,964 కోట్ల రూపాయలున్న నిరర్థక ఆస్తుల విలువ తరువాతి కాలంలో 20 శాతం పెరిగి 62,307 కోట్ల రూపాయలకు చేరుకున్నది. మంచి వ్యవసాయ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆదాయం మాత్రం తగువిధంగా పెరగకపోవడం వ్యవసాయ రుణాలకు ఒక కారణంగా చెప్పుకోవచ్చు. దేశవ్యాప్తంగా లభించిన గణాంకాల (2013 నేషనల్ శాంపిల్ సర్వే) ప్రకారం ఒక్కొక్క కుటుంబం వ్యవసాయ ఆదాయం నెలకు 6,500 రూపాయలు మాత్రమే! ఇది పట్టణ ప్రాంతాల్లోని ఖరీదైన హోటళ్లలో రెండు రాత్రుళ్ల భోజనం ఖర్చుతో సమానం.

> **భూమి వేడెక్కుతున్న పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు పెరగడం కూడా పంట నష్టానికి కారణమవుతోంది. దీనికి తోడు అకాల వర్షాలు, కరవు పరిస్థితులు కూడా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 1980 నుంచి భూతాపం నేపథ్యంలో భారత్‌లో రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని కాలిఫోర్నియా బెర్కలీ యూనివర్శిటీ పరిశోధకుడు తమ్మా కార్లెటన్ అధ్యయనంలో తేలింది.**

భూమి వేడెక్కుతున్న పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు పెరగడం కూడా పంట నష్టానికి కారణమవుతోంది. దీనికి తోడు అకాల వర్షాలు, కరవు పరిస్థితులు కూడా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 1980 నుంచి భూతాపం నేపథ్యంలో భారత్‌లో రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని కాలిఫోర్నియా బెర్కలీ యూనివర్శిటీ పరిశోధకుడు తమ్మా కార్లెటన్ అధ్యయనంలో తేలింది. అయితే ఈ సర్వేను తరువాతి కాలంలో కొందరు సవాలు చేశారు. రానున్న దశాబ్దాల కాలంలో ఎదురవుతాయని భావిస్తున్న వాతావరణ మార్పులతో పోల్చితే 1980లో పరిస్థితి చాలా తక్కువేనని కార్లెటన్ అన్నారు. అందువల్ల భవిష్యత్తులో ఈ మరణాల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

◆ సంజుక్తా నాయర్
(ఇండియా స్పెండ్ సౌజన్యంతో)

మన లేఖలు

సర్పంచ్ అభ్యర్థికి విద్యార్హతలుండాలి

పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఏ ఎన్నికైనా గడవు దాటి జాప్యం చేయకూడదని భావిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గడవులోగానే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని గతంలోనే ప్రకటించిన విషయం విదితమే. అందుకు అనుగుణంగానే ఏర్పాట్లు జరుగుతున్నట్టు సమాచారం. పంచాయతీరాజ్ చట్టానికి ఇప్పటికే దాదాపు తుది రూపునివ్వగా పరోక్ష పద్ధతిలో సర్పంచ్ ఎన్నికలు ఉంటాయని, కొత్త పంచాయతీరాజ్ చట్టంలో సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి తీసేసే అవకాశం సభ్యులకుండటం యావత్తు ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తుంది. కొత్త పంచాయతీ రాజ్ చట్టంలో గ్రామ స్థాయిలో అన్ని అధికారాలు సర్పంచ్‌లకు ఇవ్వడం, ప్రభుత్వ నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకే చేరడంలాంటి చట్టం తీసుకువస్తున్నందుకు ప్రభుత్వానికి ఎల్లప్పుడూ కృతజ్ఞతా భావంతో ఉంటామని ప్రజలు అంటున్నారు. కొత్త పంచాయతీ రాజ్ చట్టంలో వార్డ్ సభ్యులను సర్పంచ్‌లుగా పరోక్ష పద్ధతిలో ఎన్నుకోవడం భాగానే ఉంది కానీ, విద్యార్హతలు గ్రాడ్యుయేట్ లేదా, పదవ తరగతి చదవుకున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

– గుండమల్ల సతీష్‌కుమార్
సంస్థాన్ నారాయణపురం


పాలమూరు ప్రజలకు కృతజ్ఞతలు

విరసం రెండేళ్లకోసారి నిర్వహించే మహాసభలకు, సాహిత్య పాఠశాలకు ఒక నిర్దిష్టమైన అంశాన్ని ఎంచుకొని దాన్ని వేరువేరు కోణాల నుండి విశ్లేషించి, చర్చకు పెడుతూ వస్తున్నది. 1985లో గద్వాల సాహిత్య పాఠశాల తర్వాత 33 ఏళ్లకు మళ్లీ పాలమూరు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మహాసభలకు కులవ్యవస్థ పునాదిపై నిలిచిన ‘బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని’ కేంద్ర అంశంగా తీసుకొని రెండు రోజుల పాటు చర్చించింది. ప్రస్తుతం దేశంలో ప్రమాదకరంగా ముందుకొస్తున్న సంఘపరివార్ దౌర్జన్యాలకు రాజకీయార్థిక, భావజాల మూలాలను వివరించే ప్రయత్నం చేశాం. ఈ అంశం మీద తమ ఆలోచనలు పంచుకున్న ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డేకు, ప్రజాకళాకారుడు వీర్‌సాతెదార్‌కు, సియాసత్ ఎడిటర్ జహీర్ అలీఖాన్‌కు, కామ్రేడ్ దుడ్డు ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. విరసం మహాసభలను తమ భుజాల మీదేసుకొని విజయవంతం అయ్యేదాకా శ్రమించిన ఆహ్వాన సంఘానికి, సభలను విజయవంతం చేయడం ద్వారా మాకెంతో స్ఫూర్తిని నింపిన పాలమూరు ప్రజలకు, ప్రజాసంఘాల మిత్రులకు, సాహితీ మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– పాణి, కార్యదర్శి,
– వరలక్ష్మి, పూర్వకార్యదర్శి
విప్లవ రచయితల సంఘం

మాంసం విపణిలో మహామోసం

విశ్వవ్యాప్తంగా మాంసం పేరుతో మహామోసం మొదలై చాలాకాలమైంది. ప్రజల మాంసం మోజును అడ్డుపెట్టుకొని వారి ఆరోగ్యంతో అక్రమ వ్యాపారులు ఆటలాడుతున్నారు. తాజాగా రెండు అగ్ర రాజ్యాల మధ్య జరిగిన ఒక ఎగుమతి దిగుమతి వ్యవహారం అంతర్జాతీయ మాంసం విపణిలోని డొల్లతనాన్ని వెల్లడి చేసింది. గత నెలలో చైనా చికెన్ పేరుతో అమెరికాకు ఎగుమతిచేసిన మాంసం ఎలుక మాంసమని దర్యాప్తులో తేలింది. చాలాకాలంగా కంటైనర్‌ల కొద్దీ చైనా పంపిన టన్నుల ఎలుక మాంసాన్ని అమెరికన్లు బోన్‌లెస్ చికెన్‌గా భావించి లొట్టలేసుకొని ఆరగించిన వైనం బయటపడింది. ఇటీవల అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోపోర్టుకి చైనా నుంచి వచ్చిన ఓ కంటైనర్‌ని అమెరికా ఆహార నాణ్యత పరిరక్షణ అధికారులు పరిశీలించి షాక్ తిన్నారు. నాలుగున్నర లక్షల కిలోల ఎలుక మాంసాన్ని చికెన్ మాంసంగా భావించి అమెరికన్లు దిగుమతి చేసుకున్నట్లు తేలింది. ఈ ఎలుక మాంసాన్ని బోన్‌లెస్ చికెన్ వింగ్స్ పేరుతో తింటునట్లు వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న మాంసం వినియోగం పలు సమస్యలకు దారితీస్తోంది. ప్రజలకు మాంసం మీదున్న మోజు కారణంగా అక్రమార్కులు మాంసంలో మోసానికి పాల్పడుతూ కోట్లు గడిస్తున్నారు. మాంసం వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. గడిచిన పదేళ్లలోనే వినియోగంలో 30 శాతం వృద్ధి నమోదు కావడం మారుతున్న పరిస్థితులకు నిదర్శనం. కొత్త కొత్త రకాల మాంసాహారాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో మాంసాహార వాడకం సామాజిక హోదాకు చిహ్నంగా మారిపోయింది. పెరుగుతున్న మాంసం వినియోగం మాటున, ప్రబలుతున్న కల్తీ, పర్యావరణ సమస్యలు సామాజికవేత్తలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రపంచీకరణ కారణంగా ఆహార గొలుసు దుకాణాలు దేశదేశాల్లో విస్తరిస్తూ మాంసాహారం నాణ్యతా ప్రమాణాలూ వివాదాస్పదమవుతున్నాయి. ఆహార నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండే చైనాలో సైతం గతంలో వెలుగు చూసిన కల్తీ ఉదంతాలు నివ్వెర పరిచింది. 20 వేల టన్నుల ఎలుక మాంసాన్ని మేకమాంసం పేరిట అమ్మిన వైనం చైనాలో బయటపడింది. పందుల కళేబరాలు పెద్దయెత్తున నదుల్లో కొట్టుకువచ్చిన ఘటనపై చైనా ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి నప్పుడు దొంగ మాంసం డొంక కదిలింది. ఒక మాంసం పేరు చెప్పి, మరొకటి విక్రయిస్తున్న సంఘటనలు వరసగా వెలుగు చూడటంతో అధికారులే నివ్వెరపోయారు. ఆగ్రహంతో చైనా 900 మంది అధికారులను అరెస్ట్‌చేసి, 1700 మాంసాహార కర్మాగారాలను మూసి వేశారు. ఎలుక మాంసంతో పాటు కుక్క మాంసమూ విక్రయిస్తూ చైనా వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. ఇదే సమయంలో దశాబ్దాలుగా నిల్వ ఉంచిన కోడి మాంసం వెలుగు చూడడంతో చైనా ప్రభుత్వం ఉక్కిరి బిక్కిరైంది. 1967లో దేశంలో ఆహార కొరత ఏర్పడినప్పుడు పెద్దయెత్తున నిల్వచేసిన కోడి మాంసం ఇప్పుడు బయటపడింది. దశాబ్దాల తరబడి ఆ మాంసం చెడిపోకుండా ఉండటానికి హైడ్రొజన్ పెరాక్సైడ్ లాంటి రసాయనాలను వాడారు. వివాదం ముదరక ముందే అప్రమత్తమైన చైనా సర్కారు నిల్వలను స్వాధీనం చేసుకొని భూమిలో పూడ్చిపెట్టేసింది.



ఇప్పుడు అమెరికాకు చికెన్ పేరుతో ఎలుక మాంసాన్ని ఎగుమతి చేయటం ప్రపంచాన్ని నివ్వెరపర్చింది. చైనా నిజాయితీని ప్రశ్నిస్తోంది. అమెరికా, ఐరోపా దేశాల్లోనూ ఇలాంటి ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. వాస్తవానికి ఆహార రంగంలో నిబంధనలను కఠినంగా అమలు చేస్తాయన్న మంచిపేరు ఐరోపా దేశాల సొంతం. ఆ దేశాలు సైతం కల్తీ మాంసాహార విక్రయాలను గుర్తించక పోవడమే విడ్డూరం. ఇంగ్లాండ్, స్వీడన్, ఫ్రాన్స్, ఐర్లాండ్ వంటి దేశాల్లో పశుమాంసం (బీఫ్) ముసుగులో గుర్రం మాంసం అమ్మకాలు జరిగిపోయాయి. ఐరోపా దేశాల్లో అమ్ముతున్న పశు మాంస బర్గర్లలో 29 శాతం గుర్రం మాంసంతో చేసినవేనని అంతర్జాతీయ మాంసాహార నివేదికలు వెల్లడించాయి. ఆఫ్రికా దేశాల్లో 30 శాతం బర్గర్లు గాడిద మాంసంతో చేసినవని ఆ నివేదికలు స్పష్టంచేశాయి. ఫ్రాన్స్ కూడా గుర్రం మాంసం అమ్మ కాలను నిరోధించలేక పోయింది. నెదర్లాండ్ ఏకంగా 50 వేల టన్నుల బర్గర్లను వివిధ దేశాల నుంచి వెనక్కి రప్పించింది. పశు మాంసం ముసుగులో కొన్ని సంస్థలు ఇతర మాంసంతో చేసిన బర్గర్లను వివిధ దేశాలకు ఎగుమతి చేశాయి. దాంతో నెదర్లాండ్ అప్రమత్తమైంది. మన దేశంలో సైతం మేక, గొర్రె మాంసాల పేరిట ఇతర జంతువుల మాంసం అమ్మటం నిత్యకృత్యం. కోడి మాంసం ముసుగులో బాతు మాంసం విక్రయాలు రివాజుగా జరుగుతుంటాయి. వివిధ దేశాల్లో మాంసాహారం గిరాకీని తట్టుకో వడానికి పెద్దయెత్తున జంతు పెంపక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. స్వల్పకాలంలో జంతువుల బరువు పెరగడానికి కృత్రిమ పద్ధతులు అవలంభిస్తున్నారు. ఇలాంటి చర్యలవల్ల సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. జంతువుల పెంపకం కోసం వ్యవసాయ భూములను పశుగ్రాస భూములుగా మారుస్తున్నారు. కిలో పశుమాంసం కోసం అంతకు ఏడురెట్లు పశుగ్రాసం కావాలి. పంది మాంసం తయారీకి మూడురెట్లు, కోడిమాంసం తయారీకి రెండురెట్ల కిలోల పోషణ వాటికి ఇవ్వాలి. అమెరికాలోని వ్యవసాయ క్షేత్రాల్లో 40 శాతం భూములను మాంసం, కోడిగుడ్ల ఉత్పత్తి రంగాలకు కేటాయించడంతో ఆహార ధాన్యాల దిగుబడిపై పడుతోంది. ప్రపంచవ్యాప్తంగా 30 శాతం భూమిని మాంసం ఉత్పత్తి రంగం వినియోగించుకుంటున్నట్లు అంతర్జాతీయ వ్యవసాయ అధ్యయనాలు చెబుతున్నాయి. పశువులను, ఇతర జంతువులను ఇరుకైన షెడ్లలో పెంచడం వల్ల అవి స్వైన్ ఫ్లూయంజా, నోటి పుండు, గాలికుంటు వ్యాధుల బారిన పడుతున్నాయి. వాటి మాంసం ద్వారా ప్రజలకు రోగాలు సోకుతున్నాయి. అధిక మాంస వినియోగంవల్ల స్థూల కాయం, మధుమేహం, క్యాన్సర్, గుండె సంబంధ వ్యాధులు ఎక్కువవుతున్నాయి. ‘వరల్డ్ వాచ్’ నివేదిక ప్రకారం 1961లో ఆరుకోట్ల టన్నుల మాంసం వినియోగించగా, 2015 నాటికి అది 40 కోట్ల టన్నులకు చేరుకుంది. శారీరక సమస్యలతోపాటు, పర్యావరణ సమస్యలకూ కారణమవుతున్న మాంసాహార అతి వినియోగం నియంత్రణకు కళ్లాలు బిగించాల్సిన సమయమిది! ఒక మాంసం పేరు చెప్పి మరొక మాంసాన్ని అమ్మటంపై గట్టి నిషేధం విధించాలి.

◆ పుట్టా సోమన్న చౌదరి
9440339682

పదం

యంగ్ పాపులేషన్ (జనాభాలో యువత శాతం): జనాభా గణనలో యంగ్ పాపులేషన్ అంటే, పిల్లలు, యుక్త వయస్కులు, యువతరంతో కూడిన జనాభా అని అర్థం. జనాభా గణాంకాల్ని తయారు చేసేటపుడు 'మీడియన్ ఏజ్' అనే ఒక వయోపరిమాణాంకాన్ని ప్రమాణంగా తీసుకుని, ఈ అంకె కంటే తక్కువ వయస్సు కలిగిన జనాభాను యంగ్‌పాపులేషన్ గాను, ఈ అంకె కంటే ఎక్కువ వయస్సు కలిగిన జనాభాను వయోవృద్ధుల జనాభాగాను నిర్ణయిస్తారు. మీడియన్ ఏజ్ ఎంత తక్కువగా ఉంటే ఆ దేశాభివృద్ధి అంత హెచ్చుస్థాయిలో ఉంటుందని భావిస్తారు.

పథం

'మితిమీరిన జాత్యహంకారంతో, మూఢవిశ్వాసాలతో, జాతీయత పేరిట జరుగుతున్న అరాచకాలతో దేశం కునారిల్లిపోతోంది. ఈ సమస్యలన్నింటికీ మూలకారణం అవిద్య, అవివేకం మాత్రమే. సమాజంలోని అనేక సమస్యల్ని పరిష్కరించగల సైన్స్ గురించి కనీస జ్ఞానం లోపించింది, అంటే.., వేలాది శతాబ్దాలకు పూర్వం మనందరం ఒకే తల్లిబిడ్డలమన్న జ్ఞానం లోపించింది. దాంతో జాత్యహంకారం, మూఢవి శ్వాసాలు పెచ్చరిల్లుతున్నాయి. ఇతర సంస్కృతుల గురించిన విజ్ఞానం లోపిం చడం వల్ల ఇవాళ దేశంలో జాతీయవాదం పేరిట ఉన్మాదం తీవ్రస్థాయికి చేరుకుంది'.

- డేవిడ్ జె. గ్రాస్,
అమెరికన్ భౌతికశాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత.

తిరోగమనం?

ఛాందసవాదం వైపు నేటి యువత మొగ్గ

భారతీయ జనాభాలో అరవై కోట్ల మంది యువజనులే ఉన్నారు. మానవ సామాజిక పరిణామంలో పాతతరం నుంచి కొత్తతరానికి వారసత్వంగా సంక్రమించే అనేకానేక అంశాలతోపాటు, ప్రతి కొత్తతరం తనదైన కొత్త సమీకరణాల్ని, దృక్పథాల్ని రచించుకున్నపుడే సమాజం ముందుకు వెళుతుంది. ప్రవాహగుణం లేని సమాజం కునారిల్లిపోతుంది. ఢిల్లీకి చెందిన 'సెంటర్ ఫర్ ది స్టడీ ఇన్ డెవలపింగ్ సొసైటీస్' (సిఎస్‌డిఎస్) జర్మనీకి చెందిన 'కొన్రాడ్ అడెనార్ స్టిఫ్టంగ్' అనే మరో సంస్థ సౌజన్యంతో జరిపిన ఒకానొక అధ్యయనంలో భారతీయ యువత తిరోగమన దిశలో ప్రయాణం చేస్తున్నట్టు వెల్లడైంది. ఈ అధ్యయనంలో ఛాందసవాదం, గాఢమైన మతవిశ్వాసాలు, ఉద్యోగాల గురించిన ఆందోళన వెరసి అరవైకోట్ల భారతీయ యువజనుల ఆలోచనాధోరణిగా వెల్లడైంది. భవిష్యత్తు తరాలు ఆరోగ్యవంతమైన సామాజిక, మానసిక పరిణితిని కనబరచాలంటే ప్రస్తుత యువజనుల మనస్తత్వాన్ని, వారి అభిప్రాయాల్ని తెలుసుకోవడం ముఖ్యం. పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ, అస్సోమ్, తమిళనాడు, కేరళలతో పాటు 19 రాష్ట్రాలకు చెందిన 15 నుంచి 34 ఏళ్ళ యువతపై ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.

ఇంతవరకు మనం, మన ముందు తరాలు అభ్యుదయకర భావాలని వేటినైతే నమ్ముతున్నామో, వాటి పట్ల ఈ అధ్యయనంలో ప్రస్తుత యువతరం విముఖతను వ్యక్తం చేసింది. సంస్కృతీపరమైన లేదా మతపరమైన విశ్వాసాలకు అభ్యంతరకరంగా ఉన్న సినిమాల్ని నిషేధించి తీరాలని భారతీయ యువజనుల్లో పలువురు అభిప్రాయపడ్డారు. ఇలాంటి సందర్భాల్లో మనకు నచ్చని అంశాల్ని వ్యతిరేకించాలి, ఆ వ్యతిరేకతను ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తీకరించాలి. కానీ ఏకంగా నిషేధించాలని భావించడం మాత్రం ఛాందసత్వానికి ప్రతీక అవుతుంది. ఉరిశిక్షను వ్యతిరేకిస్తున్న వారికంటే, దానిని సమర్థించే యువజనులే ఎక్కువగా ఉన్నట్టు సిఎస్‌డిఎస్ అధ్యయనంలో తేలింది. అలాగే ఆవుమాంసాన్ని ఆహారంగా తీసుకోవడమన్నది వ్యక్తిగత అభిరుచికి సంబంధించిన విషయంగా పరిగణించడం లేదు సరికదా, దాని పట్ల మన యువజనుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉన్నట్టు ఈ అధ్యయనం చెబుతోంది. అయితే ఇక్కడ మతాన్ని ఒక ప్రాతిపదికగా తీసుకోవాల్సి వస్తోంది. ఎందుకంటే, ఇదే అధ్యయనంలో ముస్లిం మతానికి చెందిన యువజనుల్లో అత్యధికులు ఉరిశిక్షను వ్యతిరేకించారు. ఆవుమాంసాన్ని ఆహారంగా తీసుకోవడంపై అభ్యంతరాల్ని 69 శాతం మంది ముస్లిం యువజనులు వ్యతిరేకించారు. కాగా 31 శాతం మంది హిందువులు, 33 శాతం మంది సిక్కు యువజనులు ఆవుమాంసాన్ని ఆహారంగా తీసుకోవడాన్ని సమర్థించారు.

కాగా బాలబాలికలకు సమాన ప్రాతిపదికగా విద్యావకాశాలు అందాలన్న అంశంపై మతంతో నిమిత్తం లేకుండా భారతీయ యువజనులందరిలోను ఏకాభిప్రాయం, ఆమోదం కనిపించింది. భార్యలు భర్తల మాటను జవదాటకూడదని 51శాతం మంది యువజనులు అభిప్రాయపడ్డారు. పెళ్ళి తరువాత మహిళలు ఉద్యోగాలు చేయకూడదని 41 శాతం మంది అభిప్రాయపడ్డారు. వీరిలో యువతులు కూడా ఉండడం గమనార్హం. సైన్స్ మీద మతం ఆధిపత్యం ఉండి తీరాలని 45 శాతం మంది భావించారు. వివాహాలు, లైంగికతల విషయంలో భారతీయ యువజనుల్లో ఛాందసవాదం వేళ్ళూనుకున్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. పెళ్ళికి ముందు యువతీయువకుల మధ్య ప్రేమను వారు సమర్థించడం లేదు. మూడింట ఒక వంతు యువజనులు కులాంతర వివాహాల్ని వ్యతిరేకిస్తున్నారు. ఒకవేళ కులాంతర వివాహాల్ని సమర్థించినప్పటికీ, అలా సమర్థిస్తున్న యువజనుల్లో కొందరు దాన్ని కేవలం వాగాడంబరం కోసమే సమర్థిస్తున్నారు తప్ప, తమ వ్యక్తిగత జీవితాల్లో కులాంతర వివాహాన్ని ఇష్టపడడం లేదు. మన యువజనుల్లో నాలుగు శాతం మంది కులాంతర వివాహాలు చేసుకుంటే, మరో మూడు శాతం మతాంతర వివాహాల్ని చేసుకుంటున్నారు. కాగా 84 శాతం మంది పెద్దలు నిర్ణయించిన పెళ్ళిళ్ళే చేసుకున్నారు. ఆరు శాతం మంది మాత్రమే ప్రేమవివాహాలు చేసుకున్నారు. దళితులు (పదిశాతం), ముస్లింలు (ఏడు శాతం) ప్రేమవివాహాలు చేసుకుంటున్నారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లను అమలు చేయడం పట్ల నిమ్నకులాలు, తెగలకు చెందిన యువజనుల్లో బలమైన ఆమోదం కనిపిస్తుండగా, ఉన్నత కులాలకు చెందిన యువజనుల్లో ఈ రిజర్వేషన్ల పట్ల తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది, కేవలం 30 శాతం మంది మాత్రమే రిజర్వేషన్లను సమర్థిస్తున్నారు. విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో యువజనుల ప్రాతినిధ్యం పదేళ్ళతో పోలిస్తే 20 శాతం పెరిగింది. ఏది ఏమైనా ఇప్పటికిప్పుడు భారతీయ యువజనుల్ని ఆందోళనకు గురిచేస్తున్న అంశం 'కొరవడుతున్న ఉద్యోగావకాశాలు'.


సంస్కరణవాదం, అభ్యుదయ భావజాలం అన్నవి నిన్నటి తరానికి సంబంధించిన విషయంగా మారిపోయిన చేదునిజాన్ని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది. ఈ విషాద సత్యం మరింత విషమించక ముందే అన్ని సామాజిక వ్యవస్థలు కళ్ళు తెరవాల్సిన సమయం ఆసన్నమైందన్నది నిర్వివాదాంశం.

- కల్కి

వీక్షణం

సమాజం, సంస్కృతి అనే విషయాలు చర్చకు వచ్చినపుడు ఛాందసవాదం, సంస్కరణ వాదాల మధ్య సంఘర్షణ సహజం. మహిళల హక్కులు, స్వలింగసంపర్కం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ముఖ్యంగా ఇటీవల దేశంలో రాజకీయ, మత అసహనం వంటి విషయాల్లో ఈ సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. నగరాల్లో మాల్స్, వినోద సౌకర్యాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న నేపథ్యంలో యువత ఆలోచనాధోరణి ఏ దిశగా ప్రభావితమవుతోందో గమనించడం సమాజం ముందున్న కనీస బాధ్యత.





ఇంటర్వ్యూలు: క్రాంతి, కుమార్, మదనయ్య, పసుపులేటి గీత

తూణీరం

మార్కెట్టే తల్లీతండ్రీ

శిలాలోలిత, కవయిత్రి, విశ్రాంత అధ్యాపకురాలు



ముద్ర: భారతీయ యువత కులాంతర, మతాంతర వివాహాలు తప్పు అని, పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళే మంచివని అభిప్రాయ పడుతున్నట్టు ఇటీవల జరిగిన ఒక అధ్యయనంలో తేలింది, దీనిపై ఒక అధ్యాపకురాలిగా మీ అభిప్రాయం చెప్పండి.

శిలాలోలిత: ముందుతరాలు అంటే ఒక ముప్ఫై ఏళ్ళ క్రితం సాహిత్య అధ్యయనం జీవితంలో భాగంగా ఉండేది. తాము చదువుకున్న నీతిని జీవితంలో ఆచరించడానికి ఆ తరం వెనుకాడలేదు. ప్రయోగాత్మకంగా జీవించడానికే వాళ్ళు మొగ్గు చూపే వాళ్ళు. కానీ ఇవాళ పరిస్థితి భిన్నంగా ఉంది. ఇప్పటి పిల్లలు వాస్తవికధోరణితో ఆలోచిస్తున్నామనుకుంటూ సంకుచిత ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. అయితే ఇదివరకు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వాళ్ళు కూడా విఫలం కావడం ఈ పరిణామానికి కారణం. మానసికంగా పరిపక్వత లేనపుడు ఇలాంటి వివాహాలు విఫలమవుతాయి. ఆ వైఫల్యాల్ని చూసి, ఇవాల్టి పిల్లలు అలాంటి అభద్రతను తలకెత్తుకోవడానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ప్రపంచీకరణ ప్రభావం వల్ల కూడా ఇవాల్టి యువతరం ఈజీ మనీ, ఈజీఫేమ్ వంటి చట్రాల్లో ఇరుక్కుపోతున్నారు. దాంతో తల్లిదండ్రులు కూడా వాళ్ళకి పనికిరాని వాళ్ళయ్యారు. రాజకీయ ప్రభావాల చేతిలో కీలుబొమ్మలయ్యారు. పిల్లల్లో క్రూరత్వం పెరిగింది. పిల్లల్ని మార్కెట్ పెంచుతోందే తప్ప, తల్లిదండ్రులు కాదు! డబ్బు తెచ్చే అమ్మాయి అయితే చాలు జీవితం సుఖంగా గడిచిపోతుందని అబ్బాయిలు భావిస్తున్నారు. అలాగే ఆర్థికంగా ముందంజలో ఉన్న అబ్బాయిలైతే తమకు జీవితం సులభంగా ఉంటుందని అమ్మాయిలు భావిస్తున్నారు. కార్పొరేట్ ఉద్యోగాల వల్ల డబ్బే సర్వస్వం అయిపోయింది. పిల్లల్ని చైతన్యవంతుల్ని చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు మేధావుల మీద కూడా ఉంది.

విధానాన్ని సవరించాలి

ప్రభుత్వోద్యోగాలు, రిజర్వేషన్లపై మీ అభిప్రాయమేమిటి?

- వేదమాలిక, బి.టెక్. థర్డియర్, జెఎన్‌టియు, సంగారెడ్డి



ప్రస్తుత కాలంలో రిజర్వేషన్ల అవసరమెంత అనేది ఆలోచించాల్సిన విషయం. ఒక పక్క ప్రభుత్వోద్యోగాలు తగ్గిపోతున్నాయి. మరో పక్క రిక్రూట్‌మెంట్లు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదు. దానితో విద్యార్థులు, యువతీయువకులు నిరుత్సాహంలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తే ఉన్న కొన్ని అవకాశాలపై కూడా పరిమితి విధించినట్లు అవుతోంది. దానితో ఓసీ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. మాతో పాటే చదివిన తోటి ఎస్సీ విద్యార్థులు ప్రభుత్వోద్యోగాల్లో స్థిర పడడం మాకు ఆవేదన పెంచుతున్నది. ఉద్యోగాలు దొరికీ, దొరికినా కూడా అంతంతమాత్రమైనవే కావడంతో కష్టాలు పడతాం. దీనితో కులం మారాలనిపిస్తుంది. అందరమూ ఒకే కాలేజీలో, ఒకే క్లాసులో, అదే బెంచీలో కూచుని చదువుకుంటాం. ఉద్యోగాలకు అప్లై చేసేటప్పుడు మాత్రం మేము 500 అప్లికేషన్ ఫీజు కడితే వారు 100 రూపాయిలు మాత్రమే కడతారు. అన్ని కులాల్లోనూ పేదలున్నారు కదా! ఓసీల్లోని పేదలకు కూడా అంత ఎమౌంట్ కట్టాలంటే కష్టమే. అందరికీ ఒకటే అప్లికేషన్ ఫీజు పెట్టాలి.

ప్రభుత్వోద్యోగమే ఇష్టం

ప్రభుత్వ ఉద్యోగం లేదా ప్రయివేటు ఉద్యోగం... ఈ రెండింటిలో మీరు దేన్ని ఇష్టపడుతున్నారు?

- రౌతు సుమన్, ఎం.బి.ఏ. బుధవారప్పేట, పెద్దపల్లి జిల్లా



ప్రభుత్వోద్యోగమంటే ఇష్టం. ఎవరైనా హాయిగా, ఎంజాయ్‌ఫుల్‌గా గడపాలనే కోరుకుంటారు. గవర్నమెంట్ జాబ్ అయితే పర్మనెంటుగా ఉంటుంది. రెగ్యులర్ ఇన్‌కం వస్తూనే ఉంటుంది. పెద్దగా సాధకబాధకాలుండవు. ఒకటో, రెండో సార్లు తప్పిస్తే ఉన్నచోటే ఉద్యోగం చేసుకోవచ్చు. సమాజం గౌరవిస్తుంది. మా ఏరియాలో టీచర్లు, కండక్టర్లు, సింగరేణి ఉద్యోగాలు తప్పితే పెద్దగా ఉద్యోగులు లేరు. నేను గవర్నమెంట్ జాబ్ సంపాదిస్తే నాలుగైదు ఊళ్లల్లో నా గురించి చెప్పుకుంటారు. నన్ను ఇన్‌స్పిరేషన్‌గా చూపుతారు. ఈ విధంగా పేరుకు పేరూ వస్తుంది. సేవకు సేవ చేయొచ్చు. మా అమ్మానాన్నలు పడ్డ కష్టానికి ఫలితం దక్కుతుంది. ప్రయివేటు ఉద్యోగాలు కూడా దొరకడం కష్టమైన పరిస్థితిలో ప్రస్తుతం ప్రభుత్వ జాబ్‌కు మించింది లేదు. ఒక వేళ గవర్నమెంటు జాబ్ దొరక్కపోతే ప్రయివేటు ఉద్యోగాన్ని వెతుక్కోవాలి. అయితే అది కూడా 50, 60 వేలు జీతమొచ్చేదైతే బాగానే ఉంటుంది. చుట్టుపక్కల వారు కూడా బాగానే చెప్పుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగం, లేదా బ్యాంకు ఉద్యోగం కోసం ట్రై చేస్తున్నాను. దొరికితే మంచిది. దొరక్కపోతే ప్రైవేటుకు పోతా కానీ అక్కడా పెద్ద జాబ్ అయితే బాగుంటుంది.

మతం మంచిదే..!

మతం, సంప్రదాయం పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

- సాయి శ్రీభవి, డిగ్రీ స్టూడెంట్, హైదరాబాద్



మతం అంటే ఒక ప్రాక్టీస్. ట్రెడిషనల్ ప్రాక్టీస్‌గా భావిస్తారు. కానీ నా అభిప్రాయంలో మతమంటే ఒక వే ఆఫ్ లివింగ్. మానవత్వ బాటలో దైవత్వం వైపు నడచే ఒక విధానం. స్వామి వివేకానంద చెప్పినట్లు మతం మానవాళికి మంచి చేస్తుంది.కానీ చెడు చెప్పదు. దీన్ని అర్థం చేసుకోవాలి. మానవతను పెంచాలి కానీ మారణ హోమాన్ని సృష్టించొద్దు. అసలు మతమనే దాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ఇలాంటి హింసకు పాల్పడకుండా ఉంటారు. లేదంటే మా మతమే గొప్పదంటే, మా మతమే గొప్పదంటూ కొట్లాడుకుంటారు. మతం ఏం చేయాలన్నది అర్థమైతే ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడుస్తూ, ఇతరులకు సహాయపడే పనులే చేస్తారు. సమాజంలో మంచితనాన్ని పెంచుతారు. అందుకని అందరికీ మతమంటే 'మంచి' అనేది తెలియజెప్పాలి. ఏ మతమైన 'మంచి' కోసమే పని చేయమంటుంది అనేది అర్థం చేయించాలి. సంప్రదాయమంటే మనం ఫాలో అయ్యే ఆచారాలు. మన పెద్దల నుంచి మనకు అందినవే ఆచారాలు. మన తండ్రులు, తాత ముత్తాతలు, వారి ముందు తరాల వారు అనుభవించి ఆచరించాలంటూ మనకు అందించినవే ఆచారాలు. వాటిని ఆచరించడమే సంప్రదాయం. దాని ద్వారానే మనకు మంచి జరుగుతుంది. అందుకని ఆచారాలను, సంప్రదాయాలను ప్రతి ఒక్కరమూ గౌరవించాలి. అదే విధంగా అన్ని మతాలను గౌరవించాలి.

తూణీరం

తిరోగమనమే విప్లవమైంది

- జి.లక్ష్మీనరసయ్య, సాహిత్య విమర్శకుడు, అధ్యాపకులు



ముద్ర: స్వలింగ సంపర్కం, ఆవు మాంసం తినడం వంటి విషయాల్లో నిషేధమే సరైందని నేటి భారతీయ యువత భావిస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. వ్యతిరేకించడం కాకుండా, నిషేధించాలనడం ఏ ధోరణికి చిహ్నమని మీరు భావిస్తున్నారు?

జి.లక్ష్మీనరసయ్య: ప్రస్తుతం భారతదేశంలో 'హిందుత్వ' శక్తుల ప్రమేయం, ప్రభావం ఎక్కువైంది. ఆ క్రమంలో నేటి యువత తమకు తెలియకుండానే ఆ ప్రభావానికి గురవుతున్నారు. ఆవుమాంసం తినడం, స్వలింగ సంపర్కం వంటివి నేరాలని, ఆవుల్ని అమ్మడం, కొనడం కూడదని అంటూ దాడులకు తెగబడుతున్నారు. ఇదంతా హిందుత్వ రాజకీయాల్లో భాగమే. యువతలో విద్యాధికులు కూడా ఈ వెల్లువలో కొట్టుకుపోతున్నారు. ఒకప్పుడు కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడడం, పేదరిక నిర్మూలన కోసం పోరాడడం, హక్కుల సాధన కోసం ఉద్యమించడం వంటి పోరాటాల్ని విప్లవాలుగా పిలిచే వారు. ఇప్పుడు పరిస్థితి దానికి పూర్తి వ్యతిరేకంగా మారిపోయింది. ఆవుమాంసం తినకూడదు, స్వలింగ సంపర్కం నేరం వంటి తిరోగమన భావజాలాన్నే విప్లవాలుగా ప్రచారం చేస్తున్నారు. ఈ కుహనా విప్లవాల ప్రవాహంలో యువత గందరగోళానికి గురవుతోంది. 'హిందూ పరివార్' భావజాలంలో భాగంగానే యువత ఇలా కుహనా విప్లవాల్లోకి నెట్టబడుతున్నారు. 'ప్యూరిస్టిక్' భావజాలంలో పడిపోతు న్నారు. ఇలాంటి ధోరణి వల్ల తాము కొందరి బతుకుతెరువుకు ఆటంకంగా మారుతున్నామని, కొందరి ఆహారపు అలవాట్లకు అడ్డంకిగా మారుతున్నామని వాళ్ళకి తెలియడం లేదు. అణగారిన కులాల స్వాతంత్ర్యాన్ని అణచివేసి, మానవ విలువల్ని తుంగలోతొక్కే అగ్రకులాలకు చెందిన యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లాంటి వాళ్ళే ఇలాంటి భావజాలాన్ని వ్యక్తం చేయడం సాధారణమై పోయింది. ప్రపంచవ్యాప్తంగా వామపక్ష ఉద్యమాలు బలహీన పడి, ఛాందస శక్తుల ప్రభావం పెరగడం కూడా యువతలో ఇలాంటి తిరోగమన ధోరణి ప్రబలడానికి కారణమవుతోంది. వామపక్ష ఉద్యమాలు బలహీన పడడంతో యువతకు మరో ప్రత్యా మ్నాయం కనబడక, తిరోగమన శక్తుల్ని ఆరాధించడం జరుగుతోంది.

తప్పేమీ లేదు..

కులాంతర వివాహం పట్ల మీ అభిప్రాయమేమిటి?

- బర్గ వెంకటేశ్, మంథని



వధూవరుల ఇష్టంతో జరిగే కులాంతర వివాహాల్లో తప్పేమీ లేదు. పైగా మేనరికపు, అంతరకుల పెండ్లి కంటే ఈ పెండ్లి చేసుకున్న వారి పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని ఇటీవల ఓ పరిశోధనలో వెల్లడైంది. సామాజికంగా ఇది మరింత మంచిది. కులాంతర వివాహంతో కులరహిత సమాజం రాకపోవచ్చు. కానీ వేరువేరు కులాల్లోని కుటుంబాల మధ్య చుట్టరికం ఏర్పడుతుంది. వధూవరులిద్దరూ నచ్చిన వారిని చేసుకుని సంతోషంగా ఉంటారు. ఎవరో తెలియని వారితో సంసారం చేయడం కంటే నరకం లేదుగా? పిల్లల కులాంతర వివాహాలను అంగీకరించాలని తల్లిదండ్రులకు అనిపించినా లోకులనే కాకులు సూటిపోటి మాటలతో పొడిచి చంపుతాయనే భయంతో వెనుకడుగేస్తున్నారు. కొంత మంది మాత్రం ధైర్యం చేసి తమ పిల్లల కులాంతర ప్రేమను గెలిపిస్తున్నారు. అలా ఒక ఊరికి వంద కులాంతర వివాహాలు జరిగితే... విషయం సాధారణమై పోయి లో'కాకు'లు నోరు మూసుకుని ఉంటాయి. అయితే పిల్లలు కూడా తల్లిదండ్రులను ఒప్పించి పెండ్లి చేసుకోవాలి. పిల్లల పెండ్లిపై, భవిష్యత్తుపై పెద్దలు ఆశలు పెట్టుకుంటారు. కలలు గంటారు. మంచి కుటుంబంతో వియ్యమందుకోవాలని ఆలోచిస్తారు. కానీ అన్నీ మంచిగా ఉంటే కులాంతర వివాహాలను కూడా ఆమోదిస్తారు.

కొత్తేమీ కాదు..

బీజేపీ పాలనలో దేశంలో మత రాజకీయాలు పెచ్చరిల్లాయన్న వాదనతో మీరు ఏకీభవిస్తారా?

- సర్వు అశోక్, వరంగల్



దేశంలో బీజేపీ పాలనలో మతోన్మాదం ఎక్కువైందనేది కాదనలేని వాస్తవమే. అయినప్పటికీ 70 ఏళ్ల స్వతంత్ర భారతంలో మత రాజకీయాలు కొత్తేమీ కాదని నా అభిప్రాయం. ఎందుకంటే ఇన్నేండ్లలో భారత దేశాన్ని పాలించినవి రెండే పార్టీలు. ఒకటి కాంగ్రెస్, కాగా రెండోది బీజేపీ. బీజేపీ పాలనలో మాత్రమే మత రాజకీయాలు పెచ్చరిల్లుతున్నాయంటే కాంగ్రెస్ పాలనలో ఏమీ జరగలేదా? అనే ప్రశ్న తలెత్తుతుంది. అయితే ఇందిరమ్మ పాలనలోనూ స్వర్ణ దేవాలయంలో సిక్కుల ఊచకోత కాంగ్రెస్ మత రాజకీయాలకు నిదర్శనంగా చూపవచ్చు. ఎవరు చేశారు... ఎవరు చేయలేదు... అని బేరీజు వేసుకోవడం పక్కన పెడితే ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచార సమయంలో రామమందిరాన్ని తెరమీదకు తీసుకురావడం, దేశవ్యాప్తంగా జరుగుతున్న గోరక్షక దళాల దాడుల వంటివి బీజేపీ పాలనలో మత రాజకీయాలు రెట్టింపవుతున్నాయనే వాదనకు బలం చేకూర్చేవిధంగా ఉన్నాయి. ఎలాంటి మత ప్రస్తావన లేని ఎన్నికలు గానీ, రాజకీయాలు గానీ భిన్నత్వంలో ఏకత్వంలో చూసే భారతదేశంలో సాధ్యం కావాలంటే ముందు రాజకీయ పార్టీల్లో, నాయకుల్లో మార్పు రావాలి.

స్కిల్స్ నేర్పించాలి..

వృత్తి నైపుణ్యాలు పెంచుకునేందుకు యువతకు ఎలాంటి అవకాశాలు ఉండాలని మీరు భావిస్తున్నారు?

- అల్లి జస్వంత్, హన్మకొండ



గ్రామీణ ప్రాంతాల్లో సరైన వృత్తి నైపుణ్యాలు లేనందునే వేలాదిమంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. అందుకని వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి చదువుతో పాటు ప్రభుత్వం ప్రతి మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేయాలి. ఇప్పటి అవసరాల ప్రకారం యువతకు కంప్యూటర్, ఇంటర్‌నెట్ శిక్షణ, ఇంగ్లీష్ భాషపై పట్టు, కమ్యూనికేషన్ వంటి అంశాల్లో శిక్షణనిప్పించాలి. టీం వర్క్ వంటి నాయకత్వ లక్షణాలు కూడా నేర్పించాలి. వీటితో పాటు యువత ఎంచుకున్న వృత్తికి సంబంధించి స్కిల్స్ నేర్పించాలి. ఇవి వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన నాటి నుంచే నేర్పించాలి. కాలేజీలోనూ, నివాస ప్రాంతాల్లోనూ వీటిని ఏర్పాటు చేయాలి. అవకాశాలను దొరకబుచ్చుకునే నేర్పు, దానికి తగినట్లు పర్సనాలిటీని డెవలప్ చేసుకునే స్కిల్స్ కూడా నేర్పించే సెంటర్స్ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలి.

విద్యా సంస్థలేవీ?

(మొదటి పేజీ తరువాయి)



జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు కేటాయించాలని కోరినా ఫలితం లేదు'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ అధ్యక్షతన ప్రాథమిక విద్య, ఉన్నత విద్యపై రెండు రోజుల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి తెలంగాణ నుంచి కడియం శ్రీహరి హాజరయ్యారు. సమావేశం అనంతరం కడియం మీడియాతో మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థలను ఇచ్చిందని, తెలంగాణకు మాత్రం ఇవ్వలేదని అన్నారు. ట్రైబల్ యూనివర్సిటీకి స్థలం కేటాయించినా కేంద్రం నిధులు మంజూరు చేయడం లేదని చెప్పారు. కొత్త జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు కేటాయించాలని కోరినా ఫలితం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తూతూమంత్రంగా సమావేశాలు నిర్వహిస్తోందని, నా నిరసనను సమావేశంలోనే వ్యక్తం చేశానని తెలిపారు. నాతో పాటు పలు రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. బాలికా విద్యపై సబ్ కమిటీకి తాను చైర్మన్‌గా ఉన్నానని, తమ సిఫారసులు, సూచనలను కేంద్రం పట్టించుకోవడంలేదని, అలాంటప్పుడు సమావేశాలు నిర్వహించి ఉపయోగం లేదని కడియం పేర్కొన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు కేజీబీవీ స్కూల్స్‌ను 12వ తరగతి వరకు కొనసాగించాలని కోరినా. కేంద్రం పట్టించుకోలేదని వివరించారు. అయితే, తెలంగాణలో గురుకులాలపై జావడకేర్ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారని పేర్కొన్నారు. ఏటా నిర్వహించే సాధారణ సమావేశం మాదిరిగానే కేంద్ర విద్యా సలహా సంఘం సమావేశం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి 3 నెలలకోసారి సమావేశం నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. దేశంలో విద్యావ్యవస్థ పటిష్టానికి చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు.



పెట్రో మంటలు!

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఇదే అత్యధిక గరిష్ఠ స్థాయి. అదేవిధంగా లీటరు డీజిల్ ధర రూ.61.74గా రికార్డైంది. ముంబైలో మరింత ఎక్కువగా రూ.65.74గా నమోదయ్యాయి. ఇక హైదరాబాద్‌లో డీజిల్ రేటు రూ.67.08 కాగా.. పెట్రోల్ రేటు రూ.75.37కు చేరి దడ పుట్టిస్తున్నది. దేశంలోని నాలుగు ప్రధాన నగరాల్లో మంగళవారం పెట్రోల్ రేట్లు లీటర్‌కు 9 పైసలు, డీజిల్ రేట్లు 14 నుంచి 16 పైసల వరకు పెరిగాయి. పెట్రోల్ ధర అత్యధికంగా ముంబైలో రూ.79.15కు చేరడం గమనార్హం. 2014 డిసెంబరు తర్వాత తొలిసారి బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 70 డాలర్లకు మించింది. రోజువారీ ధరల సమీక్ష చేపట్టినప్పటి నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో ప్రభుత్వం వీటిపై ఎక్సైజ్ డ్యూటీలను సైతం తగ్గించింది. కానీ, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పరుగులు పెడుతున్నాయి. దీంతో గత నెల నుంచి డీజిల్ ధరలు లీటరుకు రూ.3.4 పెరగ్గా.. పెట్రోల్ ధర లీటరుకు రూ.2.09 మేర పెరిగినట్లు ఆయిల్ కంపెనీలు తెలిపాయి. ఇంధన అవసరాల కోసం మన దేశం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతుండటంతో అంతర్జాతీయ ధరలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రేట్లు పెరగడానికి కొన్ని ప్రధాన కారణాలివే...

- పెట్రోలు ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్)తో రష్యా, ఇతర ఉత్పత్తి దేశాలు కుదుర్చుకున్న ఒప్పందం మేరకు క్రూడాయిల్ ఉత్పత్తి భారీగా తగ్గింది. దీంతో ధరలు పెరుగుతున్నాయి.
- ఇక డాలర్ బలహీనపడటం, అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి బలంగా ఉండటం కూడా ధరల పెరుగుదలకు కారణంగా నిలుస్తున్నాయి.
- పెరుగుతున్న ధరల నియంత్రణకు నిరుడు అక్టోబరులో ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని లీటర్‌కు రూ.2 తగ్గించింది. దీనివల్ల ప్రభుత్వాదాయం ఏటా రూ.26 వేల కోట్లు తగ్గనుంది.
- ఢిల్లీలో పన్నులను తగ్గించినా నిరుడు జూన్ నుంచి పెట్రోల్ ధరలు 7 శాతం, డీజిల్ ధరలు 10 శాతం మేర పెరిగాయి.

తుమ్ము ఆపితే..!

(మొదటి పేజీ తరువాయి)



ఆపుకోవడం వల్ల గొంతు లోపల గాయం కావచ్చు, చెవిలో ఉండే కర్ణభేరి పగిలిపోవచ్చు, లేదా మెదడులో ఉండే నరాలు ఉబ్బిపోయి ప్రమాదం సంభవించొచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. తుమ్ము వచ్చినప్పుడు చాలా బలంగా బయటకు వస్తుంది. కొంతమందికి అయితే చాలా పెద్ద శబ్దంతో కూడా తుమ్ములు వస్తాయి. అలాంటప్పుడు పదిమందిలో చిన్నతనంగా ఉంటుందని భావించి ఎలాగోలా దాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తారు. ఆపుకోవడం సాధ్యం కాదని తెలిసినా అలాంటి ప్రయత్నాలు చేసేవాళ్లు చాలామందే ఉంటారు. కానీ 34 ఏళ్ల వ్యక్తి ఇలాగే తుమ్ము ఆపుకోవడం వల్ల ఇంగ్లండ్‌లోని లీసెస్టర్ ప్రాంతంలో ప్రాణాల మీదకు తెచ్చుకుని ఆస్పత్రిలో ఎమర్జెన్సీలో చేరాల్సి వచ్చింది. అతడి మెడ వాచిపోయి విపరీతంగా నొప్పి రావడంతో ఆస్పత్రికి వచ్చాడు. తుమ్ము ఆపుకోడానికి ముక్కును అదిమిపెట్టేవాడినని, ఆ తర్వాత మెడలో ఏదో ఉబ్బినట్లు అనిపించి నొప్పి మొదలైందని ఆ వ్యక్తి చెప్పాడు. వెంటనే వైద్యులు అతడికి సీటీ స్కాన్ తీస్తే.. తుమ్ము బలానికి అతడి గొంతు వెనకవైపు తీవ్రమైన గాయం కావడంతో పాటు నరాలు కూడా ఉబ్బాయి. దాంతో అతడు ఏదైనా మింగడం గానీ, మాట్లాడటం గానీ చేయలేకపోతున్నాడు. ముందుగా అతడికి ట్యూబు ద్వారా ఆహారం అందించి, తర్వాత యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేశారు. అతడి నొప్పి, వాపు రెండూ తగ్గేవరకు అలాగే చేయాల్సి వచ్చింది. వారం రోజుల చికిత్స తర్వాత అతడిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. తుమ్ములను ఆపుకోడానికి ముక్కు నొక్కిపెట్టడం, మూసేసు కోవడం లాంటివి చేయడం చాలా ప్రమాదకరమని, అలా చేయకుండా తుమ్ము వచ్చినపుడు తుమ్మేయడమే మంచిదని వైద్యనిపుణులు హెచ్చరించారు. కొన్ని సందర్భాలలో అయితే తుమ్మును ఆపుకున్నందువల్ల ఊపిరితిత్తుల మధ్య కొంత గాలి చొరబడి ప్రాణాపాయ స్థితి కూడా ఏర్పడుతుందన్నారు. ఒక్కోసారి మెదడులో రక్తనాళాలు ఉబ్బిపోతాయని కూడా వివరించారు. అందువల్ల తుమ్ములు వచ్చినపుడు మాత్రం అస్సలు ఆపే ప్రయత్నం అన్నదే చేయొద్దు!!

పంపిణీ... పకడ్బందీ!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులతోపాటు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికీ ఒక రోజు ముందు లేదా మార్చి 11న ఉదయానికల్లా పాస్‌పుస్తకాలు చేర్చాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. ''భూ రికార్డుల ప్రక్షాళనలో 93 శాతం భూమి, 92 శాతం ఖాతాలు వివాదరహితమని తేలింది. ఫిబ్రవరి నెలాఖరుకల్లా వివిధ స్థాయుల రెవిన్యూ కోర్టుల బదులు జిల్లా మొత్తానికీ ఒక్కటే ఉండాలి. అటుపైన మార్చి 12 నుంచి విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నందున ఈ దిశగా చేసిన కృషి మొత్తం స్థిరపడాలి. ఇక ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ శాఖ అనవసరం. రాష్ట్రవ్యాప్తంగా రోజువారీ రిజిస్ట్రేషన్లు 2,500 నుంచి 4వేలదాకా ఉంటాయి. ఇప్పుడున్న 141 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా 443 మండల కార్యాలయాలు కూడా రిజిస్ట్రేషన్ వ్యవహారాలు చూస్తాయి. ఆ విధంగా మొత్తం 584 మండలాల్లో రిజిస్ట్రేషన్ ఆఫీసులుంటాయి. రిజిస్ట్రేషన్ తర్వాత సత్వర మ్యుటేషన్ తదితరాల కోసం ''కోర్ బ్యాంకింగ్ నెట్ వర్క్'' విధానాన్ని ప్రవేశపెడుతున్నాం. పాస్ పుస్తకాల్లో ఎంట్రీలు, మార్పుచేర్పులు తక్షణం పూర్తవుతాయి.
దీనికోసం తగిన సాంకేతిక సదుపాయాలు కల్పిస్తున్నాం. క్రయవిక్రయదారులిద్దరికీ పాస్ బుక్కులు కొరియర్ ద్వారా ఇంటికే పంపుతాం. 'ధరణి' వెబ్‌సైట్‌లో కూడా వెంటన అప్‌డేట్ అవుతుంది'' అని సీఎం ఈ సందర్భంగా వివరించారు. అలాగే 'ధరణి'ని ప్రపంచంలో ఏ మూలనుంచైనా చూడవచ్చునని చెప్పారు. కాగా, భూ రికార్డుల ప్రక్షాళనను విజయవంతంగా పూర్తిచేసినందుకు రెవెన్యూ మంత్రితోపాటు ఆ శాఖ కార్యదర్శి, కార్యక్రమ ప్రత్యేకాధికారిసహా జిల్లా యంత్రాంగాలను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ స్ఫూర్తి ఇలాగే కొనసాగాలని, మున్ముందు పూర్తిగా అవినీతిరహితంగా అన్ని పనులూ సాగాలని సూచించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచలేమా?

రాష్ట్రంలో ప్రస్తుతం 8,684 పంచాయతీలుండగా మరో 4వేలు కొత్తగా ఏర్పాటయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. దీన్ని శాసన ప్రక్రియద్వారా చేపడుతున్నందున కోర్టు కేసులకు తావివ్వని రీతిలో పంచాయతీలు ఏర్పరచాలన్నారు. జిల్లా పంచాయతీరాజ్ అధికారుల ప్రతిపాదనలకు అనుగుణంగా వాటికి భౌగోళిక హద్దులు ఏర్పాటు కావాలని స్పష్టం చేశారు. అలాగే పంచాయతీలకు తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని చెప్పారు. గ్రామాల్లో పరిశుభ్రత నిర్వహణపైనా సీఎం కేసీఆర్ దృష్టి సారించారు. ''మనం చాలా విషయాల్లో విజయం సాధించాంగానీ, గ్రామాలను శుభ్రంగా ఉంచలేకపోయాం. దీనిపై చాలా విమర్శలూ వచ్చాయి. ఇందుకు తావివ్వడం తగదు. పనిచేసే పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి'' అన్నారు. పంచాయతీలపై ఇంతకుముందు కలెక్టర్లకు అధికారాలుండేవని, ఇప్పుడు వారి నియంత్రణ లేకుండా పోయిందని గుర్తుచేశారు. ''ఏ గ్రామానికి పోయినా పెంటకుప్పలుగా ఉంటున్నది. ఈ నేపథ్యంలో పంచాయతీకి అప్పగించాల్సిన బాధ్యతలపై ఆలోచన చేయాలి. ఇందులో భాగంగానే మునిసిపల్ చట్టానికి కూడా సవరణలు చేయాలని ఆలోచిస్తున్నాం'' అన్నారు.

మనకు అసాధారణ శక్తియుక్తులున్నాయి

రాష్ట్రానికి దేన్నయినా సాధించగల అసాధారణ శక్తియుక్తులున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ''సమగ్ర కుటుంబ సర్వే ఒక్కరోజులో చేయగలిగాం. విద్యుత్ సమస్యను పూర్తిగా అధిగమించి వ్యవసాయానికి నిరంతర కరెంటు సరఫరా చేస్తున్నాం. తాగునీటి సమస్యకు అతి స్వల్ప సమయంలో పరిష్కారం కనుగొన్నాం. భూ రికార్డుల ప్రక్షాళన 100 రోజుల్లో పూర్తిచేశాం. ప్రజలు దీనిపై వందశాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమ ముంగిటకు వచ్చి, లంచాలు లేకుండా తమ భూమికి రక్షణ కల్పించిందని



కొనియాడుతున్నారు'' అని పేర్కొన్నారు. గొర్రెల పంపిణీపై చాలామంది ఎన్నో అనుమానాలు వ్యక్తిచేసినా 35 లక్షల మేర పంచగా ఇప్పుడు వాటి 50 లక్షలు అదనంగా చేరాయని తెలిపారు. రైతులకు నకిలీ విత్తనాల బాధ లేకుండా చేశామని, పురుగు మందుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. దీంతోపాటు ఎకరాకు రూ.8వేల వంతున పంట పెట్టుబడి ఇస్తున్నా రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటేనని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ ఈ పథకాన్ని ప్రశంసించారని పేర్కొన్నారు. రైతుకు మద్దతు ధర కోసం సమన్వయ సమితులను ఏర్పాటుచేశామని చెప్పారు. ఈ సమితుల ద్వారా పంట కాలనీల విధానం తీసుకురాగలమని తెలిపారు. అలాగే రాష్ట్రంలో 2600 మందికిపైగా వ్యవసాయ విస్తరణాధికారులను నియమించామని తెలిపారు. అధికోత్పత్తి సాధించగల పంటలు పండించేలా చూస్తామని చెప్పారు. మార్కెట్‌కు పంట వచ్చే ముందే లైసెన్సుడ్ కొనుగోలుదారు లేదా కమిషన్ ఏజంట్‌తో సమన్వయ సమితి సభ్యులు మాట్లాడి ధర నిర్ణయిస్తారని తెలిపారు. రైతులు వంతులవారీగా రోజుకు కొందరు చొప్పున మార్కెట్‌కు వచ్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

స్థాయినిబట్టి పంచాయతీలకు నిధుల వితరణ

రాష్ట్రస్థాయి ఆర్థిక కమిషన్‌ను ఏర్పాటు చేసిన నేపథ్యంలో మార్చి 12న ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రూ.2వేల కోట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. పంచాయతీలకు ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల విధివిధానాలను శాసనసభలో ప్రవేశపెట్టే బిల్లులో పొందుపరుస్తామని తెలిపారు. చిన్న పంచాయతీకి (500వరకు జనాభా) రూ.5 లక్షలు, తర్వాతిస్థాయిలోని వాటికి రూ.10 లక్షలు... ఇలా స్థాయినిబట్టి 15, 20, 25 లక్షల వంతున సమకూరుస్తామని ప్రకటించారు. వందశాతం పన్నుల వసూలుకు కృషి చేస్తామని చెప్పారు. జాతీయ ఆర్థిక సంఘం నిధులు ఉపయోగించుకుంటామని, ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో ఆస్తులను సమకూర్చుకుంటామని తెలిపారు. దీనికితోడు ఎమ్మెల్యే, ఎంపీ నియోజకవర్గ నిధులను కూడా గ్రామాభివృద్ధికి ఉపయోగించుకుంటామని చెప్పారు. పట్టుదలతో కృషిచేస్తే పరిశుభ్ర, ప్రగతిశీల గ్రామీణ తెలంగాణను సాధించుకోగలమని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, నాయిని నర్సింహారెడ్డి, జోగు రామన్న, తలసాని శ్రీనివాసయాదవ్, జగదీష్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, పద్మారావు, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఎంపీ కె.కేశవరావు, అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా పంచాయితీ అధికారులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇతర నిర్ణయాలు ఇలా..

- షెడ్యూల్డ్, ప్లెయిన్ ఏరియాల్లో సాదా బైనామాలు ఇంతవరకు దరఖాస్తు చేసుకున్నంతవరకు పూర్తి చేయాలి.
- ఆర్వోఎఫ్ఆర్. ప్రతిపాదనలు జిల్లాల వారీగా ప్రభుత్వానికి పంపిస్తే వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం.
- జిల్లాల వారీగా భూ ప్రక్షాళనకు సంబంధించి ఇంకేమన్నా సమస్యలుంటే వాటిని ప్రభుత్వానికి పంపాలి.
- మార్చి 12 తర్వాత సాదా బైనామా దరఖాస్తులు స్వీకరించడం కుదరదు. భూ బదలాయింపులన్నీ రిజిస్ట్రేషన్ ద్వారా కానీ, వారసత్వహక్కుగా మ్యుటేషన్ కాని జరగాలి.
- కొత్తగా సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగిస్తున్న 443 తహశీల్దార్లకు, ప్రస్తుతం పనిచేస్తున్న 141 మంది సబ్ రిజిస్ట్రార్లకు, రిజిస్ట్రేషన్ కొత్త విధానంలో, ఐటి అప్లికేషన్లలో శిక్షణ
- మార్చి, 12 తర్వాత బ్యాంక్ రుణాల కొరకు పట్టాదారు పాస్ పుస్తకాలు తాకట్టుపెట్టుకోకూడదు. ధరణి వెబ్ సైట్ లో వివరాలు చూసుకోవాలి.
- భూ సంబంధమైన సమస్యలు చాలా సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఇప్పుడు ఆ చిక్కులన్నీ తొలగిపోవాలి. ఈ సమస్యల్లో ప్రధానమైంది అసైన్డ్ భూములు. ఈ ప్రక్రియ గతంలో చాలా అశాస్త్రీయంగా జరిగింది. దరిమిలా చాలా మంది దగ్గరనుండి ధనవంతులు కొనుగోలు కూడా చేసారు. చాలా అవకతవకలు కూడా జరిగాయి. ఈ విషయంలో ఏం చేయాలనే విషయంలో ఒక విధానం రూపొందించాలి. రెవిన్యూ శాఖ గైడ్ లైన్స్ రూపొందించాలి. వీటికి అనుగుణంగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తమ జిల్లాలలో పరిశీలించి తగు విధంగా నిర?యం తీసుకోవాలి. అసైన్డ్ భూముల విషయంలో మానవత్వ కోణంలో ఆలోచించాలి.
- ఈనెల 25 కల్లా జిల్లాల నుంచి కొత్తగా ఏర్పాటు చేయబోయే గ్రామ పంచాయతీల భౌగోళిక సరిహద్దులు (పరిధి) నిర్ణయించి ప్రభుత్వానికి కలెక్టర్లు వివరాలు పంపాలి కొత్త పంచాయతీల ఏర్పాటుకు కనీస జనాభా 500 వుండాలి. విడిపోతున్న గ్రామపంచాయతీకి కొత్తగా ఎర్పాటు కాబోయే పంచాయతీకి మధ్య కనీసం ఒకటిన్నర కిలోమీటరు నుండి రెండు కిలోమీటర్ల దూరం వుండాలి.
- గ్రామాలు బాగుపడటానికి పంచాయతీ వ్యవస్థ ఎలాఉండాలో అనే దాని మీద కలెక్టర్లు వాళ్ల సూచనలు సలహాలు పంచాయతీరాజ్ కార్యదర్శికి పంపాలి. సర్పంచుల నుంచి పని రాబట్టుకోవటానికి ఏం చేయాలనే విషయంపై జిల్లా పంచాయతీ అధికారులు సూచనలు ఇవ్వాలి. పంచాయతీలను సరిగ్గా పనిచేయించి సత్ఫలితాలను సాధించడానికి ఏం చేయాలనే విషయమై సూచనలు సలహాలు ఇవ్వాలి.
- పై సూచనలు, సలహాల ఆధారంగా కొత్త పంచాయతిరాజ్ చట్టం ముసాయిదా బిల్లును ఫిబ్రవరి మొదటి వారంలో శాసన సభలో ప్రవేశపెడుతాం.
- రాబోయే ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచులకు వారు పదవీ బాధ్యతలు చేపట్టేలోపల శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి.
- గ్రామపంచాయతీ స్థాయిలో సక్రమంగా పనిజరగకపోతే గ్రామం అభివ ద్ధి సరిగ్గా వుండదు.
- చాలా జిల్లాలకు 2-4 లక్షల జనాభా మాత్రమే వుంది. ప్రతి జిల్లాలో వున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాల స్థితిగతులు కంప్యూటరైజ్ చేయాలి. ఈ వివరాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ లో కేటాయించిన విధంగా నిధులు వృథా కాకుండా ఉపయోగపడాలి.
- పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన ఇతర వర్గాల అభివ ద్ధికి మరిన్ని కార్యక్రమాలు రూపొందిస్తుంది. ఇవి ముఖ్యంగా ఆరోగ్య, వైద్య రంగంలో వుంటాయి.
- 2020కల్లా తప్పకుండా కోటి ఎకరాలకు సాగునీరు అందిస్తుంది ప్రభుత్వం. ఈ సంవత్సరం డిసెంబర్ చివరికే చాలా భాగంకు కాళేశ్వరం నీళ్లు వస్తాయి.
- గొర్రెల పంపకం పథకం పకడ్బందీగా అమలవుతున్నందుకు కలెక్టర్లను, ఇతర సంబంధిత అధికారులను అభినందిస్తున్నాను. ఇప్పటికే 38,28,987 గొర్రెల పంపిణీ జరగ్గా, వీటికి అదనంగా 14,56,376 గొర్రె పిల్లలు పుట్టాయి. మొత్తం ఇంతవరకు 52,79,363 గొర్రెలు అదనంగా రాష్ట్రంలో చేరాయి. ఇది పెద్ద కార్యక్రమం.


ఇదొక సంచార బ్యాంక్ లాం టిది. రాబోయే రోజుల్లో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు మాంసం ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటది. గొర్రెల పెరుగుదలతో పాటు వాటికి అవసరమైన దాణా గడ్డిని కూడా పెంచాలి. పండ్ల తోటల వివరా లు సేకరించి అక్కడ గడ్డి పెంచే ఆస్కారం పరిశీలించాలి.

- స్థానిక తక్షణ అవసరాల కోసం పెద్ద జిల్లాల కలెక్టర్లకు రూ. 1.5 కోట్లు, చిన్న జిల్లాలకు రూ. 1 కోటి కేటాయించాలి.

హజ్ సబ్సిడీ ఖల్లాస్

ఈ ఏడాది నుంచే తీసేసిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 16:



కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. హజ్ యాత్రికులకు ఇంతకాలం ఇస్తున్న సబ్సిడీని పూర్తిగా రద్దుచేసింది. ఈ సంవత్సరం నుంచే.. హజ్ యాత్రకు వెళ్లేవారికి ప్రయాణ చార్జీలలో ఎలాంటి సబ్సిడీ ఉండబోదు. ముస్లింలను బుజ్జగించడానికి బదులు వారికి కూడా 'గౌరవంతో కూడిన అభివృద్ధి'ని అందించాలన్న తమ ప్రభుత్వ లక్ష్యంలో భాగంగానే ఈ చర్య తీసుకున్నట్లు కేంద్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు.

2022 నాటికల్లా దశలవారీగా హజ్ సబ్సిడీని పూర్తిగా ఎత్తేయాలని 2012లో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి తెలిపింది. పైగా.. ఇప్పుడు సబ్సిడీ వల్ల ముస్లింలకు ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని, కేవలం కొన్ని ఏజెన్సీలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ హజ్ యాత్ర కోసం వెచ్చిస్తున్న మొత్తాన్ని ఇక మీదట బాలికల విద్య, వారి సాధికారతకు కేటాయిస్తామని ఆయన చెప్పారు. ఇక సబ్సిడీ ఎత్తేయడం వల్ల యాత్రకు అయ్యే ఖర్చు పెరుగుతుందని, దాన్ని తగ్గించేందుకు త్వరలోనే నౌకా మార్గంలో కూడా హజ్ యాత్ర చేయించే అవకాశం చూస్తామన్నారు. సబ్సిడీ రద్దు వల్ల దాదాపు లక్షా 75 వేల మంది హజ్ యాత్రికులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇక మీదట వీరు ఒక్కొక్కరికి రూ. 1.70 లక్షల చొప్పున యాత్రకు ఖర్చవుతుందని అంటున్నారు. హజ్ యాత్రకు వెళ్లడానికి 2014లో విమాన టికెట్ల చార్జీ రూ. 35వేల వరకు తీసుకునేవారు. కానీ వాస్తవ టికెట్ ధర మాత్రం రూ. 63,750 నుంచి రూ. 1,63,350 వరకు ఉండేది. 2015లో యాత్రికుల నుంచి తీసుకునే మొత్తాన్ని రూ. 42 వేలకు పెంచారు. 2016 సంవత్సరంలో కేంద్రం హజ్ యాత్రికులకు సబ్సిడీ కోసం రూ. 405 కోట్లు ఖర్చుచేసింది. 2014లో రూ. 577.07 కోట్లు, 2015లో రూ. 529.51 కోట్ల చొప్పున ఖర్చుచేశారు.

రాబోయే ఐదేళ్ల పాటు భారత హజ్ కమిటీ, ప్రైవేటు టూర్ ఆపరేటర్లకు కేటాయించే హజ్ కోటా నిష్పత్తిని 70:30గా ఉంచాలని కూ డా కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కాంట్రాక్టర్ల జోక్యాన్ని పూర్తిగా నివారించి పారదర్శకమైన బిడ్డింగ్ తేవాలని కూడా ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది. భారత్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే ప్రయాణికుల కోటాను ఐదు వేలు పెంచుతూ సౌదీ అరేబియా నిర్ణయం తీసుకోవడంతో ఈసారి దాదాపు 1.75 లక్షల మంది యాత్రికులు వెళ్లే అవకాశం ఉంది. ఇక 45 ఏళ్ల వయసు దాటిన మహిళలు ఎవరి సాయం లేకుండా నలుగురి చొప్పున బృందంగా హజ్ యాత్ర చేయడానికి సౌదీ ప్రభుత్వం అనుమతించడంతో.. ఈసారి దాదాపు 1300 మంది మహిళలు కూడా మన దేశం నుంచి వెళ్లే అవకాశం కనిపిస్తోంది.

స్వాగతించిన లా బోర్డు

ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు ప్రతినిధి కమాల్ ఫారూఖీ కేంద్ర ప్రభుత్వ చర్యను స్వాగతించారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వల్ల ముస్లింలు లాభపడుతున్నారంటూ ఇన్నాళ్లూ తప్పుడు ప్రచారం జరిగిందని ఆయన చెప్పారు. ఈ సబ్సిడీ వల్ల ఎక్కువగా లాభపడింది విమానయాన సంస్థలని, అందులోనూ ఎయిరిండియా దీన్ని బాగా సొమ్ము చేసుకుందని ఆయన అన్నారు.

అల్లుడు దొంగ!

(మొదటి పేజీ తరువాయి)

రామ్‌నగర్‌లో నివసిస్తుంటారు. వీరిద్దరూ అప్పుడప్పుడూ వచ్చి వృద్ధురాలి యోగక్షేమాలు విచారించి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సమస్యలతో సతమవుతున్న హ్యారీ డిసెంబరు 31న అర్ధరాత్రివేళ అదనుచూసి ఇంట్లో దూరి అడ్డొచ్చిన వృద్ధురాలిని ఒక్క తోపుతోశాడు. ఆమె స్పృహ కోల్పోవడంతో బీరువా తలుపులు పగులగొట్టి అందులో దాచిన రూ.2.5 లక్షల నగదు, రూ.7 లక్షల విలువైన 18 తులాల బంగారం దోచుకుపోయాడు. వెళ్లే ముందు సాక్ష్యాలు దొరక్కుండా ఆ ప్రాంతంలో కారంపొడి చల్లాడు. ఈ దుశ్చర్యకు పాల్పడే ముందే భార్యతో కలసి మామగారింటికి వచ్చాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలితో ఇద్దరూ కాసేపు మాట్లాడాక రాత్రి 8:30 గంటల ప్రాంతంలో తిరిగి వెళ్లిపోయారు. ఆ తర్వాత భార్యను ఇంట్లో వదిలి అత్తామామలను తీసుకొచ్చేందుకు ఎయిర్‌పోర్టుకు వెళ్తానన్న హ్యారీ అక్కడినుంచి ప్రసాద్ ఐమాక్స్‌లో సినిమాకు వెళ్లాడు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో చల్లగా మామగారింట దూరి దోపిడీకి పాల్పడ్డాడు. అతడి దెబ్బకు అపస్మారక స్థితిలో పడిన వృద్ధురాలికి తెల్లవారుజామున స్పృహ రాగా అత్తమామలను తీసుకొచ్చేందుకు వెళ్తున్న అల్లుడికే ఫోన్‌చేసి దొంగతనం గురించి చెప్పింది. అనంతరం ఎయిర్‌పోర్ట్ నుంచి తిరిగొచ్చిన మామగారితో కలిసి అమాయకుడిలా నటిస్తూ అందర్నీ బురిడీ కొట్టించాడీ అల్లుడు దొంగ. అయితే, మామగారి ఫిర్యాదు అందుకున్న ఎస్.ఆర్.నగర్ పోలీసులు- మామా అల్లుళ్ల ఇళ్ల మధ్య 18 కిలోమీటర్ల పరిధిలోని సుమారు 70 సీసీటీవీ పుటేజీలను లోతుగా పరిశీలించి చివరకు దొంగల్లుడిని మంగళవారం అరెస్ట్ చేశారు. హ్యారీ నుంచి రూ.1.1 లక్షల నగదును, 12 తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకుని అతణ్ని కోర్టులో హాజరుపరిచారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన డీఐ సతీశ్, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

మరో కేసులో పనిమనిషి అరెస్టు

కల్యాణ్‌నగర్ నివాసి సి.పి.కోదండపాణి తన నివాసంలో 10 తులాల ఆభరణాలు దొంగతనానికి గురైనట్లు డిసెంబరు 4న ఫిర్యాదు చేశారు. పనిమనిషి టి.సునీతపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్.ఆర్.నగర్ పోలీసులు ఆమెను విచారించగా నేరం అంగీకరించింది. ఆమె వద్ద నుండి 10 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పంజాగుట్ట ఏసీపీ విజయ్‌కుమార్ వెల్లడించారు.

త్వరలో టీటీడీ పాలకమండలి

చిత్తూరు/అమరావతి, జనవరి 16: తిరుమల తిరుపతి దేవస్థానానికి త్వరలో పాలకమండలిని నియమిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. టీటీడీ ఆదాయం పెంపునకు మార్గదర్శకాలు రూపొందిస్తామని తెలిపారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చిత్తూరు జిల్లాను కరువు రహితంగా తయారు చేస్తామని చెప్పారు. చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలసి సొంతూరు నారావారిపల్లిలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. మంగళవారం నారావారిపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మదనపల్లెను టమోటా హబ్‌గా రూపొందిస్తామన్నారు. చిత్తూరులో సెరికల్చర్, డెయిరీకి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. జిల్లాలో 100 శాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ప్రజలను కోరారు. చిత్తూరు జిల్లాలో టూరిజాన్ని ప్రోత్సాహిస్తామని తెలిపారు. స్థానికులు తమ సమస్యలపై ముఖ్యమంత్రికి అర్జీలు అందజేయడానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. చంద్రబాబు ఇంటి ముందు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగపూజ చేసిన చంద్రబాబు

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. నారావారిపల్లిలో జరిగిన వేడుకల్లో చంద్రబాబు నాయుడు, ఆయన భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చంద్రబాబు, లోకేశ్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పలు సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. సంప్రదాయం ప్రకారం సోమవారం నాగులమ్మ కట్టను చంద్రబాబు దర్శించి, నాగుల పూజ చేశారు. అనంతరం తల్లిదండ్రుల సమాధులను సందర్శించి, నివాళులర్పించారు. చంద్రబాబు రాకతో నారావారిపల్లిలో సందడి నెలకొంది. బంధువులు, చిన్ననాటి స్నేహితులతో కలసి ఆయన హుషారుగా సంక్రాంతి పండుగను జరుపుకొన్నారు. చంద్రబాబు వియ్యంకుడు నందమూరి బాలకృష్ణ కూడా వేడుకల్లో పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు ఈ నెలలో మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. బుధవారం ఢిల్లీలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు- 2018 సన్నాహక సమావేశంలో సీఎం పాల్గొంటారు. ఈ సమావేశంలో చంద్రబాబుతో పాటు పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారు.

మంజువిరట్టులో అపశృతి

ఎద్దులు పొడిచి ఇద్దరు మృతి.. 50 మందికి గాయాలు.. తమిళనాడులో ఘటన



మదురై, జనవరి 16: తమిళనాడులోని శివగంగ జిల్లాలోని సిరియావాయల్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన సంప్రదాయ క్రీడ 'మంజువిరట్టు'లో అపశృతి చోటుచేసుకుంది. క్రీడా ప్రాంగణం బయట జరిగిన ఘటనలో కార్యక్రమాన్ని తిలకించడానికి వచ్చిన ఇద్దరిని ఎద్దులు పొడవడంతో మరణించగా, 50 మంది గాయపడ్డారు. క్రీడా ప్రాంగణం బయట గుర్తు తెలియని వ్యక్తులు ఎద్దులను విడిచి పెట్టారని, దీంతో ప్రమాదం జరిగిందని, ఇందుకు కారణమైన వారిని గుర్తించేందుకు యత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు. తమిళనాడు సంప్రదాయ క్రీడ జల్లికట్టు తరహాలోని మంజువిరట్టులో కూడా ఎద్దును నిలువరించడమే ప్రధాన అంశం. అయితే జల్లికట్టులో ఒక సారి ఒక ఎద్దునే మాత్రమే మైదానంలోకి వదులుతారు, మంజువిరట్టులో మాత్రం ఒకటి కంటే ఎక్కువ ఎద్దులను ఒకేసారి చుట్టూ బారికేడ్లు కట్టిన ఉన్న భారీ ప్రాంగణంలోకి వదులుతారు. ఒకేసారి చాలామంది వాటిని నిలువరించేందకు యత్నిస్తారు. 400 ఏళ్ల చరిత్ర ఉన్న మంజువిరట్టును సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏటా గ్రామంలో నిర్వహిస్తారు.

హరిద్వార్ టు 'హర్'ద్వార్!

'నెట్టింట్లో' పతంజలి ఉత్పత్తులు.. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పేటీఎంలలో అందుబాటు



న్యూఢిల్లీ, జనవరి 16: ప్రముఖ ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ 'పతంజలి' తన దూకుడును మరింత పెంచింది. తన ఉత్పత్తులతో దిగ్గజ ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకు దడ పుట్టిస్తున్న సంస్థ తాజాగా మరో కీలక నిర్ణయాన్ని వెల్లడించింది. ఆన్‌లైన్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చినట్టు తెలిపింది. ఇకపై హరిద్వార్ నుంచి 'హర్'ద్వార్ (హరిద్వార్ నుంచి ప్రతి గుమ్మం) దాకా తమ ప్రపంచ స్థాయి ఉత్పత్తులను అందించనున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు పలు ప్రముఖ ఇ-రీటైలర్లు, అగ్రిగేటర్లతో తమ భాగస్వామ్యాన్ని ప్రకటించింది. తదనుగుణంగా ఇక మీదట ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పేటీఎం మాల్, బిగ్ బాస్కెట్, నెట్‌మెడ్, గ్రోఫర్స్ తదితర ఆన్‌లైన్ కామర్స్ సైట్‌లలో పతంజలి ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. దీనికి సంబంధించి యోగా గురు రాందేవ్ బాబా, సంస్థ సీఈవో బాలకృష్ణ మంగళవారం కీలక ప్రకటన చేశారు. పతంజలికి సంబంధించి పలు ఉత్పత్తులు ఈ-కామర్స్ సైట్లలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. తద్వారా తమ సంస్థ ఉత్పత్తులన్నీ వినియోగదారుల ముంగిళ్లకే చేరనున్నాయని చెప్పారు.

వారాంతంలో ఊరట!



సుప్రీం సంక్షోభానికి చుక్క పడలేదు.. 'ఆ నలుగురి'తో చీఫ్ జస్టిస్ భేటీ

చక్కబడుతుందని ఆశిద్దాం: ఏజీ



న్యూఢిల్లీ, జనవరి 16:

అనేక మలుపులు తిరుగుతున్న సుప్రీం కోర్టు సంక్షోభంలో ఈ వారాంతానికి ఊరట లభించే అవకాశం ఉందన్న మాట వినిపిస్తోంది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా మంగళవారం నలుగురు తిరుగుబాటు జడ్జిలతో సమావేశమయ్యారు. సుమారు 15 నిమిషాల స్వల్ప సమయంలో ముగిసిన ఈ భేటీలో జస్టిస్ ఎ.కె.సిక్రీతోపాటు మరో ఇద్దరు న్యాయమూర్తులు కూడా పాల్గొన్నారని సమాచారం. అభిప్రాయభేదాల పరిష్కారానికి సీజేతోపాటు నలుగురు జడ్జిలు వేసిన తొలి అడుగుగా న్యాయ వర్గాలు ఈ పరిణామంపై వ్యాఖ్యానిస్తున్నాయి. 'ఆ నలుగురు' జడ్జిలు సోమవారం తమ తమ విధులకు హాజరు కావడం కూడా వివాదం చల్లారడానికి దోహదపడుతుందని పేర్కొంటున్నాయి. తిరుగుబాటు జడ్జిలతో చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా భేటీ కావడంపై న్యాయనిపుణులు ఇలా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే, దీనికి ఇప్పుడప్పుడే చుక్క పడే పరిస్థితి లేదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 12న నలుగురు జడ్జిలు బహిరంగంగా చీఫ్ జస్టిస్‌పై ఆరోపణలు గుప్పించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, ఇది టీ కప్పులో తుఫాను మాత్రమేనన్న అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్- సోమవారానికల్లా పరిస్థితి చక్కబడుతుందన్నారు. కానీ, పరిస్థితిలో మార్పేమీ లేకపోవడంతో... ''సంక్షోభం ఇంకా సమ సినట్టు లేదు. ఓ రెండు మూడు రోజుల్లో అంతా చక్కబడుతుందని ఆశిద్దాం'' అని వ్యాఖ్యానించడం గమనార్హం. సీజేతోగానీ, ఇతర జడ్జిలతోగానీ దీనిపై చర్చించారా? అన్న ప్రశ్నకు- అటువంటిదేమీ లేదని స్పష్టం చేశారు. మరోవైపు హడావుడిగా సప్తసభ్య బృందం ఏర్పాటు చేసి దౌత్య ప్రక్రియ ప్రారంభించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) కూడా 'కహానీ ఖతం'' (కథ ముగిసింది) అని పేర్కొంది. ఈ మేరకు సీజేఐ, 'ఆ నలుగురు'సహా పలువురు జడ్జిలతో తమ బృందం సమావేశమయ్యాక బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా ప్రకటించారు. ''అంతా చక్కబడింది... ఇక ఏ వివాదమూ లేదని నలుగురు జడ్జిలలో ఒకరైన రంజన్ గొగోయ్ చెప్పారు'' అని మిశ్రా మంగళవారం కూడా పేర్కొన్నారు. అటార్నీ జనరల్ భిన్న వాదన వినిపించడంపై ప్రశ్నిస్తే- ''ఆయన ఎందుకు... ఎలా ఆ మాటలన్నారో తెలియడం లేదు. జడ్జిలందరూ సోమవారం నుంచి తమ విధుల్లో నిమగ్నమయ్యారు. సుప్రీం కోర్టు కార్యకలాపాలు యథావిధిగా సాగిపోతున్నాయి'' అని మిశ్రా అన్నారు. ఈ అంశంపై ఇకమీదట ఎలాంటి బహిరంగ పరిణామం చోటుచేసుకోబోదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక ఈ వారాంతానికి పరిస్థితి ఓ కొలిక్కివస్తుందని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ మంగళవారం ప్రకటించారు.

కొత్త రాజ్యాంగ ధర్మాసనం

సుప్రీం కోర్టులో ముఖ్యమైన కేసుల విచారణ కోసం తన నేతృత్వంలో ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా ఏర్పాటు చేశారు. అయితే, ఇందులో అత్యంత సీనియర్లయిన 'ఆ నలుగురు' జస్టిస్‌లు చలమేశ్వర్, రంజన్ గొగోయ్, ఎం.బి.లోకూర్, కురియన్ జోసెఫ్‌లకు చోటు కల్పించకపోవడం గమనార్హం. అధికారిక సమాచారం మేరకు సీజేతోపాటు న్యాయమూర్తులు ఎ.కె.సిక్రీ, ఎ.ఎం.ఖన్విల్కర్, డి.వై.చంద్రచూడ్, అశోక్ భూషణ్‌లు ఇందులో సభ్యులుగా ఉన్నారు. అనేక కీలకమైన కేసులకు సంబంధించి ఈ ధర్మాసనం బుధవారం నుంచి విచారణ చేపట్టనుంది. ఆధార్ చట్టం, స్వలింగ సంపర్కంపై 2013నాటి తీర్పు, శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశం వంటి ప్రధాన కేసులు ఈ ధర్మాసనం విచారణ జాబితాలో ఉన్నాయి. కాగా, ముఖ్యమైన కేసులను సీజే తనకిష్టమైన జూనియర్లకు అప్పగిస్తున్నారని ఆరోపించిన నలుగురు సీనియర్లపై ఓ జూనియర్ జడ్జి విరుచుకుపడ్డారు. వివాదాలతో రాజకీయం చేసే నేతల చేతిలోకి న్యాయవ్యవస్థను నెట్టారంటూ వారిపై విమర్శలు చేశారు. న్యాయమూర్తులందరితో సమావేశం ఏర్పాటు చేయాలని ఆ నలుగురూ కోరి ఉండవచ్చునన్నారు.

సీజేపై ప్రశాంత్ భూషణ్ ఫిర్యాదు

న్యూఢిల్లీ, జనవరి 16: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజే) దీపక్ మిశ్రాపై సుప్రీం కోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లఖ్‌నవ్‌లోని ప్రసాద్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ మెడికల్ కాలేజీకి అనుమతి కుంభకోణంలో ఆయన ప్రమేయంపై అంతర్గత విచారణ చేపట్టాలని అందులో కోరారు. సీజేపై ఆరోపణలకు స్పష్టమైన ఆధారాలు లేకపోయినా ఆయన సచ్ఛీలత తేలడం కోసమైనా విచారణ అవసరమన్నారు. సర్వోన్నత న్యాయస్థానంలో సీజే తర్వాత రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తి నేతృత్వంలో ఈ ప్రక్రియ సాగాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ విషయాన్ని విలేకరులకు వివరిస్తూ- 'న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం-సంస్కరణలు' పేరిట నిర్వహిస్తున్న ఉద్యమ కన్వీనర్ హోదాలో ఈ ఫిర్యాదు దాఖలు చేశానని చెప్పారు. చీఫ్ జస్టిస్ స్థాయిలో అధికార దుర్వినియోగమైనట్లు చెప్పగల నిర్దిష్ట ఉదంతాలు చాలా ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ''ఇది అత్యంత తీవ్రమైన అంశం. ఆయన తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారు'' అని పేర్కొన్నారు.



'బొగ్గు' కేసు నత్తనడక

ఎన్నాళ్లిలా... సీబీఐ-ఈడీలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, జనవరి 16: బొగ్గు క్షేత్రాల కేటాయింపు కుంభకోణం కేసుల్లో సీబీఐ, ఈడీ దర్యాప్తు నత్తనడకన సాగడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నాళ్లిలా సాగదీస్తారంటూ నిలదీసింది. బొగ్గు క్షేత్రాల కేటాయింపు కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బొగ్గు శాఖ మాజీ సహాయ మంత్రి సంతోష్ బగ్రోడియా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు ఆగ్రహం ప్రకటించింది. అయితే, దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) స్పందిస్తూ- సీబీఐ మాజీ చీఫ్ రంజిత్ సిన్హాపై దర్యాప్తు విషయంలో తాము గణనీయ పురోగతి సాధించినట్టు తెలిపింది.

ఆశారాం బాపుపై నివేదికకు ఆదేశం..

ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపూపై అత్యాచార కేసులో విచారణ పురోగతిపై సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. దీనికి సంబంధించిన స్థాయీ నివేదికను అందజేయాలని గుజరాత్ ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆశారాం బాపు లోగడ దాఖలు చేసిన బెయిల్ విజ్ఞప్తులను సర్వోన్నత న్యాయస్థానం వరుసగా తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో తాజా బెయిల్ విజ్ఞప్తిపై విచారణ సందర్భంగా ఈ నెల 22లోగా స్థాయీ నివేదిక అందజేయాలని ఆదేశించింది.

సిగార్ బాక్స్ 26వేల డాలర్లు!

బోస్టన్, జనవరి 16: అది ఓ చెక్క సిగార్ బాక్స్, అందులో మొత్తం 24 సిగార్స్ సెట్ ఉంది, అమెరికాలో జరిగిన వేలం పాటలో దీన్ని 26,950 అమెరికన్ డాలర్లకు ఓ ఔత్సాహికుడు సొంతం చేసుకున్నాడు. క్యూబా విప్లవనేత ఫిడెల్ క్యాస్ట్రో వ్యక్తిగత కలెక్షన్‌కు చెందిన ఈ సిగార్ బాక్స్‌పై క్యాస్ట్రో సంతకం కూడా ఉంది. 1980లో సిగార్ల ఉత్పత్తి ప్రారంభించిన ట్రినిడాడ్ ఫండడోర్స్ అనే కంపెనీ కేవలం క్యాస్ట్రో కోసమే వాటిని తయారు చేసేది. ఆతరువాత 1998 నుంచి విదేశీ ప్రముఖులకు కానుకల రూపంలో ఇవి క్యూబా సరిహద్దులు దాటేవి. ఆర్‌ఆర్ ఆక్షన్ అనే సంస్థ దీన్ని వేలానికి పెట్టగా మంచి స్పందన వచ్చిందని, నిర్వాహకులు మురిసి పోతున్నారు.

మోదీ విప్లవ నాయకుడు

- **భారత్‌తో సంబంధాలు బలోపేతం**
- **ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రశంస**
- **వ్యవసాయం, శాస్త్ర, రక్షణ రంగాల్లో**
- **ఇరు దేశాలు పరస్పర సహకారం: మోదీ**
- **భారత, ఇజ్రాయెల్ మధ్య 9 ఒప్పందాలు**



న్యూఢిల్లీ, జనవరి 16:

భారత ప్రధాని నరేంద్ర మోదీ విప్లవ నాయకుడని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రశంసించారు. భారత్, ఇజ్రాయెల్ సంబంధాలను మోదీ బలోపేతం చేశారని, వ్యవసాయం, శాస్త్ర, రక్షణ రంగాల్లో పరస్పర సహకారానికి ముందడుగు వేశారని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో మోదీ, నెతన్యాహు సంయుక్తంగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌లో మోదీ విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని నెతన్యాహు అన్నారు. మోదీతో కలసి యోగాసానాలు చేసేందుకు ఆసక్తి చూపారు. ''ఓ ముఖ్యమైన ప్రకటన చేస్తున్నాను. నా స్నేహితుడు నరేంద్ర మోదీ ఎప్పుడైనా నాతో కలసి యోగా చేయాలని భావిస్తే.. అందుబాటులో ఉంటాను'' అని ఇజ్రాయెల్ ప్రధాని అన్నారు. ఈ సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. భారత్, ఇజ్రాయెల్ సంబంధాలను బలోపేతం చేయాలని.. వ్యవసాయం, శాస్త్ర, సాంకేతిక, రక్షణ రంగాల్లో పరస్పర సహకారానికి కృషి చేయాలని నెతన్యాహుకు మోదీ సూచించారు. భారత రక్షణ రంగంలో స్వేచ్ఛాయుత ఎఫ్‌డీఐలకు ఇజ్రాయెల్ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్టు మోదీ చెప్పారు. అంతకుముందు ఇద్దరు నేతలు సమావేశమై పలు అంశాలపై చర్చించుకున్నారు. ముఖ్యంగా రక్షణ, భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఇరు దేశాల మధ్య తొమ్మిది ఒప్పందాలు కుదిరాయి.

అనంతరం నెతన్యాహు బృందానికి మోదీ విందు ఇచ్చారు. ఆ తర్వాత ఇరు దేశాల నేతలు సంయుక్తంగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌కు ఆరు రోజుల పర్యటనకు వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని బృందంలో 130 మంది వ్యాపారవేత్తలు ఉన్నారు. వీరిలో రక్షణ రంగానికి చెందిన కంపెనీల ప్రతినిధులు ఉన్నారు.

రక్షణ సహకారంపై దోవల్ చర్చ

జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్.. ఇజ్రాయెల్ భద్రత సలహాదారు మీర్ బెన్-షబ్బత్‌తో సమావేశమయ్యారు. భద్రత, సీమాంతర ఉగ్రవాదం, రక్షణ సహకారంపై ఆయన చర్చించారు.


తాజ్ చెంత నెతన్యాహు దంపతులు

లఖ్‌నవ్, జనవరి 16:

భారత పర్యటనలో ఉన్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దంపతులు మంగళవారం ఆగ్రాలోని ప్రేమ సౌధం తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఢిల్లీ నుంచి ఆగ్రా చేరుకున్న నెతన్యాహు దంపతులకు ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. తాజ్‌మహల్ ముందున్న పాలరాతి బెంచ్‌పై నెతన్యాహు, ఆయన భార్య సారా ఫొటో తీయించుకున్నారు. కాగా, బుధవారం జరిగే ఓ కార్యక్రమంలో సముద్రపు నీటిని మంచినీరుగా మార్చే జీపును నెతన్యాహు ప్రధాని మోదీకి బహూకరించనున్నారు.

ముంబై చేరిన మోషే...

పదేళ్ల క్రితం ముంబైలో జరిగిన ఉగ్రదాడిలో తన తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి మోషే.. మంగళవారం ముంబైలో అడుగుపెట్టాడు. అతడితోపాటు తాత షిమోన్ రోసెన్‌బర్గ్ కూడా ముంబై వచ్చారు. గతంలో ఇజ్రాయెల్‌లో పర్యటన సందర్భంగా భారత్‌కు రావా లన్న తన కోర్కెను వెల్లడించగా- ఎప్పుడు కావాలంటే అప్పుడు రావచ్చునని, ప్రధాని మోదీ హామీ ఇచ్చిన విష యం తెలిసిందే. ఈ మేరకు తమ దేశ ప్రధాని నెతన్యాహుతోపాటు మోషే భారత్‌లో అడుగుపెట్టాడు. ముం బైలో 2008 నవంబరు 26నాటి పాక్ ఉగ్రవాదుల దాడి సందర్భంగా వారి తూటాలకు మోషే తల్లిదండ్రులు బలయ్యారు. నారీమన్ దగ్గర ఉన్న యూదు సెంటర్‌లో వారు మృత్యువాత పడినప్పుడు మోషే వయసు రెండేళ్లు. కాగా, 11 ఏళ్ల బాలుడుగా మోషే ముంబై రాక ఎంతో భావోద్వేగంతో కూడిన సున్నిత సందర్భమని యూదుల కేంద్రం చాబాద్ హౌజ్‌ను నడిపించే రబ్బి ఇజ్రాయెల్ కోజ్లోవ్‌స్కీ అన్నారు. మోషేను కలిసేందుకు ఎంతో ఉత్సుకతతో ఉన్నామని, అతను ఇప్పటికీ తమ హృదయాల్లో చిన్నారి బాలుడేనని తెలిపారు. ఇది ఒకప్పటి ముంబై కాదని, ఇప్పుడు ఎంతో సురక్షితంగా, భద్రంగా ఈ నగరం ఉందని, మోషేని కలువబోతుండటం ఎంతో ఆనందంగా ఉందని అతని తాత రబ్బి నాష్‌మన్ అన్నారు.





నన్ను చంపేందుకు కుట్ర

కొందరు నా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు

కేంద్రంపై తొగాడియా పరోక్ష వ్యాఖ్యలు

అహ్మదాబాద్, జనవరి 16: ''నన్ను పోలీసు ఎన్‌కౌంటర్‌లో చంపేసేందుకు కుట్ర జరుగుతోంది. పాత కేసులు తవ్వి నా గొంతు నొక్కాలని కొందరు ప్రయత్నిస్తున్నారు'' అని విశ్వ హిందూ పరిషత్ చీఫ్ ప్రవీణ్ తొగాడియా మీడియా ఎదుట కంటతడి పెట్టుకున్నారు. సోమవారం అదృశ్యమైన ఆయన మంగళవారం మీడియా ముందుకొచ్చారు. రామ మందిరం, గో వధ నిషేధంపై జాతీయ చట్టం, రైతులకు మద్దతు ధర వంటి అంశాలపై తాను మాట్లాడకుండా గొంతు నొక్కేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ కేంద్రంపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల నాటి పాత కేసులు బయటకు తీసి తనను ఇబ్బందిపెట్టాలని చూస్తున్నారని, పోలీసులతో ఎన్‌కౌంటర్ చేయించాలనుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం ఉదయం తాను పూజలో ఉండగా రాజస్థాన్ పోలీసులు తనను అరెస్టు చేసేందుకు వచ్చినట్లు తెలిసిందని, వారు ఎన్‌కౌంటర్ చేసి చంపేయాలని వచ్చారని తన సన్నిహితులు చెప్పారన్నారు. వెంటనే రాజస్థాన్ సీఎం వసుంధరా రాజే, హోం మంత్రికి ఫోన్ చేయగా.. పోలీసులు వచ్చినట్లు తెలియదని చెప్పారని, వారికి తెలియకుండా ఎవరి ఆదేశాలతో పోలీసులు వచ్చినట్లని ప్రశ్నించారు. దీంతో ఏదో కుట్ర జరుగుతోందని గ్రహించి తాను ఆటోలో అక్కడి నుంచి వారికి చిక్కకుండా వెళ్లిపోయానని చెప్పారు. రాజస్థాన్ వెళ్లి కోర్టులో లొంగిపోవాలనుకుని విమానాశ్రయానికి ప్రయాణమయ్యానని, మార్గ మధ్యంలో తలతిరిగినట్లుగా అనిపించడంతో ఆస్పత్రికి తీసుకుని పోవాలని డ్రైవర్‌కు చెప్పానని తొగాడియా వివరించారు. తన ఆరోగ్యం కుదుటపడగానే కోర్టులో లొంగిపోతానని తెలిపారు. తనపై ఎవరు కుట్రలు పన్నుతున్నారో సాక్ష్యాధారాలు, పేర్లతో త్వరలోనే వెల్లడిస్తానని చెప్పారు. కాగా ఆయన ఇక్కడి ఓ పార్క్‌లో అపస్మారక స్థితిలో ఉండగా.. గుర్తు తెలియని వ్యక్తులు పల్డి ఏరియాలోని చంద్రమణి ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలుస్తోంది. అయితే పాత కేసుకు సంబంధించి రాజస్థాన్ పోలీసులు ప్రవీణ్ తొగాడియాను (ఐపీసీ సెక్షన్ 188 కింద) అరెస్ట్ చేసేందుకు ఆయన ఇంటికి వెళ్లగా..ఆయన కనిపించలేదు. ఈ నేపథ్యంలో ప్రవీణ్ తొగాడియాను రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేశారంటూ వీహెచ్‌పీ కార్యకర్తలు సోమవారం ఆందోళనలకు దిగారు. అయితే తాము ఆయనను అరెస్టు చేయలేదని చెప్పడంతో వారు నిరసనలను ఉపసంహరించారు.

తొగాడియాకు హార్దిక్ పరామర్శ

వీహెచ్‌పీ అధినేత ప్రవీణ్ తొగాడియా ఆస్పత్రిలో ఉన్నారని తెలియగానే మంగళవారం ఉదయం పటేల్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్ వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా హార్దిక్ మాట్లాడుతూ.. తొగాడియా తనకు చాలా కాలం నుంచి తెలుసని, ఆయనతో సిద్ధాంత పరమైన విభేదాలు ఉన్నప్పటికీ.. సామాజిక, రైతుల సమస్యలపై ఆయన పోరాడుతున్నారని అన్నారు. ఆయన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని హార్దిక్ ఆకాంక్షించారు. గుజరాత్ కాంగ్రెస్ నేత అర్జున్ మొధ్వాడియా కూడా ఆయనను పరామర్శించారు. తొగాడియా చేసిన ఆరోపణలపై లోతుగా దర్యాప్తు చేపట్టాలని కాంగ్రెస్ నేత సంజయ్ నిరుపమ్ డిమాండ్ చేశారు. సిద్ధాంతపరంగా ఆయనతో తాము విభేదిస్తున్నామని, అయితే మానవతా దృక్పథంతో ఆయన పట్ల సానుభూతిని చూపుతున్నామని చెప్పారు. ప్రస్తుతం ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని, ఎన్‌కౌంటర్ చేసి తనను చంపాలనుకుంటున్నారని తొగాడియా చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలని అన్నారు.

పిటిషనర్లకు లోయా కేసు వివరాలు

'మహా' ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 16: సీబీఐ జడ్జి జస్టిస్ బీహెచ్ లోయా మృతికి సంబంధించిన అన్ని వివరాలను పిటిషనర్లకు అందజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. లోయా మృతి విషయంలో స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన రెండు పిటిషన్లను జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం లోయా పోస్ట్‌మార్టం నివేదికతో పాటు కేసుకు సంబంధించి అన్ని ఫైళ్లను సీల్డ్ కవర్‌లో ధర్మాసనం ముందుంచింది.

శంకుస్థాపనలతోనే సరి

కాంగ్రెస్ చేసిందదే: ప్రధాని మోదీ

పచ్‌పద్రా, జనవరి 16: కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టుల పేరుతో శంకుస్థాపనలు చేసి వదిలేసిందని, అంతకుమించి చేసిందేమీలేదని, ప్రజలను మభ్యపెట్టిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. రాజస్థాన్‌లోని బార్మర్‌లో 43 వేల కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టుకు మోదీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, కరువు చేతిలో చేయి వేసుకుని నడుస్తాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాజస్థాన్ కరువు కోరల్లో చిక్కుకుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట సంపాదించడం కోసం దేశవ్యాప్తంగా శంకుస్థాపనలు చేసి వదిలేసిందని, కేవలం ప్రకటనలతో ప్రజలను మోసం చేసిందని మోదీ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో బార్మర్ రిఫైనరీ ప్రాజెక్టు కనీసం కాగితంపై అయినా ఉందని, ఒకే ర్యాంకు-ఒకే పెన్షన్ (వోఆర్‌వోపీ) పథకం కాగితంపై కూడా లేదని విమర్శించారు. 12 వేల కోట్ల రూపాయల నిధులతో వోఆర్‌వోపీ పథకాన్ని అమలు చేశామని మోదీ పేర్కొన్నారు.

రూ. 126,68,71,700

డేరా అల్లర్లలో హరియాణా నష్టపోయిన మొత్తమిదీ

చండీగఢ్, జనవరి 16: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు శిక్ష పడిందని తెలియగానే హరియాణాలో తీవ్రస్థాయిలో హింస చెలరేగిన విషయం తెలిసిందే. ఆ అల్లర్ల కారణంగా రాష్ట్రం మొత్తమ్మీద కలిపి రూ. 126 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని తాజాగా తెలిసింది. గత సంవత్సరం ఆగస్టు 25వ తేదీన పంచకులలోని ప్రత్యేక సీబీఐ కోర్టు రామ్ రహీమ్ సింగ్‌ను దోషిగా తేల్చింది. ఆ సందర్భంగా చెలరేగిన హింసలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు జరిగిన నష్టం, వివిధ శాఖలు భద్రత కోసం వెచ్చించిన మొత్తం అంతా కలిసి ఇంత అయ్యిందని తుది నివేదికలో చెప్పారు. మొత్తం అన్ని జిల్లాల కన్నా అంబాలాలో అత్యధికంగా రూ. 46.84 కోట్ల నష్టం వాటిల్లింది. ఆ తర్వాత ఫతేబాద్‌లో రూ. 14.87 కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలిసింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకే అక్కడ అంత ఖర్చుపెట్టారు తప్ప.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు ఎలాంటి నష్టం ఆ జిల్లాలో వాటిల్లలేదు. ఇక డేరా ప్రధాన కార్యాలయం ఉన్న సిర్సా జిల్లాలో రూ. 13.57 కోట్ల నష్టం సంభవించింది. ఘర్షణలకు కేంద్రస్థానమైన పంచకుల ప్రాంతంలో అత్యధికంగా హింస చెలరేగింది. అక్కడ పోలీసు కాల్పులలో 36 మంది మరణించారు. ఆ ప్రాంతంలో సుమారు రూ. 10.57 కోట్ల నష్టం వాటిల్లినట్లు లెక్క తేల్చారు. హిసార్, ఝజ్జర్, రేవారి, నర్నౌల్, పల్వాల్, జింద్, యమునానగర్ లాంటి జిల్లాలపై మాత్రం అస్సలు ఎలాంటి ప్రభావం లేకపోవడం గమనార్హం. ఈ వివరాలను హరియాణా అడ్వకేట్ జనరల్ పంజాబ్, హరియాణా హైకోర్టుకు సమర్పించారు. ఈ కోర్టే హింసాత్మక ఘటనలకు సంబంధించిన కేసులను విచారిస్తోంది.

మనం మూవీ
manammovie
బుధవారం, 17 జనవరి 2018 హైదరాబాద్ 8

నాగార్జునతో ధనుష్



మల్టీస్టారర్స్ చేయడానికి అక్కినేని నాగార్జున ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. గతంలో ఇతర హీరోలతో కలిసి చాలా సినిమాలు చేశారు. ఇప్పుడు ధనుష్‌తో కలిసి ఓ సినిమా చేయబోతున్నారని సమాచారం. 'ఊపిరి' చిత్రంలో నాగార్జున పెర్‌ఫార్మెన్స్ చూసి ధనుష్ ఫిదా అయిపోయాడట. త్వరలోనే ధనుష్ నిర్మించే చిత్రంలో నాగార్జున ఓ కీలక పాత్రలో నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇటీవల ధనుష్ హైదరాబాద్ వచ్చినపుడు నాగార్జునను కలిసి తను నిర్మించే సినిమా గురించి తెలియజేశాడట. త్వరలోనే ఈ మల్టీస్టారర్‌కి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెలువడే అవకాశం ఉంది. నానితో కలిసి నాగార్జున ఓ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రామ్‌గోపాల్‌వర్మ కాంబినేషన్‌లో చేస్తున్న సినిమా షూటింగ్ బిజీలో ఉన్నారు నాగార్జున. ఈ చిత్రంలో మైరా సరీన్ హీరోయిన్‌గా నటిస్తోంది.



రంగస్థలం టీజర్ రెడీ!



• రామ్‌చరణ్

రామ్ చరణ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'రంగస్థలం'. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్(సి.వి.ఎం) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మార్చి 30న సినిమా విడుదలవుతుంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సుకుమార్ సినిమాను సరికొత్తగా తెరకెక్కిస్తుండటం.. గుబురు గడ్డం..గళ్ళ లుంగీ, తువాలుతో పక్కా మాస్ లుక్‌లో కనపడుతున్న రామ్ చరణ్, పల్లెటూరి అమ్మాయిగా సమంత లుక్స్.. అన్నీ సినిమా ఎలా ఉండబోతుందోననే ఆసక్తిని ప్రేక్షకుల్లో కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికరమైన లొకేషన్ ఫోటోలను రామ్‌చరణ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. దీన్ని రెట్టింపు చేయడానికి ఈ జనవరి 24.. సాయంత్రం 4 గంటల 15 నిమిషాలకు టీజర్‌ను విడుదల చేస్తున్నారు.


కండిషన్స్ అప్లయ్...



• నయనతార

సినిమాలే కాదు... శింబు, ప్రభుదేవా, ఆర్యలతో ప్రేమ వ్యవహారాలు నడపటం.. చివరకు బ్రేకప్‌లు చెప్పేసుకోవడంతో నయనతార వార్తల్లో వ్యక్తిగా నిలిచింది. అదంతా గతం. ఇప్పుడు ఈ కేరళ కుట్టి, దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో పీకల్లోతు ప్రేమలో ఉంది. గ్యాప్ ఉన్నప్పుడల్లా ఇద్దరూ కలిసి విహారయాత్రలకు కూడా వెళుతున్నారు. ఇలా నయనతార ఎన్ని చేసినా ఆమెకు డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. ఇప్పటికే సినిమా ప్రమోషన్స్ వైపు కన్నెత్తి చూడని నయనతార ఇప్పుడింకా ఎక్కువగా కండిషన్లు పెడుతోందట. అలా అయితేనే సినిమాలకు ఓకే చెప్తోందట. బికినీలు ధరించడంతో పాటు హీరోలతో సన్నిహితంగా ఉండే టచింగ్ సీన్లు కూడా చేయనని చెబుతోందట. ఈ కండిషన్ల ప్రకారమే బాలయ్య సరసన 'జై సింహా' సినిమా చేసిందట. నయనతార కండిషన్స్ చాంతాడంత ఉన్నా సినీ ఇండస్ట్రీలో ఆమెకు డిమాండ్ మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదు.

క్లాస్ అర్జున్



• నాని

యువ కథానాయకుడు నాని నటిస్తున్న చిత్రం 'కృష్ణార్జున యుద్ధం'. మేర్లపాక గాంధీ దర్శకుడు. సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మాతలు. ఏప్రిల్ 12న సినిమా రిలీజ్ కానుంది. ఇందులో నాని కృష్ణ, అర్జున అనే రెండు పాత్రల్లో కనపడతారు. ఇటీవల కృష్ణ లుక్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. పక్కా మాస్ లుక్‌తో కృష్ణ కనపడుతుంటే.. మరో క్యారెక్టర్ అర్జున మాత్రం క్లాస్‌గా కనపడబోతున్నాడు. దీనికి సంబంధించిన లుక్‌ను యూనిట్ రిలీజ్ చేసింది. లుక్ చూస్తుంటే అర్జున రాక్‌స్టార్‌గా దర్శనమీయనున్నాడని అర్థమవుతుంది. అనుపమ పరమేశ్వరన్, రుక్సర్ మీర్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

ప్రేక్షకులకు థాంక్స్

-సూర్య

సూర్య, కీర్తి సురేష్ జంటగా నటించిన చిత్రం 'గ్యాంగ్'. విఘ్నేశ్ శివన్ దర్శకుడు. ఈ చిత్రాన్ని యు.వి.క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ తెలుగులో విడుదల చేశారు. ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో హీరో సూర్య మాట్లాడుతూ ''గ్యాంగ్ సినిమాను తెలుగు, తమిళ ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. సంక్రాంతి సీజన్‌లో మా సినిమాను మంచి థియేటర్స్‌లో విడుదల చేసిన యు.వి.క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌లకు థాంక్స్. అలాగే డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ మాకు ఎంతో సపోర్ట్ చేశారు. విఘ్నేశ్ శివన్ నన్ను కొత్తగా చూపించారు. సింపుల్, కామన్ మేన్‌గా చూపించడంతో చాలా మంది ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యాను. చాలా రోజుల తర్వాత కనెక్టివిటీ ఉన్న క్యారెక్టర్ చేశాను. కేరళ, తమిళనాడులో ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. రమ్యకృష్ణ, ఆనందరాజ్, సెంథిల్ సహా అందరూ చక్కగా సహకారం అందించారు. అనిరుధ్ సంగీతానికి మంచి ఆదరణ లభించింది. నా కెరీర్‌లో చాలా ముఖ్యమైన సినిమా. నా లైఫ్‌లో చిన్నపాటి కొత్త చేంజ్‌ను తీసుకొచ్చిన సినిమా. నన్ను ఆదరించిన ప్రేక్షకులకు థాంక్స్. రాజమండ్రి, ఏలూరు, తదితర ప్రాంతాలకు వెళ్లి ప్రేక్షకులను థియేటర్స్‌లో కలవబోతున్నాను'' అని హీరో తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు విఘ్నేశ్ శివన్, రచయిత శశాంక్ వెన్నెలకంటి తదితరులు పాల్గొన్నారు.



ఫిబ్రవరి 16న 'రాజరథం'

నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'రాజరథం'. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు, సంగీత దర్శకుడు అనూప్ భండారి మాట్లాడుతూ ''రంగితరంగ' వంటి సూపర్‌హిట్ మూవీ తర్వాత నా దర్శకత్వంలో వస్తోన్న చిత్రం 'రాజరథం'. ఈ సినిమాకు దర్శకత్వంతో పాటు సంగీతం కూడా సమకూర్చాను. ఇందులో మొత్తం ఏడు పాటలు వున్నాయి. ఈ పాటలకు తప్పనిసరిగా లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌నే వాడాల్సి వుండంతో వాటితోనే పాటల్ని రికార్డ్ చెయ్యడం జరిగింది. రిథమ్స్‌ని ఇండియాలోనే బిగ్గెస్ట్ స్టూడియో అయిన యశ్‌రాజ్ స్టూడియోలో చేశాం. దాదాపు 60 మంది మ్యూజిషియన్స్‌తో పాటల్ని క్వాలిటీగా రికార్డ్ చేశాం. ఆడియోపరంగా, విజువల్‌గా పాటలు అందరికీ నచ్చుతాయి'' అన్నారు. నిర్మాతల్లో ఒకరైన అజయ్‌రెడ్డి గొల్లపల్లి మాట్లాడుతూ ''టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఈ చిత్రాన్ని నిర్మించడం జరిగింది. అనూప్ భండారి ఎక్స్‌ట్రార్డినరీ టేకింగ్‌తో, బ్యూటిఫుల్ మ్యూజిక్‌తో సినిమాని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఫిబ్రవరి 16న 'రాజరథం' చిత్రాన్ని చాలా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం'' అన్నారు.



దిశ మారుతుందా?

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించి కాసుల వర్షం కురిపించిన 'బాహుబలి' చాలా మంది దర్శకనిర్మాతలకు ఇన్‌స్పిరేషన్‌గా మారింది. కంటెంట్, పక్కా ప్లానింగ్ ఉంటే విజయాలు సాధించడం అసాధ్యమేమీ కాదన్న నమ్మకం ఏర్పడింది. దాంతో పలు భాషల్లో భారీ చిత్రాల జోరు పెరిగింది. ఆమధ్య తమిళ దర్శకుడు సుందర్ సి. రూపొందించ తలపెట్టిన 'సంఘమిత్ర' చిత్రాన్ని కూడా భారీ బడ్జెట్‌తో ప్లాన్ చేస్తున్నారు. ఏడాదిన్నర నుంచి ఈ చిత్రం స్క్రిప్ట్ దశలోనే ఉంది. హీరోయిన్‌ను ఎంపిక చేస్తున్నారు. పలు కారణాలతో సినిమా నుంచి తప్పుకుంటున్నారు. శ్రుతిహాసన్, హన్సిక ఇలాగే ఈ సినిమాకి గుడ్ బై చెప్పారు. శ్రుతిహాసన్ ఈ సినిమా కోసం లండన్ వెళ్ళి యుద్ధ విద్యలో శిక్షణ కూడా తీసుకుంది. షూటింగ్ ప్రారంభం కావడం లేదని కారణంతో సినిమాకి నో చెప్పేసింది. ఆ తర్వాత హన్సిక కూడా అదే పని చేసింది. ఇప్పుడు తాజాగా దిశా పటాని వార్తల్లో ఉంది. 'సంఘమిత్ర' చిత్రంలో దిశా పటాని హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. దిశ ఫైనల్ అవుతుందా లేక ఈమె కూడా ఏదో ఒక కారణంతో పక్కకు తప్పుకుంటుందా? అనే ప్రశ్న అందరిలోనూ మెదులుతోంది. ఈ సినిమా ఆగిపోయిందంటూ వస్తున్న వదంతులపై దర్శకుడు సుందర్ వివరణ ఇచ్చారు. స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని, గ్రాఫిక్ వర్క్ కూడా కొంత పూర్తి చేసిన తర్వాత షూటింగ్‌కి వెళ్లాలనుకుంటున్నట్టు చెప్పారు. ఈ చిత్రంలో జయం రవి, ఆర్య హీరోలుగా నటిస్తారు.



• దిశా పటాని

నెం.1 అందగాడు



• హృతిక్ రోషన్

హృతిక్ రోషన్ నెంబర్ వన్ అందగాడు అనిపించుకున్నాడు. వరల్డ్ టాప్ టెన్ హ్యాండ్సమ్ హీరోల జాబితాలో రాబర్ట్ ప్యాటిన్సన్, క్రిస్ ఇవాన్స్‌లను వెనక్కి నెట్టి మొదటి స్థానాన్ని అధిష్టించాడు హృతిక్. ఇప్పటికే ఏషియన్ సెక్సీయస్ట్ మ్యాన్, మ్యాన్ ఆఫ్ ది ప్లానెట్ టైటిల్స్‌ని కూడా దక్కించుకున్న హృతిక్ ఇప్పుడు అందంలో కూడా తనే నెంబర్ వన్ అని నిరూపించుకున్నాడు. సల్మాన్ ఖాన్ ఐదో స్థానంతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. వరల్డ్స్ టాప్ మోస్ట్ అనే వెబ్‌సైట్ ఈ వివరాలను ప్రకటించింది. ప్రపంచంలోని టాప్ టెన్ హ్యాండ్సమ్ హీరోలు ఎవరంటే.. 1. హృతిక్ రోషన్, 2. రాబర్ట్ ప్యాటిన్సన్, 3. గాడ్‌ఫ్రే గావో, 4. క్రిస్ ఇవాన్స్, 5. సల్మాన్ ఖాన్, 6. డేవిడ్ బోరియానాజ్, 7. నోవా మిల్స్, 8. హెన్రీ కవిల్, 9. టామ్ హిడిల్‌స్టన్, 10. సామ్ హ్యాగన్. ప్రస్తుతం 'సూపర్ 30' చిత్రంలో నటిస్తున్నారు హృతిక్. ప్రముఖ గణిత శాస్త్రవేత్త ఆనంద్ కుమార్ జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మరోపక్క 'క్రిష్ 4' చిత్రంతోనూ హృతిక్ బిజీగా ఉన్నారు. 2020 క్రిస్మస్‌కు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

వైఫ్ ఆఫ్ రామ్

మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో విజయ్ యెలకంటి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం టైటిల్‌ను మంగళవారం ప్రకటించారు. 'వైఫ్ ఆఫ్ రామ్' అనే డిఫరెంట్ టైటిల్‌తో వస్తున్న ఈ సినిమా కాన్సెప్ట్ కూడా చాలా డిఫరెంట్‌గా ఉంటుందని యూనిట్ సభ్యులు చెప్పన్నారు. ఈ చిత్రంలో మంచు లక్ష్మి క్యారెక్టర్ కూడా విభిన్నంగానే ఉంటుందట. అబద్ధాలను నిజమని నమ్మే క్యారెక్టర్‌లో ఆమె నటిస్తోంది. మానవ సంబంధాలు, భావోద్వేగాల చుట్టూ తిరిగే ఓ కొత్త తరహా కథతో ఈ చిత్రం రూపొందుతోంది. ఈగ, బాహుబలి చిత్రాలకు దర్శకత్వ శాఖలో అసిస్టెంట్‌గా పనిచేసిన విజయ్ ఈ చిత్రం ద్వారా దర్శకుడుగా పరిచయమవుతున్నారు. కృతి ప్రసాద్, విద్యా నిర్వాణ మంచు, ఆనంద్ సమర్పిస్తోన్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సామ్రాట్ రెడ్డి, ఆదర్శ్ బాలకృష్ణ, ప్రియదర్శి, శ్రీకాంత్ అయ్యర్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.



• లక్ష్మీ విజయ్






సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఓ వైపు కోడి పందేలు, మరో వైపు జల్లికట్టు ప్రదర్శనలు నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో కోట్లాది రూపాయల్లో కోడి పందేలు జరిగాయి. ఇక చిత్తూరు జిల్లాలో సంప్రదాయ జల్లికట్టు నిర్వహించారు.

ఏపీకి ప్రత్యేక గవర్నర్‌ను నియమించండి

- హైకోర్టు ఏర్పాటు చేయండి
- కేంద్రానికి ఎంపీ హరిబాబు లేఖ



విశాఖపట్నం, జనవరి 16: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గవర్నర్‌ను నియమించాలని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, విశాఖ ఎంపీ హరిబాబు కేంద్రాన్ని కోరారు. కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆయన ఈ మేరకు లేఖ రాశారు. నవ్యాంధ్రకు కొత్త గవర్నర్‌ను నియమించాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. హైకోర్టు కోసం ప్రభుత్వం భవనాలను అన్వేషిస్తోందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, మనోభావాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు ఏర్పాటుకు వెంటనే చొరవ తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నర్‌గా నరసింహన్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అలాగే ఏపీ, తెలంగాణలకు ఉమ్మడి హైకోర్టు ఉంది. కాగా గవర్నర్ నరసింహన్ ఆంధ్రప్రదేశ్‌పై సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారంటూ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఇటీవల విమర్శించారు. ఇప్పుడు అదే పార్టీకి చెందిన ఎంపీ హరిబాబు ఈ విషయంపై కేంద్ర హోం మంత్రికి లేఖ రాయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

కృష్ణా నదిలో పడవ బోల్తా

- 20 మందిని కాపాడిన స్థానికులు.. తప్పిన పెను ప్రమాదం

విజయవాడ, జనవరి 16: కృష్ణా నదిలో ప్రయాణికులతో వెళ్తున్న పడవ బోల్తా పడింది. స్థానికులు ప్రయాణికులను కాపాడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. పడవలో ఉన్న 20 మందిని స్థానికులు కాపాడారు. సోమవారం సాయంత్రం కృష్ణా జిల్లా ఎదురుమొండి దీవుల నుంచి ప్రయాణికులను తీసుకుని పడవ వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. కాగా, పడవలో రేవు దాటించేందుకు ఎక్కించిన 4 బైకులు, ఇతర సామగ్రి నీటిపాలయ్యాయి. దీవుల వద్ద నిత్యం ప్రయాణికులను దాటించే పంట్‌ను పడవ పోటీల కోసం నాగాయలంకకు అధికారులు తరలించారు. దీంతో నాలుగు పంచాయతీల ప్రజలు గత్యంతరం లేక నాటు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. పడవలో సామర్థ్యానికి మించి ప్రయాణించడం వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. గత నవంబరులో కృష్ణా నదిలో అనుమతి లేని పడవ బోల్తాపడి 22 మంది పర్యాటకులు మృతి చెందిన సంగతి తెలిసిందే. అయినా అధికారులు తగిన భద్రత చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

18న దుర్గమ్మ దర్శనానికి 'మహా' గవర్నర్

విజయవాడ, జనవరి 16,(మనం న్యూస్ ప్రతినిధి): ఇంద్రకీలాద్రిపై వెలసిన కనక దుర్గమ్మను సేవించేందుకు మహారాష్ట్ర గవర్నర్, చెన్నమనేని విద్యాసాగర్ రావు విజయవాడ రానున్నారు. ఈ నెల 18వ తేదీన విద్యాసాగర్ రావు ఇక్కడికి విచ్చేస్తున్నట్టు, ఆలయ పీఆర్‌ఓ అచ్యుతరామయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు గవర్నర్ విద్యాసాగరరావు ఆలయానికి రానున్నట్టు, ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రేపు ఐటీఏ అధ్యక్ష ఎన్నిక

అమరావతి, జనవరి 16 (మనం ప్రతినిధి): ఇండియన్ టుబాకో అసోసియేషన్ (ఐటీఏ) అధ్యక్ష, కార్యవర్గ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. 2018-20 కాలపరిమితికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. గుంటూరు కేంద్రంగా 8 దశాబ్దాల నుంచి ఇండియన్ టుబాకో అసోసియేషన్ పని చేస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు మిట్టపల్లి ఉమామహేశ్వరరావు నాలుగేళ్ల పదవీకాలం పూర్తి అయింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఐటీఏలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు.

విశాఖ సాగర పర్యాటకానికి
అంతర్జాతీయ అవార్డు

- బెర్లిన్‌లో అవార్డుల ప్రదానోత్సవం
- మన పనితీరుకు అవార్డులే గీటు రాయన్న మీనా

అమరావతి, జనవరి 16(మనం ప్రతినిధి): విశాఖపట్నం నగర మకుటంలో మరో కలికితురాయి చేరింది. సాగరతీర పర్యాటకంలో 'ఉత్తమ ఆగమన కేంద్రం' విభాగంలో అంతర్జాతీయ అవార్డును ఆంధ్రప్రదేశ్ దక్కించుకుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. మార్చి 9న బెర్లిన్ వేదికగా జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో ఈ అవార్డు అందుకోనున్నట్టు ఆయన తెలిపారు. ఉద్యోగుల పనితీరుకు అవార్డులే గీటురాయన్న మీనా.. రాష్ట్ర విభజనతో ఎదురైన ఇబ్బందులను సైతం అధిగమించి సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు దీన్ని గుర్తించటం ముదావహమన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ, రాష్ట్ర పర్యాటక అథారిటీ అధికారులు, సిబ్బందికి మీనా అభినందనలు తెలిపారు.

పండుగపూటే ఆఖరి రోజు

- నీటికుంటలో పడి ఇద్దరు విద్యార్థుల మృతి

డోన్, జనవరి 16, మనంన్యూస్: సంక్రాంతి పండుగ సంబరాల్లో మునిగిపోయిన గ్రామంలో, ఇద్దరు విద్యార్థుల మృతి వార్త విషాదం నింపింది. కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం, జలదుర్గానికి చెందిన మదన శేఖర్ కుమారుడు మాల మనోజ్ కుమార్(10), డోన్ పట్టణానికి చెందిన జాన్ కుమారుడు ఎద్దుల మనోహర్ (10)లు డోన్ మండలం, ఎర్రగుంట్లకు పండుగ జరుపుకునేందుకు వచ్చారు. బహిర్భూమికి ఊరి బయట ఉన్న నీటికుంట దగ్గరకు వెళ్లి కుంటలోకి దిగారు. ఒక పిల్లాడు ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డాడు. కాపాడేందుకు మరో పిల్లాడు నీళ్లలోకి దూకాడు. ఇద్దరికి ఈత రాకపోవడంతో కానరాని లోకాలకు వెళ్లిపోయారు. పిల్లలు ఎంతకూ తిరిగిరాకపోవడంతో.. కుటుంబ సభ్యులు ఊరంతా వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పిల్లలు చివరిసారిగా వెళ్లిన నీటికుంటలో నీటిని తోడేయంతో విగతజీవులుగా బయటపడ్డారు. పండుగ కోసం వచ్చిన తమ మనువలు మృత్యువాత పడడంతో మనోజ్, మనోహర్ అవ్వ తాతల రోదనలు అందరిని కన్నీరు పెట్టించాయి.

నువ్వా.. నేనా?

ఏడాదికి ముందే మొదలైన ఎన్నికల వేడి.. సీటు కోసం ఎస్వీ.. టీజీ భరత్ పోటాపోటీ



- మిగిలిన నియోజకవర్గాలలో అదే పరిస్థితి
- చాన్సు నాదంటే.. నాదంటున్న నేతలు
- తలలు పట్టుకుంటున్న టీడీపీ పెద్దలు
- ఎన్నికల నాటికి మరిన్ని తలనొప్పులు

కర్నూలు, జనవరి 16 (మనం న్యూస్‌బ్యూరో): రాయలసీమ రాజకీయాలు అప్పుడే వేడెక్కుతున్నాయి. టికెట్ల కోసం పలు నియోజకవర్గాల్లో నాయకులు పోటీ పడుతున్నారు. వైఎస్‌ఆర్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన నేతలకు తోడు.. ఎప్పటినుంచో పార్టీలో ఉన్నవారు కూడా పోటీ చేసేందుకు అవకాశం తమకు ఇవ్వాలంటే తమకు ఇవ్వాలని డిమాండ్లు మొదలుపెట్టారు. ఎన్నికలకు ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నా.. ఇప్పటి నుంచే సిగపట్లు మొదలయ్యాయి.

కర్నూలు అసెంబ్లీ టిక్కెట్ కోసం అధికార పార్టీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ కుమారుడు టీజీ భరత్ తీవ్రంగా పోటీ పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీ టిక్కెట్ తనకే వస్తుందని ఇటీవల జరిగిన జన్మభూమి సభల్లో భరత్ ప్రకటించారు. దీంతో వివాదం మొదలైంది. సీటు ఎవరికి ఇవ్వాలో చంద్రబాబుకు తెలుసుని, ఆయన గొప్ప పరిపాలన దక్షత కలిగిన వ్యక్తి అని, సర్వేల ఆధారంగా టిక్కెట్ కేటాయిస్తారని.. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఒక సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి దుమారం రేపారు. అమెరికాలో అధ్యక్ష పదవికి పోటీపడే అభ్యర్థుల కోసం ముందుగా పార్టీలో ఎన్నికలు జరుగుతాయని, అక్కడ ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే... వారు ఆయా పార్టీల నుంచి పోటీ చేస్తారని, ఇదే తరహా విధానాన్ని ఏపీలో కూడా తీసుకొస్తే అన్ని సీట్లలో ఘన విజయం సాధించవచ్చని సూచించారు.

సీటు ఎవరికి... పోటు ఎవరికి?

గత ఎన్నికల్లో ఎస్వీ మోహన్ రెడ్డి వైసీపీ తరపున కర్నూలు నుంచి పోటీచేసి టీడీపీ అభ్యర్థి టీజీ వెంకటేశ్‌పై గెలిచారు. తర్వాత ఆయన టీడీపీలో చేరారు. దీంతో అధికార పార్టీలో నాయకత్వ పోరు మొదలైంది. ఈ నియోజకవర్గంపై పట్టు సడలకుండా చూసుకోవాలని ఈ నేతలిద్దరూ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే సిట్టింగ్ ఎమ్మెల్యే నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎస్వీకి దీటుగా టీజీ కూడా అడుగులు వేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తన రాజకీయ వారసుడిగా.. తన కుమారుడైన టీజీ భరత్‌ను రంగంలోకి దింపాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. భరత్ కూడా టీజీబీ యూత్ ఏర్పాటు చేసి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి డివిజన్‌లో టీజీబీ యూత్ కార్యాలయాలు స్థాపించి నియోజకవర్గంపై పట్టు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇద్దరి మధ్య పోటీలో సీటు ఎవరికి దక్కుతుందో.. పోటు ఎవరికి పడుతుందో అన్నది ఆసక్తికరంగా మారుతుంది.



నోటిఫికేషన్ వెలువడితే మరిన్ని ఫైట్లు ?

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే అధికార టీడీపీలో మరిన్ని ఫైట్లు తప్పవని పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లాలో పార్టీ బలోపేతం కోసం చంద్రబాబు ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీశారు. దీంతో పలు నియోజకవర్గాల్లో బహుముఖ నాయకత్వ సమస్య ఏర్పడింది. కోడుమూరు నియోజకవర్గంలోనూ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే మణిగాంధీ, నియోజకవర్గ ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులు పోటీ పడుతున్నారు. ఆలూరులో వీరభద్రగౌడ్, వైకుంఠం టిక్కెట్ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఇంకా పలు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే.. టిక్కెట్ ఆశించే వారి సంఖ్య బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

బాబు పాలనలో ప్రజల జేబుకు చిల్లు

- రైతు సంతోషం ఆయనకు నచ్చదు
- ప్రజా సంకల్పయాత్రలో జగన్



నగరి, జనవరి 16: చంద్రబాబు పాలనలో ప్రజలకు చిల్లు పడడం తప్ప.. ఏ ఒక్కరికీ మంచి జరగలేదని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా దారుణమైన పాలన సాగుతోందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో అన్ని ధరలు సామాన్యుడికి అందనంత స్థాయి చేరాయన్నారు. ఏ ఒక్క సామాజిక వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఏ ఒక్క పేదవాడు విద్య, వైద్యం కోసం అప్పుల పాలయ్యే పరిస్థితి రాకుండా చూస్తానని భరోసా ఇస్తున్నానన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 63వ రోజు నగరి నియోజకవర్గంలోని వడమాలపేట గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ ప్రసంగించారు. రైతులు సంతోషంగా ఉండడం చంద్రబాబుకు నచ్చదని, చెరకు రైతులకు మేలు చేసే సహకార ఫ్యాక్టరీలను ఆయన ప్రభుత్వం వచ్చాక మూసేశారని అన్నారు. చిత్తూరు జిల్లాలో సహకార రంగంలో ఆరు షుగర్ ఫ్యాక్టరీ ఉండగా.. గతంలో 9 ఏళ్లు బాబు సీఎంగా ఉన్నప్పుడు నగరి నియోజకవర్గంలోని ఈ రెండు చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. రైతులకు మంచి ధరలు లేక అవస్థలు పడ్డారని, ఈ పరిస్థితిని చూసి దివంగత సీఎం వైఎస్‌ఆర్ ఆ చక్కెర ఫ్యాక్టరీల బకాయిలు చెల్లించి, వాటిని తెరిపించారని చెప్పారు. పదేళ్ల పాటు రైతులు సంతోషంగా ఉన్న రైతులకు మళ్లీ చంద్రబాబు సీఎం కావడతో కష్టాలు మొదలయ్యాయని జగన్ ఆరోపించారు. మళ్లీ నగరిలోని రెండు చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయని, ప్రైవేట్ ఫ్యాక్టరీలు మాత్రం లాభాలతో నడవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. చిత్తూరు డెయిరీ పరిస్థితి కూడా అంతేనని, సహకార రంగంలోని డెయిరీలు రైతులకు మంచి రేట్లు ఇస్తుంటే చంద్రబాబే దగ్గరుండి మరీ చిత్తూరు డెయిరీని మూసేయించారని జగన్ మండిపడ్డారు. రైతులు చిత్తూరు డెయిరీకి పాలు పోస్తే మూడు, నాలుగు నెలల పాటు చెల్లింపులు నిలిపేసి, తన హెరిటేజ్ డెయిరీ పాలు పోసేలా చేసుకున్నారన్నారు. లీటరు నీళ్ల బాటిల్ రూ.20 అమ్ముతుంటే... అదే బాటిల్ పాలు రూ.22కు మించడంలేదని, ఇలా అయితే రైతులు ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు.



మట్కా రాకెట్ గుట్టు రట్టు

- అనంతపురం జిల్లాలో 15 మంది అరెస్టు
- రూ.30 లక్షలు నగదు.. మట్కా చీటీలు స్వాధీనం

అనంతపురం, జనవరి 16 (మనం న్యూస్ బ్యూరో): అనంతపురంలో మట్కా రాకెట్ గుట్టును పోలీసులు రట్టు చేశారు. డబ్బు ఆశచూపి అమాయక ప్రజలను మోసగిస్తూ మాట్కా జూదం నిర్వహిస్తున్న నలుగురితో పాటు మరో 11 మంది బీటర్లను అరెస్టు చేశారు. మోసపూరిత మాటలతో ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా సామాన్యులను మట్కా బరిలోకి లాగుతున్నట్లు అనంతపురం పట్టణం పోలీసులకు పక్కా సమాచారం అందింది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో సీఐ కృష్ణమోహన్, ఎస్ఐలు హమీద్ ఖాన్, మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాసులు వారి సిబ్బందితో కలిసి పట్టణంలో గల అశోక్‌నగర్‌లోని కొత్తపల్లి మస్తాన్ ఇంటిపై మంగళవారం ఉదయం దాడి చేశారు. మట్కా నిర్వాహకుడు అనిల్‌కుమార్, బీటర్లు మనోహర్, షెక్షావలి, శ్రీనివాసులు, గోపీనాథరెడ్డి, షాజహాన్, కళావతి, మస్తాన్‌లను అరెస్టు చేశారు. మట్కా చీటీలను, రూ.15,91,580 నగదును స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వారి నుంచి రాబట్టిన సమాచారంతో మధ్యాహ్నం 2 గంటల సమయంలో అనంతపురం నగరంలోని పిల్లిగుండ్ల కాలనీలోని మంగళ చంద్ర ఇంటి వద్ద చంద్రతోపాటు నిర్వాహకులు కరీముల్లా, లక్ష్మిరెడ్డి, గొల్ల రమేష్, బీటర్లు గొల్ల రమణ, షేక్ మహ్మద్ రఫి, బోయ అక్కులప్పతోపాటు మరికొందరిని అరెస్టు చేశారు. అలాగే మట్కా చీటీలు, రూ.14,08,670 నగదు, కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని హుబ్లీ, మహారాష్ట్ర రాజధాని ముంబైల్లోని మట్కా నెట్‌వర్క్‌లతో వారికి సంబంధాలు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కాగా, మట్కా నిర్వాహకులతోపాటు బీటర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.30 లక్షలు స్వాధీనం చేసినందుకు గాను సీఐ కృష్ణమోహన్, ఎస్ఐలు హమీద్‌ఖాన్, మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ప్రశంసించారు.

టీ-20లా కోడి పందేలు

- జూదంగా మార్చిన టీడీపీ నేతలు
- అక్రమ సంపాదన కోసమే: అంబటి



విజయవాడ, జనవరి 16 (మనం న్యూస్): టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజల బలహీనతనలను ఆసరాగా తీసుకుని కోడిపందేల పేరుతో జూదశాలలను తెరిచి, వాటిని కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారని వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. మంగళవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీ-20 క్రికెట్ మ్యాచ్ మాదిరిగా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారని ఆరోపించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గులు, ఎడ్ల పందేలు, కోడి పందేలు సంప్రదాయంగా నిర్వహించేవారని తెలిపారు. ఇప్పుడు కోడి పందేల మాటున జూదం విచ్చలవిడిగా సాగుతోందన్నారు. పందేలను అడ్డుకొనేందుకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా, టీడీపీ నేతలు వాటిని జూదశాలలుగా మార్చేశారని విమర్శించారు. వారి పేర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, క్రికెట్ పిచ్‌లు మాదిరిగా బరులు తయారు చేశారని మండిపడ్డారు. జూద క్రీడలు, పేకాట, గుండాట, మద్యం షాపులు బిర్యానీ పాయింట్లు ఏర్పాటు చేసి, వేలం ద్వారా కోట్లాది రూపాయలకు విక్రయించారని ఆరోపించారు.

'కనుమ' కుమ్ముడు!

- సంక్రాంతికి ఫుల్‌గా లాగించేశారు
- 30 లక్షల కిలోల మాంసం విక్రయం
- 124 కోట్ల రూపాయల మద్యం
- మద్యం అమ్మకాల్లో 'తూ.గో' టాప్

అమరావతి, జనవరి 16(మనం ప్రతినిధి): సంక్రాంతి పండుగ మూడు రోజుల్లో, మాంసాహారం కోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఖర్చు చేశారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగను మాంసం ప్రియులు, మందుబాబులు మజా చేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ముప్పై లక్షల కిలోల మాంసాన్ని అంటే.. దాదాపు రూ. 90 కోట్ల మాంసాన్ని చక్కగా చప్పరించేశారు. తెలుగు పండగల్లో అతి పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజుల పండుగను మిగిలిన పండుగల కన్నా ప్రత్యేకంగా జరపుకోవాలని తెలుగువారు మూడు నెలలు ముందుగానే ప్లాన్ చేసుకుంటారు. మూడో రోజైన కనుమ పండుగనాడు ముక్క పడనిదే సంక్రాంతి పండుగ పరిపూర్ణం కాదు. ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా మాంసం విక్రయాలు జోరందుకున్నాయి. వేకువజామున నాలుగు గంటల నుంచే మాంసం కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్ద ప్రజలు క్యూ కట్టారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో కోళ్లు, గొర్రెల తలలు తెగిపడ్డాయి. ఓవైపు చికెన్, మటన్ ధరలు అమాంతంగా పెరిగినా... రాష్ట్ర ప్రజలు ఏమాత్రం జంకలేదు. భోగి, సంక్రాంతి నాడు కొన్ని జిల్లాల వారే మాంసాహారం తీసుకుంటారు. కనుమ రోజు దాదాపు అందరూ మాంసాన్ని ఆరగించారు.

పోటీ పడ్డ గోదావరి జిల్లాలు

రాష్ట్ర వ్యాప్తంగా పండగ మూడు రోజుల్లో ఏకంగా రూ. 124 కోట్ల మద్యాన్ని మందుబాబులు ఎంజాయ్ చేశారు. దీనిలో 2,52,605 కేసుల మద్యం ఉండగా, 1,36,704 బీరు కేసులను తాగేశారు. మద్యం అమ్మకాల్లో ఉభయగోదావరి జిల్లాలు నువ్వా, నేనా అన్నట్లు పోటీ పడ్డాయి. తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజుల్లో రూ. 14.92 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ. 13.29 కోట్ల మద్యం విక్రయించినట్లుగా అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. సాధారణంగా రాష్ట్రంలో విశాఖ, గుంటూరు జిల్లాల్లో మద్యం విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. సంక్రాంతి పండుగకు అన్ని జిల్లాలతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి కోడి పందేలు చూసేందుకు ఉభయగోదావరి జిల్లాలకు వెళ్లారు. ఈ మూడు రోజులు అక్కడే ఉండి మందుతో పాటు ఎంచక్కా ముక్కను నంజేశారు. అందుకే ఈ రెండు జిల్లాల్లో మద్యం విక్రయాలు పెగగగరిగాయి.

మందుబాబుల ముందు జాగ్రత్త

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో మందుబాబులు పండుగకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. తమ బంధువులు, మిత్రులతో పండుగను ఎంజాయ్ చేసేందుకు మూడు రోజుల ముందుగానే మందును ఇంట్లో భారీగా స్టాక్ తెచ్చుకుని పెట్టుకున్నారు. ఈ సారి పల్లెటూర్లలో కూడా విదేశీ మద్యానికి డిమాండ్ ఎక్కువైంది.

మటన్‌కు పెరిగిన డిమాండ్



ఈ ఏడాది మార్కెట్‌లో మటన్‌కు డిమాండ్ బాగా పెరిగింది. వ్యాపారులు దీన్ని అదునుగా చేసుకుని.. అమాంతంగా కిలోకు వంద రూపాయలు పెంచేశారు. పది రోజుల క్రితం రూ. 480 ఉన్న మటన్, కనుమ రోజు రూ. 600లకు పెంచి అమ్మారు. చికెన్ ధరలు పండుగ రోజుల్లో అమాంతం పెరిగాయి. భోగికి ముందు వారం రోజుల నుంచి మాంసం ధరలు చుక్కలను అంటాయి. అయినా సంక్రాంతి ప్రధాన పండుగ కావడంతో మాంసం కొనుగోళ్ల విషయంలో ఏ మాత్రం ప్రజలు వెనక్కి తగ్గలేదు. పండగకు మాంసం, మద్యం వినియోగం రెట్టింపు స్థాయిలో పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల కిలోల మాంసం విక్రయించినట్లు అనధికార సమాచారం. దీనిలో సుమారు 20 లక్షల కిలోల చికెన్, 10 లక్షల కిలోల మటన్ విక్రయాలు జరిగినట్లు అంచనా వేశారు. కనుమ కోసమని పౌల్ట్రీ వ్యాపారులు డిమాండ్‌కు తగ్గట్లు కోళ్లను సిద్ధం చేశారు. కిలో చికెన్ ధర స్కిన్ రూ. 160, స్కిన్‌లెస్ రూ. 180ల వంతున అమ్మకాలు సాగించారు.

భిన్నత్వానికి పెద్ద పీట

పనిచేస్తున్నవారిలో నలుగురూ నాలుగు రకాల వారుంటే సంస్థకు మేలు అంటున్న సర్వే


ముంబయి: రిక్రూటింగ్ పరిశ్రమలో ఈ ఏడాది భిన్నత్వం ఉన్నత ధోరణి కానుంది. భారత్‌లో 81 శాతం మంది లీడర్లు తమ నియామకాల ప్రక్రియలో భిన్నత్వం ప్రభావం చూపుతుందని చెప్పారని ఒక సర్వే వెల్లడించింది. ఉద్యోగార్థులు ఉద్యోగాన్ని కనుగొనడం, నియమితులు కావడం, పనిలో నిమగ్నమవడంలో 2018లో ప్రస్ఫుటం కాగల నాలుగు ఉన్నత ధోరణులలో భిన్నత్వం ఒకటని లింక్డ్ ఇన్ 'గ్లోబల్ రిక్రూటింగ్ ట్రెండ్స్' సర్వే తెలియజేసింది. మిగిలిన ముఖ్య ధోరణులలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ), డాడా-నిశిత పరిశీలనలు, నవీన-యుగ ఇంటర్వ్యూ ప్రక్రియలు ఉన్నాయి.

భిన్నత్వానికి ప్రాధాన్యం

అభ్యర్థులను ఉద్యోగాలలోకి తీసుకునేటప్పుడు వారిలోని భిన్నత్వం ప్రభావం చూపుతుందని ప్రపంచ వ్యాప్తంగా 78 శాతం మంది టాలెంట్ లీడర్లు, ఇండియాలో 81 శాతం మంది చెప్పారు. భిన్నత్వం ఉత్పాదకతను పెంచి, నవకల్పనలను ప్రోత్సహిస్తుందని కంపెనీలు భిన్నత్వానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆ సర్వేలో వెల్లడైంది. భిన్నత్వంలో జెండర్ (71 శాతం), జాతి (49 శాతం), వయసు (48 శాతం)పైన కూడా కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. లింక్డ్‌ఇన్ సంస్థ సర్వేలో 39 దేశాలకు చెందిన సుమారు 9000 మంది రిక్రూటర్లు, హైరింగ్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలలో కొత్త పద్ధతులు

నాల్గవ ముఖ్య ధోరణి ఇంటర్వ్యూ చేయడంలో కొత్త పద్ధతులు, స్మార్ట్ మోడళ్ళతో సంప్రదాయబద్ధమైనదానిని మిళితం చేయడం ద్వారా ఇంటర్వ్యూ తీరుతెన్నులనే పునరావిష్కరిస్తున్నారు. భవిష్యత్తులో అభ్యర్థులను ఉద్యోగాలలోకి తీసుకోవడంలో కొత్త పద్ధతులలో ఇంటర్వ్యూలు నిర్వహించడం అత్యంత ముఖ్యమైన అంశం కాబోతోందని భావిస్తున్నవారి ప్రపంచ సగటు 56 శాతం కాగా, భారతదేశంలో అలా చెప్పినవారు అంతకన్నా ఎక్కువగా 61 శాతంగా ఉన్నారు. సంప్రదాయ ఇంటర్వ్యూ తీరుతెన్నులను, వాటి ప్రాచుర్యాన్ని, ప్రభావశీలతను కొన్ని కంపెనీలు ఇప్పటికీ విశ్వసిస్తున్నాయని కూడా సర్వే వెల్లడించింది. వ్యవస్థీకృత ఇంటర్వ్యూలకు (88 శాతం), నడతను అంచనా వేసే ఇంటర్వ్యూలకు (89 శాతం) గరిష్ఠ ప్రాధాన్యం ఇస్తున్నారు. సంప్రదాయసిద్ధంగా ఇంటర్వ్యూలు నిర్వహించడంలో అత్యంత ఎక్కువగా కనిపించే లోపాలుగా ఇంటర్వ్యూలు నిర్వహించేవారు పక్షపాతం చూపడం (42 శాతం), వృత్తేతర నైపుణ్యాలను మదింపు చేయడంలో పరిమిత అవకాశం (63 శాతం), బలహీనతలు కనిపెట్టలేకపోవడం (57 శాతం) తేలాయి. ఈ లోపాలను అధిగమించేందుకు, పాత పద్ధతిని మెరుగుపరచేందుకు హైరింగ్ మేనేజర్లు సాఫ్ట్ స్కిల్స్ అస్సెస్‌మెంట్, జాబ్ ఆడిషన్స్, ఇష్టాగోష్ఠిపూర్వక వాతావరణంలో సమావేశమవడం, వర్చ్యుయల్ రియాలిటీ అస్సెస్‌మెంట్లు, వీడియో ఇంటర్వ్యూలతో సహా నవ ఇంటర్వ్యూ పద్ధతులను, ఉపాయాలను అనుసరిస్తున్నారని సర్వే తెలియజేసింది.



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

రిక్రూటింగ్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం గణనీయంగా ఉంటుందని, పాలనాపరమైన బాధ్యతల ఆటోమేటింగ్ ద్వారా తాము వేగంగా పనిచేయడానికి సాయపడుతుందని, తాము ఒంటరిగా ఆలోచించలేని నిగూఢమైన, నిశిత పరిశీలనలను యుక్తితో అందిస్తుందని సర్వేలో పాల్గొన్నవారిలో 76 శాతం మంది అభిప్రాయపడ్డారు. రిక్రూటింగ్‌లో ఎక్కువగా అభ్యర్థుల వివరాలు సంపాదించడం (58 శాతం), పరిశీలించడం (56 శాతం), అభ్యర్థులను తీర్చిదిద్దుకోవడం (55 శాతం)లో ఏ.ఐ. ప్రభావం చూపుతుందని వెల్లడైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమయాన్ని ఆదా చేస్తుందని 67 శాతం మంది, మానవ పక్షపాతాన్ని తొలగిస్తుందని 43 శాతం మంది అభిప్రాయపడ్డారు.

డాటా వినియోగం

కాగా, తాము అభ్యర్థులను ఉద్యోగాలలోకి తీసుకోవడంలో డాటా ఉపయోగించుకోవడం ఉన్నత ధోరణిగా ఉందని నాలుగు (మెక్సికో (61 శాతం), బ్రెజిల్ (59 శాతం), ఇండియా (56 శాతం), చైనా (56 శాతం) దేశాలలోని వారు ఎక్కువగా అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ప్రపంచ సగటు 50 శాతంగా ఉంది. టాలెంట్ ఎక్విజిషన్ వృత్తినిపుణుల్లో 64 శాతం మంది ఇప్పుడు డాటా ఉపయోగిస్తున్నారని, వచ్చే రెండేళ్లలో 79 శాతం మంది దాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉందని సర్వేలో తేలింది. డాటా ఉపయోగించుకోవడం వల్ల తమ వృత్తి జీవితాలు పైకెదుగుతాయని సుమారు 69 శాతం మంది టాలెంట్ వృత్తినిపుణులు భావిస్తున్నారు. ప్రతిభావంతులను సమకూర్చుకోవడానికి సంబంధించి డా టా వినియోగం ప్రస్తుతం, ఐదు అత్యంత ఉమ్మడి విభాగాలలో అభ్యర్థులను అట్టేపెట్టుకోవడాన్ని పెంచుకోవడంలో (56 శాతం), నైపుణ్యాల వ్యత్యాసాన్ని మదింపు చేయడంలో (50 శాతం), మె రుగైన ఆఫర్లు రూపొందించడంలో (50 శాతం), కార్మిక శక్తి ప్రణాళికలో (41 శాతం) కనిపిస్తోంది. అయి తే, డాటా వినియోగంలో రెండు ప్రధాన ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయని సర్వేలో తేలింది.

ఎగుమతులలో వృద్ధి

న్యూఢిల్లీ: ఇంజనీరింగ్ వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులలో కనిపించిన పెరుగుదల మొత్తంమీద వస్తువుల ఎగుమతులలో 2017 డిసెంబరులో (2016 డిసెంబరు కన్నా) 12.36 శాతం ఎక్కువగా 27.03 బిలియన్ డాలర్ల మేరకు నమోదు చేయడానికి సహాయపడింది. గత 17 నెలల్లో వృద్ధి నమోదైన వాటిలో ఇది 16వ నెల కిందకు వస్తుంది. (డ్యూ డ్రాబ్యాక్ రేట్లలో తగ్గుదల వల్ల ప్రధానంగా 2017 అక్టోబరులో ఎగుమతులు తగ్గాయి). ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 300 బిలియన్ల డాలర్ల స్థాయిని తాకగలవని ఎగుమతిదార్లు ఆశాభావంతో ఉన్నారు. ''2017 అక్టోబరులో క్షీణించిన తర్వాత, వరుసగా రెండవ నెలలో ఎగుమతులలో సానుకూల వృద్ధి నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంమొదటి తొమ్మిది నెలల్లో మేం ఇప్పటికే 224 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు సాధించాం. అంతర్జాతీయ వాణిజ్య వృద్ధి 2018లో బలంగానే కొనసాగుతోంది. 2017-18లో 300 బిలియన్ల డాలర్ల మైలురాయిని చేరుకునే దిశగా మేం పయనిస్తున్నాం'' అని ఎఫ్.ఐ.ఇ.ఓ. అధ్యక్షుడు గణేశ్ కుమార్ గుప్తా చెప్పారు. దిగుమతులు కూడా 2017 డిసెంబరులో 41.91 బిలియన్ డాలర్ల మేరకు ఒక్కసారిగా 21.12 శాతం పెరిగాయి. ప్రధానంగా పసిడి, వెండి, విలువైన రత్నాలు, పెట్రోలియం, ఎలక్ట్రానిక్ వస్తువులు దిగుమతి అయినవాటిలో ఉన్నాయి. దీనితో ఎగుమతులకన్నా దిగుమతుల విలువ పెరిగింది. ఈ రెండింటి మధ్య తేడా 2016



డిసెంబరులో 10.54 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నది 2017 డిసెంబరులో 14.88 బిలియన్ డాలర్లకు పెరిగింది.

ఎగుమతులలో వృద్ధిని కనబరచిన ఇతర రంగాలలో ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, నగలు, ఆర్గానిక్, ఇనార్గానిక్ రసాయనాలు ఉన్నాయి. ఎగుమతులలో క్షీణతను చూసిన రంగాలలో రడీమేడ్ దుస్తులు, ఇనుప ఖనిజం, నూనె గింజలు ఉన్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులోకన్నా 12.05 శాతం ఎక్కువగా, 2017-18 ఆర్థిక సంవత్సరం అదే కాలంలో 338.36 బిలియన్ డాలర్ల మేరకు నమోదయ్యాయి. 2016-17 మొదటి తొమ్మిది నెలల్లో ఎగుమతులకన్నా దిగుమతుల విలువ 78.43 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2017-18 మొదటి తొమ్మిది నెలల్లో ఎగుమతులకన్నా దిగుమతుల విలువ 114.85 బిలియన్ డాలర్లుగా ఉంది.

'బిస్కట్లపై జి.ఎస్.టి. తగ్గించండి'

న్యూఢిల్లీ: బిస్కట్, సంబంధిత ఉత్పత్తులపై వస్తువులు, సేవల పన్ను (జి.ఎస్.టి)ని ఇప్పుడున్న 18 శాతం నుంచి తగ్గించాలని బిస్కట్ తయారీదార్లు మంగళవారం డిమాండ్ చేశారు. అది సామూహిక ఆహార ఉత్పత్తి అని, అదే కోవలోకి వచ్చే ఇతర ఉత్పత్తులపై పన్ను రేటు తక్కువగా ఉందని వారు అన్నారు. జి.ఎస్.టి. అమలు తర్వాత, అమ్మకాలు సుమారు 15 శాతం తగ్గాయని భారతీయ బిస్కట్ల తయారీదార్ల సంఘం (ఐ.బి.ఎం.ఏ) వెల్లడించింది. బిస్కట్లు తినేవారు ఎక్కువగా పేదవర్గం వారని, దానిపై పన్ను ఎక్కువగా ఉంటే, అది 2.5 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను కూడా దెబ్బతీస్తుందని సంఘం పేర్కొంది. బిస్కట్లపై జి.ఎస్.టి. రేటును 5 శాతం నుంచి 12 శాతం మధ్యకు తీసుకురావాలని సంఘం కోరింది. బిస్కట్ ప్రీమియం ఉత్పత్తి ఏమీ కాదని, హెచ్చు పన్ను వల్ల పరిశ్రమ వృద్ధి ఎదుగుబొదుగు లేకుండా పోతుందని తెలిపింది. ''ఇది ఎక్కువ మంది సిబ్బంది అవసరమయ్యే పరిశ్రమ. ప్రధానంగా స్థానిక కార్మికులే ఉపాధి పొందుతారు. పైగా, ప్రాసెస్డ్ డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, టీ, పండ్ల రసం వంటి ఇతర ఆహార ఉత్పత్తులను 5 శాతం పన్ను బ్రాకెట్‌లోనే ఉంచారు'' అని ఐ.బి.ఎం.ఏ. అధ్యక్షుడు బి.పి. అగర్వాల్ ఇక్కడ మీడియా ప్రతినిధులతో అన్నారు. జి.ఎస్.టి. కౌన్సిల్ బిస్కట్లను గత ఏడాది జూలై 1 నుంచి అమలులోకి తెచ్చిన జి.ఎస్.టి. పన్ను కింద 18 శాతం



శ్లాబులో ఉంచింది. బిస్కట్లను 5-12 శాతం శ్లాబులో ఉంచవలసిందని కోరుతూ సంఘం రాష్ట్రాల ఆర్థిక మంత్రులందరికీ, ప్రధాన మంత్రికి లేఖ రాసినట్లు అగర్వాల్ తెలిపారు. ''ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2.5 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది. వారిలోకి చిన్న కార్మికులు, పంపిణీదార్లు, ట్రాన్స్‌పోర్టర్లు కూడా వస్తారు'' అని అగర్వాల్ అన్నారు. ప్రభుత్వం పన్ను తగ్గించకపోతే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నకు, ధర ఆటోమేటిక్‌గా పెరుగుతుందని, దాన్ని వినియోగదార్లకు బదలీ చేయకతప్పదని ఆయన జవాబిచ్చారు. ''మేం ఇప్పుడు 50 గ్రాముల ప్యాకెట్‌ను 5 రూపాయలకు అమ్ముతున్నాం. 30 గ్రాములు లేదా అంతకన్నా తక్కువ పరిమాణాన్ని అదే రేటుకు విక్రయిస్తాం'' అని అగర్వాల్ అన్నారు.

సూచీలలో స్వల్ప క్షీణత

ముంబయి: ఇంట్రాడేలో 34,936 పాయింట్ల హెచ్చు స్థాయిని చూసిన బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి తర్వాత 70 పాయింట్లు క్షీణించిన దశలో ముగిసింది. దేశ వాణిజ్య లోటు (ఎగుమతులకన్నా దిగుమతుల విలువ ఎక్కువగా ఉండడం) 2016 డిసెంబరులో 10.54 బిలియన్ డాలర్లుగా ఉన్నది, 2017 డిసెంబరులో 14.88 బిలియన్ డాలర్లకు పెరగడంతో ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించే ధోరణిని అనుసరించారు. ఇంతకుముందు సెషన్‌లో 34,843.51 పాయింట్ల వద్ద ముగిసిన 30 షేర్ల సెన్సెక్స్ మంగళవారం ఉదయం 34,877.71 పాయింట్ల వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 34,936.03 పాయింట్ల గరిష్ఠ, 34,735.55 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. చివరకు 72.46 పాయింట్లు క్షీణించి 34,771.05 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' 41.1 పాయింట్లు క్షీణించి 10,700.45 పాయింట్ల వద్ద ముగిసింది. కేంద్ర బడ్జెట్ సమర్పణకు రోజులు దగ్గరపడుతున్నకొద్దీ స్టాక్ మార్కెట్లలో ఉత్థాన పతనాలు పెరగవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. చమురు ఉత్పత్తి, ఎగుమతి దేశాలు (ఒపెక్), రష్యా చమురు ఉత్పాదనలో కోత విధించుకున్నాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు దాదాపు మూడేళ్ళ గరిష్ఠ స్థాయిలకు చేరడంతో చమురు శుద్ధి కంపెనీల షేర్ల ధరలు పతనమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధి ఆరోగ్యకరంగా ఉండడంతో చమురుకు డిమాండ్ బలంగా ఉంది. ఐ.టి. సర్వీసుల సంస్థలకు 2018లో పరిస్థితులు బాగుంటాయని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేయడంతో ఇన్ఫోసిస్ లిమిటెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్, విప్రో లిమిటెడ్ వంటి కంపెనీల షేర్ల ధరలు లాభపడ్డాయి. వరుసగా రెండు సెషన్లలో



నష్టాలు చవిచూసిన 'నిఫ్టీ'ఐ.టి. రంగ సూచి మంగళవారం 3 శాతం లాభపడింది. తాత్కాలిక డాటా ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సోమవారం రూ. 32,92 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేయగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 173.28 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించాయి. ఆసియాలో ఇతర మార్కెట్లు కూడా మంగళవారం పెరిగాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ తన ద్రవ్య ఉద్దీపన చర్యలను కుదించుకోవచ్చుననే ఊహాగానాలు పెరిగిన నేపథ్యంలో డాలరుతో యూరో మారకం విలువ దాదాపు మూడేళ్ళ గరిష్ఠ స్థాయికి పెరిగింది.

'దిగుమతి సుంకం తొలగించండి'

న్యూఢిల్లీ: ఫెరో-నికెల్, స్టెయిన్‌లెస్ స్టీల్ తుక్కుపై దిగుమతి సుంకాన్ని తొలగించవలసిందని స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తిలో ఉపయోగించే కీలక ముడి పదార్థాలపై కస్టమ్స్ సుంకాన్ని తొలగించవలసిందిగా ఇండియన్ స్టెయిన్‌లెస్ స్టీల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ (ఐ.ఎస్.ఎస్.డి.ఏ) కేంద్ర బడ్జెట్ రూపకల్పన సందర్భంగా కోరింది. ''ప్రభుత్వం కడపటి బడ్జెట్‌లో శుద్ధ నికెల్‌పై కస్టమ్స్ సుంకాన్ని తొలగించినా, అది పరిశ్రమకు పెద్దగా సహాయపడలేదు. ఎందుకంటే, స్టెయిన్‌లెస్ స్టీల్ తయారీ సంస్థలు ఉపయోగించే నికెల్ చాలా భాగం ఫెరో-నికెల్ రూపంలో ఉంటుంది'' అని సంఘం పేర్కొంది. అదే సహాయాన్ని ఇపుడు ఫెరో- నికెల్‌కు వర్తింపజేయాలని కోరింది. ఫెరో-నికెల్‌పై దిగుమతి సుంకం 2.5 శాతంగా ఉంది. భారతదేశంలో నికెల్ వనరులు ఏమాత్రం లేనం దువల్ల ముడి పదార్థాలను దిగుమతి చేసుకోక తప్పదని సంఘం తెలిపింది. స్టెయిన్‌లెస్ స్టీల్ అంతటినీ విద్యుత్ కొలిమిల ద్వారా ఉత్పత్తి చేస్తున్నందు వల్ల స్టెయిన్‌లెస్ స్టీల్ తుక్కు ప్రధాన ముడి పదార్థంగా ఉంది. దాని నుంచి తక్కువ వ్యయంతో క్రోమ్, నికెల్ వంటివి కూడా తీయవచ్చునని సంఘం తెలిపింది. ఈ తుక్కు కూడా దేశంలో అందుబాటులో లేదు. దిగుమతి చేసుకోవాల్సిందే. కనుక, స్టెయిన్‌లెస్ స్టీల్ తుక్కుపై 2.5 శాతంగా ఉన్న కస్టమ్స్ సుంకాన్ని పూర్తిగా తొలగించాలని సంఘం కోరింది. భారతీయ స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమ పోటీ సామర్థ్యాన్ని సంరక్షించాలని సంఘం అధ్యక్షుడు కె.కె. పహూజా చెప్పారు. ఫెరో-నికెల్, స్టెయిన్‌లెస్ స్టీల్ తుక్కుపై కస్టమ్స్ సుంకాన్ని తొలగించే అంశాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లామని ఉక్కు శాఖ కార్యదర్శి అరుణా శర్మ చెప్పారు.

'వెస్ట్ బెంగాల్ బెస్ట్ బెంగాల్ అవుతోంది'

కోల్‌కతా: మమతా బెనర్జీ నాయకత్వంలో ''వెస్ట్ బెంగాల్ బెస్ట్ బెంగాల్‌గా పరిణమిస్తోం''దని ప్రశంసించిన ఆర్.ఐ.ఎల్. చైర్మన్ ముకేశ్ అంబానీ పశ్చిమ బెంగాల్‌లో టెలికాం, పెట్రో-రిటైల్ వ్యాపారాల విస్తరణకు రూ. 5,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో మొబైల్ ఫోన్లు, సెట్-టాప్ బాక్స్‌ల తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఉన్న అవకాశాన్ని కూడా తన కంపెనీ పరిశీలిస్తోందని ఆయన చెప్పారు. బెంగాల్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో మంగళవారం ఆయన ప్రసంగించారు. బెంగాల్‌లో గతంలో రూ. 4,500 కోట్ల పెట్టుబడులు పెడతామని చెప్పిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ. 15,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టిన సంగతిని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీదీ స్నేహపూర్వక వాతావరణం సృష్టించినందువల్లనే ఇది సాధ్యమైందని ఆయన చెప్పారు. బెంగాల్‌లో అతి పెద్ద పెట్టుబడిదారుల్లో ఆర్.ఐ.ఎల్. ఒకటిగా అవతరించిందని ఆయన అన్నారు.

సీ-ప్లేన్‌ల తయారీ


సీ-ప్లేన్‌లను పశ్చిమ బెంగాల్‌లో తయారు చేయడానికి గల అవకాశాన్ని విమానయాన సంస్థ స్పైస్‌జెట్ పరిశీలిస్తుందని స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ చెప్పారు. దుర్గాపూర్ సమీపంలోని అందాల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన విమానాశ్రయం నుంచి తమ సంస్థ సర్వీసులు ప్రారంభిస్తుందని, కోల్‌కతా నుంచి చిట్టగాంగ్‌కు కూడా విమానాలు నడుపుతుందని ఆయన చెప్పారు. తక్కువ ఖర్చుతో కూడిన ప్రైవేటు విమానయాన సంస్థగా స్పైస్‌జెట్‌కి పేరుంది. సీ-ప్లేన్‌లకు కేంద్రంగా మారగల సామర్థ్యం పశ్చిమ బెంగాల్‌కు ఉందని రాష్ట్రంలోని గంగాసాగర్, సుందర్‌బన్స్, ఇతర ప్రాంతాలకు వాటిని నడపవచ్చని ఆయన చెప్పారు. ''టూరిజాన్ని పెంపొందించేందుకు రాష్ట్రంలో ఈ సీ-ప్లేన్‌లను నడపాలని, వాటిని రాష్ట్రంలో తయారు చేసేందుకు గల అవకాశాన్ని కూడా పరిశీలించాలని భావిస్తున్నాం'' అని ఈ సమావేశంలో అజయ్ సింగ్ చెప్పారు. కోల్‌కతా విమానాశ్రయం నుంచి ప్రస్తుతం 75 స్పైస్‌జెట్ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. విమానాలు మరిన్ని వచ్చిన తర్వాత, ఈ సర్వీసులు ఇంకా పెంచుతామని ఆయన చెప్పారు. కోల్‌కతా నుంచి పలు ఆసియాన్ దేశాలకు సర్వీసులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందాల్ నుంచి బెంగళూరు, హైదరాబాద్‌లకు కూడా విమానాలు నడపనున్నట్లు చెప్పారు.

మొబిక్విక్‌లో పెరిగిన బజాజ్ వాటా

న్యూఢిల్లీ: మొబైల్ వాలెట్ కంపెనీ మొబిక్విక్‌లో ఇంతకుముందు అనుకున్నట్లుగా 10.83 శాతంకాక, 12.60 శాతం వాటాను సమకూర్చుకుంటున్నట్లు బజాజ్ ఫైనాన్స్ మంగళవారం ప్రకటించింది. కంపల్సరీ కన్వెర్టిబుల్ కుములేటివ్ ప్రిఫరెన్స్ షేర్ల కన్వెర్షన్ ధరలో మార్పు వల్ల వాటా కొనుగోలు పెరిగినట్లు బజాజ్ తెలిపింది. సుమారు రూ. 225 కోట్లకు 10.83 శాతం వాటా సమకూర్చుకునేందుకు వన్ మొబిక్విక్ సిస్టమ్స్‌తో గత ఏడాది ఆగస్టులో బజాజ్ ఫైనాన్స్ ఒక సబ్‌స్క్రిప్షన్ ఒప్పందం కుదుర్చుకుంది. ''కంపల్సరీ కన్వెర్టిబుల్ కుములేటివ్ ప్రిఫరెన్స్ షేర్ల కన్వెర్షన్ ధరలో మార్పు వల్ల...కంపెనీకి ఇప్పుడు మొబిక్విక్‌లో సుమారుగా 12.60 శాతం వాటా చిక్కుతుంది. సి.సి.సి.పి.ఎస్‌ల కన్వెర్షన్ అనంతరం పూర్తి డైల్యూటెడ్ ప్రాతిపదికపై ఇది చోటుచేసుకుంటుంది'' అని బజాజ్ సంస్థ తెలిపింది. ''ఇంతకుముందు చేసిన పెట్టుబడికి మించి కొత్తగా పెడుతున్నది ఏమీ లేదు'' అని కంపెనీ తెలిపింది.

సెన్సెక్స్ — జనవరి 16, 2018

34,771.05 ▼ -72.46




పెరిగినవి	%	తగ్గినవి	%
విప్రో	4.88	కోల్ ఇండియా	-4.57
ఇన్ఫోసిస్	3.93	రిలయన్స్	-2.54
టీసీఎస్	3.77	టాటా మోటార్స్	-2.30
ఐసీఐసీఐ బ్యాంక్	1.43	టాటా స్టీల్	-2.16
డాక్టర్ రెడ్డీస్	1.38	ఐటీసీ	-2.06


నిఫ్టీ — జనవరి 16, 2018


10700.45 ▼ -41.10



పెరిగినవి	%	తగ్గినవి	%
విప్రో	5.38	కోల్ ఇండియా	-4.67
హెచ్‌సీఎల్ టెక్	4.40	టాటా పవర్	-4.39
ఇన్ఫోసిస్	3.86	హెచ్‌పీసీఎల్	-3.67
టీసీఎస్	3.81	బజాజ్ ఫైనాన్స్	2.92
టెక్ మహీంద్రా	2.56	రిలయన్స్	-2.76







మనం వికాస్
బుధవారం 17 జనవరి 2018
www.manamnews.com



సోషల్ మీడియా మేనేజర్

ఒకప్పుడు సోషల్ మీడియా కంటే సోషల్ పరిచయాలే ఎక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు ముఖ పరిచయాల కంటే ఫేస్‌బుక్ పరిచయాలే ఎక్కువగా ఉంటున్నాయి.

ప్రస్తుతం ఏదైనా బ్రాండ్‌కు ప్రాచుర్యం కల్పించడంలో సోషల్ మీడియా పాత్ర ఎనలేనిది. ట్విట్టర్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌ల నిర్వహణ బాధ్యతలు చూసే ఉద్యోగాలు పదేళ్ల క్రితం వచ్చినా ఇప్పటికీ క్రేజ్ తగ్గలేదు. సోషల్ మీడియాలో ఏం పోస్ట్ చేస్తే చూస్తారు, ఎలాంటి పోస్టులకు లైక్‌లు వస్తాయి వంటి విషయాలపై అవగాహన ఉండి విద్యార్హత ఏదైనా కొద్దిగా టెక్నికల్ నాలెడ్జ్ ఉంటే చాలు ఎవ్వరైనా సోషల్ మీడియా మేనేజర్ ఉద్యోగానికి అర్హులే. రకరకాల బ్రాండ్లను సోషల్ మీడియాలో వైరల్ చేయడం వీరి బాధ్యత.

విధులు..

సంస్థకు, క్లయింట్‌లకు సోషల్ మీడియా ప్రతినిధిగా వ్యవహరిస్తూ వినియోగదారుల ఫిర్యాదులకు, కామెంట్లకు స్పందించడం, సక్రమ పద్ధతుల ద్వారా సంస్థ వెబ్‌సైట్‌లకు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలకు ఎక్కువ మందిని ఆకర్షించడం, సోషల్ మీడియా మేనేజర్ల ప్రధాన బాధ్యతలు. సాధారణ డిగ్రీతో పాటు ఆకర్షణీయమైన ట్వీట్లు, పోస్టులు చేయడం, సోషల్ మీడియా ట్రెండ్స్‌ని ఎప్పటికప్పుడూ ఫాలో అవుతూ ఉండటం ఈ ఉద్యోగానికి కావాల్సిన ప్రధాన అర్హతలు.



కంటెంట్ క్రియేషన్:

సోషల్ మీడియా పోస్టులు రాయడం, బ్లాగ్ పోస్టులు రాయడం, బ్యానర్లు డిజైన్ చేయడం, ఫోటోలు, వీడియోలు సెలెక్ట్ చేసి ఎడిట్ చేయడం, గెస్ట్ కంట్రిబ్యూటర్స్‌ని ఆహ్వానించడం. కస్టమర్ సర్వీసెస్, పీఆర్ కమ్యూనికేషన్స్, ఎంక్వయిరీలు, ట్రెండింగ్ టాపిక్స్, కాంపిటీటర్స్, కమ్యూనిటీ బిల్డింగ్.

కంటెంట్ మార్కెటింగ్, డిమాండ్ జనరేషన్, పీఆర్, ఎగ్జిక్యూటివ్స్, హెచ్ఆర్, సేల్స్, సర్వీస్

లైవ్ ఈవెంట్స్ కవరింగ్ :

స్పీకర్స్‌ని ప్రమోట్ చేయడం, ఫోటోలు తీసుకోవడం, హ్యాష్ ట్యాగ్‌లను ప్రమోట్ చేయడం, లైవ్ ట్వీట్లు పెట్టడం, వీక్షకుల సందేహాలు నివృత్తి చేయడం. కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజింగ్ స్కిల్స్, క్రియేటివ్ మైండ్‌సెట్, అడాప్టివ్ నేచర్, కాపీ రైటింగ్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, బడ్జెటింగ్, మార్కెట్ అనలైజేషన్, ప్లానింగ్ అండ్ ఎగ్జిక్యూషన్.



గ్రూప్ డిస్కషన్

జీడీలో విజయానికి మార్గాలు...

ప్రస్తుతం ఉద్యోగ సాధనలో, ప్రముఖ బీస్కూల్స్‌లో ప్రవేశానికి సైతం తప్పక ప్రతిభ చూపాల్సిన ఘట్టం.. గ్రూప్ డిస్కషన్ (జీడీ). కోరుకున్న బీ స్కూల్లో ప్రవేశం దక్కాలన్నా.. మనం కలలు కనే సంస్థలో ఉద్యోగం లభించాలన్నా.. రాత పరీక్షలో ప్రతిభ చూపితే సరిపోదు. కీలకమైన గ్రూప్ డిస్కషన్‌లోనూ విజయం సాధించాల్సి ఉంటుంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సీజన్ మొదలైన నేపథ్యంలో.. జీడీలో సక్సెస్ సాధించాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం..!

ఇంజనీరింగ్, ఎంబీఏ తదితర కోర్సుల విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ప్రారంభమవుతున్నాయి. ప్లేస్‌మెంట్స్ ప్రక్రియలో దాదాపు అన్ని సంస్థలు రాత పరీక్ష, బృంద చర్చ (గ్రూప్ డిస్కషన్), మౌఖిక పరీక్ష (పర్సనల్ ఇంటర్వ్యూ) అనే మూడంచెల ప్రక్రియను నిర్వహించి.. తమ సంస్థకు అనుగుణమైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నాయి. అలాగే ప్రతిష్టాత్మక బీస్కూల్స్ ఐఐఎంలు తొలి దశలో క్యాట్ రాత పరీక్షను నిర్వహిస్తున్నాయి. ఐఐఎంల అడ్మిషన్ ప్రక్రియ తదుపరి దశలో గ్రూప్ డిస్కషన్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. వాస్తవానికి రాత పరీక్షలకు నిర్దేశిత సిలబస్ ఉంటుంది కాబట్టి గట్టెక్కొచ్చు. కానీ, గ్రూప్ డిస్కషన్‌కు నిర్ణీత సిలబస్ ఉండదు. ఏ టాపిక్ ఇస్తారో... ఏం మాట్లాడి మెప్పించాలో, బృందంలోని వారిని ఎలా మెప్పిస్తే... ఇంటర్వ్యూయర్కు నచ్చుతుందో అంచనాకు అందదు. అందుకే జీడీ అనేది అగ్ని పరీక్ష అంటున్నారు నిపుణులు!

జీడీ అంటే..!

రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను బృందాలుగా ఏర్పాటుచేసి.. ఏదైనా ఒక అంశం పై చర్చించమనడమే జీడీ. సాధారణంగా జీడీ వ్యవధి 15-20 నిమిషాలు ఉంటుంది. కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్ షిప్ స్కిల్స్, సబ్జెక్ట్ నాలెడ్జ్, స్పష్టత, సమయస్ఫూర్తి వంటి లక్షణాలు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకోవడమే దీని ప్రధాన ఉద్దేశం. గతంలో కంటే ప్రస్తుతం దీని పరిధి బాగా విస్తరించింది. ఇంజనీరింగ్, మేనేజ్మెంట్ అభ్యర్థులకు మాత్రమే కాకుండా.. అనేక ప్రొఫెషనల్ కోర్సులు, కార్పొరేట్ సంస్థలు నిర్వహించే ఉద్యోగ నియామకాల్లో సైతం జీడీ కీలకపాత్ర పోషిస్తోంది.

జీడీ టాపిక్స్

- మేనేజ్‌మెంట్ కాన్సెప్ట్స్.
- బిజినెస్ కాన్సెప్ట్స్.
- ఆర్థిక అంశాలు.
- రాజకీయ అంశాలు.
- జనరల్ అంశాలు (ఉదా: మహిళా సమస్యలు, పర్యావరణ అంశాలు).
- విద్యా రంగ అంశాలు.
- సినిమా, క్రీడాంశాలు.
- టెక్నాలజీ అంశాలు.

దృష్టి కేంద్రీకరించాలి

భావ వ్యక్తీకరణ (కమ్యూనికేషన్ స్కిల్స్): ఇచ్చిన అంశాన్ని సూటిగా, సరళంగా, స్పష్టంగా, ఆత్మవిశ్వాసంతో చెప్పడమే భావ వ్యక్తీకరణ.

విషయ పరిజ్ఞానం: సంబంధిత అంశంపై ఉన్న పరిజ్ఞానం కూడా జీడీలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇచ్చిన టాపిక్ చక్కగా ప్రజెంట్ చేయాలన్నా.. చర్చించాలన్నా.. విషయ పరిజ్ఞానం తప్పనిసరి. సబ్జెక్ట్ అంశాలతోపాటు ప్రముఖ దినపత్రికలు, మ్యాగజైన్లు, టీవీచానళ్లు, ఇంటర్నెట్ వంటి సాధనాలను ఉపయోగించుకుని సమకాలీన అంశాలపై ఎంతోకొంత పరిజ్ఞానం పెంపొందించుకోవాలి.



నాయకత్వ లక్షణాలు:

లీడర్‌షిప్ స్కిల్స్‌ని పరీక్షించడం కూడా జీడీలో భాగమే. విషయ పరిజ్ఞానంతోపాటు డిస్కషన్ సజావుగా జరిగేలా వ్యవహరించే తీరు, సందర్భోచితంగా స్పందించే గుణం, వివాదం తలెత్తినప్పుడు హుందాగా వ్యవహరించడం తదితర అంశాలు కూడా పరిగణలోకి తీసుకుంటారు.

ఆలోచనలు పంచుకోవడం:

జీడీ ప్రధాన ఉద్దేశం ఒకరి అభిప్రాయాలను మరొకరితో పంచుకోవడమే. ఎదుటివారి అభిప్రాయాలను, ఆలోచనలను గౌరవించడం, వాదించకుండా హుందాగా చెప్పడం, ఇతరులు మాట్లాడటం పూర్తయ్యాక మన అభిప్రాయాలను, అభ్యంతరాలను తెలియజేయడం వంటివి చాలా ముఖ్యం.



భాషా పరిజ్ఞానం:

మనం ఉపయోగించే భాష కూడా జీడీలో కీలకం. సరళంగా, స్పష్టంగా, సున్నితంగా మాట్లాడాలి. జీడీలో కంటెంట్‌కు అధిక ప్రాధాన్యం ఉన్నా.. ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానాన్ని కూడా పరిశీలిస్తారు. కాబట్టి ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి.

హావభావాలు:

జీడీ సమయంలో బాడీ లాంగ్వేజ్ని కూడా గమనించుకోవాలి. మంచి దుస్తులు ధరించడం, నిటారుగా కూర్చోవడం, కంటి చూపు సరిగా ఉండటం, ఆత్మ విశ్వాసాన్ని ప్రదర్శించడం చాలా ముఖ్యం.

చేయాల్సినవి.!

ఒత్తిడి లేకుండా చిరునవ్వుతో ఉండాలి.
సమాధానం తడబాటు లేకుండా చెప్పాలి.
సానుకూల దృక్పథంతో మెలగాలి.
హుందాగా వ్యవహరించాలి.
ఇచ్చిన అంశానికే పరిమితం కావాలి.
ఇతరుల అభిప్రాయాలను శ్రద్ధగా వినాలి.
ఉత్సాహంగా ఉండాలి.
చొరవ చూపాలి.
ఇతరులకు మాట్లాడే అవకాశం ఇవ్వాలి.
ముగింపు సరిగా ఉండేలా జాగ్రత్త పడాలి.

చేయకూడనివి.!

అత్యుత్సాహం ప్రదర్శించకూడదు.
గట్టిగా మాట్లాడటం తగదు
మధ్యలో అభ్యంతరాలు చెప్పకూడదు.
ఆధిపత్యం కోసం ప్రయత్నించకూడదు.
నిర్లక్ష్యంగా, నిర్లిప్తింగా ప్రవర్తించకూడదు
సంబంధంలేని అంశాలను ప్రస్తావించడం సరికాదు.



ఫోరెన్సిక్ సైన్స్

ప్రస్తుత టెక్నాలజీమయ ప్రపంచంలో నేరగాళ్ల పంథా మారింది. నేరస్తులు విభిన్న మార్గాల్లో నేరాలకు పాల్పడుతూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. తమ తెలివితేటలతో ఆధారాలను మాయం చేయడానికి కొత్త ఎత్తు గడలు వేస్తున్నారు. వీరి భరతం పట్టేందుకు పోలీసులు ప్రయోగిస్తున్న అస్త్రం ఫోరెన్సిక్ సైన్స్. ఈ విభాగంలో కోర్సులు పూర్తిచేసిన వారికి సీబీఐ, ఐబీ వంటి సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకుందాం.

నేర నిరూపణకు

నేరాలకు సంబంధించిన సాక్ష్యాలు, ఆధారాలను సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పరిశోధించే విభాగమే ఫోరెన్సిక్ సైన్స్. సంఘటన స్థలంలో దొరికిన తల వెంట్రుకలు, వేలిముద్రలు, రక్తపు చుక్కలు, గోళ్లు వంటి చిన్న చిన్న ఆధారాలతో నేరస్తులను కనిపెట్టగల సత్తా ఉన్న శాస్త్రమిది. ఈ ఆధారాలను న్యాయ స్థానాలు ఆమోదిస్తుండటంతో ప్రస్తుతం ఫోరెన్సిక్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది.



కంప్యూటింగ్ ఫోరెన్సిక్కు భారీ డిమాండ్

ఇటీవలి కాలంలో కంప్యూటర్ వాడకం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాలు అధికమయ్యాయి. కంప్యూటర్ల నుంచి సమాచారాన్ని దొంగిలించడం, నాశనం చేయడం, వ్యక్తులను, సంస్థలను బెదిరించడం వంటివి పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కంప్యూటర్ ఫోరెన్సిక్ సైన్స్కు ప్రాధాన్యత ఏర్పడింది.

కావాల్సిన నైపుణ్యాలు

ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో పనిచేయాలంటే సమాచారం, ఆధారాల సేకరణ పద్ధతులపై అవగాహన ఉండాలి. విశ్లేషణ సామర్థ్యం, పరిశోధనల పట్ల అభిరుచి అవసరం.

కోర్సులు-సంస్థలు

గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా, పీహెచ్డీ స్థాయిల్లో ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్సీయూ)లో పీజీ డిప్లొమా ఇన్ క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్స్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ ఉన్నాయి. కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులు. రాత పరీక్ష ఆధారంగా ప్రవేశం ఉంటుంది.

ఫోరెన్సిక్ విభాగాలు

ఫోరెన్సిక్ ఆర్కియాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఫోరెన్సిక్ లింగ్విస్టిక్, ఫోరెన్సిక్ సిరియాలజీ, ఫోరెన్సిక్ కంప్యూటింగ్, సైబర్ ఫోరెన్సిక్, ఫోరెన్సిక్ ఆడియో అండ్ వీడియో అనాలసిస్, సెల్ఫోన్ ఫోరెన్సిక్ విభాగాలు ఉన్నాయి.

రిక్రూటింగ్ ఏజెన్సీలు

ఫోరెన్సిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ నేర పరిశోధన సంస్థలు, సీబీఐ, ఐబీ, నేషనల్ పోలీస్ అకాడమీ, నేషనల్, స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు, రీసెర్చ్ ఆర్గనైజేషన్లు, ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలు, కోర్టులు, బ్యాంకులు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలుంటాయి. యూజీసీ నెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినవారు పీహెచ్డీ చేయవచ్చు. తర్వాత కాలేజీలు, యూనివర్సిటీల్లో అధ్యాపకులుగా స్థిరపడొచ్చు.



క్వార్టర్ ఫైనల్లో పృథ్వీ సేన





మౌంట్ మాంగనూయ్ (న్యూజిలాండ్): అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత యువ జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారమిక్కడ జరిగిన మ్యాచ్‌లో భారత 10 వికెట్లతో పపువా న్యూ జెనీవాను ఓడించింది. బౌలింగ్‌లో అనుకుల్ రాయ్, బ్యాటింగ్‌లో కెప్టెన్ పృథ్వీ షా సత్తా చాటారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూ జెనీవా 21.5 ఓవర్లలో 64 పరుగులకు ఆలౌటైంది. భారత ఎడమ చేతి స్పిన్నర్ అనుకుల్ రాయ్ 6.5 ఓవర్లలో 14 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు. యువ ఫాస్ట్ బౌలర్ శివం మవి రెండు వికెట్లు తీసుకున్నాడు. కమలేష్ నగర్‌కోటి, అర్షదీప్ సింగ్ చెరో వికెట్ పడగొట్టారు. తర్వాత బరిలోకి దిగిన భారత్ కేవలం 8 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుంది. కెప్టెన్ షా మరోసారి ముందుండి జట్టును నడిపించాఆడు. 39 బంతుల్లో 57 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో పృథ్వీ సేన గెలుపుతో ప్రారంభించింది.

జెనీవా జట్టు 40 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఇందులో మవి రెండు వికెట్లు తీసుకున్నాడు. తొలుత ఇగో మహురు ఎల్‌బిడబ్ల్యూగా వెను దిరిగాడు. తర్వాత వచ్చిన హీగీ టౌవా భారత బౌలర్లను ప్రతిఘటించేందు కు ప్రయత్నించాడు. కానీ మవి బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ కావడంతో పరుగులు ఖాతా ప్రారంభించకుండానే పెవిలియన్ దారిపట్టాడు. తర్వాతి బంతికి ఓపెనర్ సైమన్ అటాయ్ రనౌటయ్యాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ వగి కరహొ కూడా జట్టు ఆదుకోవడంలో విఫలమయ్యాడు. అర్షదీప్ వేసిన బంతికి కీపర్ జుయల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత అనుకుల్ రాయ్ షో మొదలైంది. కమలేష్ నగర్‌కోటి కూడా యార్కర్‌ను సంధించాడు. నిజానికి ఇక్కడి పిచ్‌లు స్పిన్నర్లకు సహకరించవు. కానీ ఆశ్చర్యకరంగా అనుకుల్ రాయ్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీసుకున్నాడు. 6 పరుగులకే 3 వికెట్లు పడగొట్టాడు.

తర్వాత సునాయాస లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టులో పృథ్వీ షా ఎటువంటి ఒత్తిడికి గురి కాలేదు. ఇన్నింగ్స్‌ను ఎంజాయ్ చేశాడు. షా చేసిన స్కోరులో 12 ఫోర్లు ఉన్నాయి.

తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై సునాయాస విజయం సాధించిన సంగతి తెలిసిందే. మరోవైపు పపువా న్యూ జెనీవీ తన తొలి మ్యాచ్‌లో జింబాబ్వే చేతిలో ఓటమిపాలైంది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో కెప్టెన్ పృథ్వీ షా 94 పరుగులు చేయడంతో భారత్ 100 పరుగులతో విజయం సాధించింది. షా సహచర ఓపెనర్ మనోజ్ కల్రా (86)తో కలిసి 180 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించాడు. దీంతో ఆ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. షా, కల్రా, శుభ్‌మన్ గిల్ అర్ధ సెంచరీలు సాధించారు.

పోరెల్ స్థానంలో ఆదిత్య

ఆస్ట్రేలియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో కాలి మడమ గాయానికి గురయ్యాడు. దీంతో జెనీవాతో రెండో మ్యాచ్‌కు విదర్భ ఫాస్ట్ బౌలర్ ఆదిత్య ఠాక్రేకు జట్టులో స్థానం కల్పించారు.

విరాట్ సెంచరీ

కెప్టెన్ విరాట్ కోహ్లీ సెంచరీ చేయడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌటైంది. 5 వికెట్ల నష్టానికి 183 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం టీమిండియ తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. మరో 124 పరుగులు జోడించి మిగిలిన ఐదు వికెట్లు కోల్పోయింది. 85 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కోహ్లీ మరో 68 పరుగులు జోడించి 153 పరుగులకు అవుటయ్యాడు. 11 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుకు పాండ్యా మరో నాలుగు పరుగులు జోడించాడు. అయితే తర్వాత వచ్చిన రవిచంద్రన్ అశ్విన్ (38) కెప్టెన్‌కు అండగా నిలిచాడు.


తర్వాత రెండో ఇన్నింగ్స్‌కు బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా ను ఆరంభంలోనే బుమ్రా దెబ్బ తీశాడు. ఓపెనర్ మార్‌క్రమ్, హాషీం ఆమ్లాలను తక్కువ పరుగులకే పెవిలియన్ పంపాడు. దీంతో మూడో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా 2 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది.

కోహ్లీకి జరిమానా

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి ఒక డిమెరిట్ పాయింట్‌తో పాటు మ్యాచ్ ఫీజ్‌లో 25 శాతం జరిమానా విధించారు. సౌతాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ మూడో రోజు ఆటలో కోహ్లీ ఐసీసీ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఫర్ ప్లేయర్స్, ప్లేయర్ సపోర్ట్ పర్సనల్ లెవెన్-1 నిబంధనను ఉల్లంఘించినట్టు అంపైర్లు నిర్ణయించారు. వర్షం అంతరాయం కలిగించిన సోమవారం నాటి ఆటలో మైదానం పూర్తిగా తడిసిపోయింది. ఫీల్డింగ్ సమయంలో బాగా తడిసిపోయిన బంతి స్వింగ్ కావడం లేదు. దీంతో బంతిని మార్చాలని కోహ్లీ పదే పదే ఫిర్యాదు చేయడాన్ని అంపైర్లు తప్పుబట్టారు. దీంతో ఆన్ ఫీల్డ్ అంపైర్లు గఫ్, పాల్ రీఫెల్‌తో పాటు థర్డ్ అంపైర్ రిచర్డ్ కెట్టిల్‌బరో, ఫోర్త్ అంపైర్ అల్లావుద్దీన్ పాలెకర్ కూడా కోహ్లీపై చర్యలకు అంగీకరించారు. అయితే కొత్త నిబంధనల ప్రకారం డిమెరిట్ పాయింట్‌కు గురైన రెండో క్రికెటర్‌గా కోహ్లీ నిలిచాడు. 2016లో ప్రారంభించిన ఈ డిమెరిట్‌కు ఇంతకుముందు రవీంద్ర జడేజా డిమెరిట్‌కు గురయ్యాడు.

ఇండియాలో ఆడినట్టుంది

- సెంచూరియన్ పిచ్‌పై మోర్కెల్ వ్యాఖ్య



సహజమైన స్వభావాన్ని ప్రదర్శించని సెంచూరియన్ పిచ్‌ను సౌతాఫ్రికా పేస్ బౌలర్ మోర్నే మోర్కెల్ విమర్శించాడు. ఇండియా పిచ్‌ను తలపిస్తోందని పోల్చాడు. మోర్కెల్ 4 వికెట్లు తీసుకోవడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌటైంది. 'నా జీవితమంతా ఇక్కడే క్రికెట్ ఆడాను. కానీ సూపర్‌స్పోర్ట్ పార్క్‌లో ఇటువంటి పిచ్‌ను నేను ఎన్నడూ చూడలేదు. వికెట్ల కోసం చాలా శ్రమించాల్సి వచ్చింది. ఈ వేడి వాతావరణంలో చాలా కష్టమనిపించింది. కెరీర్‌లో వికెట్ల కోసం ఇంతలా ఎన్నడూ కష్టపడలేదు' అని అన్నాడు. అయితే ఇది భారత్‌లో పిచ్ మాదిరిగా ఉందా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'అవును! 100 శాతం అలాగే ఉంది. ఇది స్పిన్నర్లకు సహకరిస్తుందని ముందే గుర్తించవుంటే తొలి రోజే స్పిన్నర్‌తో ఎక్కువగా బౌలింగ్ చేయించే వాళ్లం' అని మోర్కెల్ అన్నాడు.

రెండో రౌండ్‌లో షరపోవా



- ముగురుజా, ఫెదరర్, జొకోవిచ్ కూడా
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్

మెల్బోర్న్: డోపింగ్‌లో పట్టుబడి ఏడాది నిషేధ కాలాన్ని పూర్తి చేసిన రష్యా అందాల భామ మారియా షరపోవా ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నీలో రెండో రౌండ్‌కు చేరుకుంది. మంగళవారమిక్కడ జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో షరపోవా 6-1, 6-4తో జర్మనీకి చెందిన టాజ్నా మారియాను వరుస సెట్లలో ఓడించింది. మరో మ్యాచ్‌లో గార్బైన్ ముగురుజా 6-4, 6-3తో పాంచెట్‌పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో సెర్బియా ఆటగాడు నోవక్ జొకోవిచ్ కూడా రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 6-1, 6-2, 6-4తో అమెరికాకు చెందిన డొనాల్డ్ యంగ్‌పై వరుస సెట్లలో గెలిచాడు. మరో మ్యాచ్‌లో ఫెదరర్ 6-3, 6-4, 6-3తో స్లోవేనియాకు చెందిన అల్జాజ్ బెడెన్‌ను వరుస సెట్లలో ఓడించాడు. మహిళల సింగిల్స్ ఇతర మ్యాచ్‌ల విషయానికొస్తే.. ఏంజెలిక్ కెర్బర్ 6-0, 6-4తో ఫ్రీడ్సమ్‌ను, జొహన్నా కాంటా 6-3, 6-1తో అమెరికాకు చెందిన బ్రెంగిల్‌ను, సీమోనా హాలెప్ 7-6 (7-5), 6-1తో ఆస్ట్రేలియాకు చెందిన డెస్టానీ ఐయవాను, బౌచర్డ్ 6-3, 7-6 (7-5)తో డొడిన్‌ను చిత్తు చేశారు. అయితే పెట్ర క్విటోవాకు షాక్ తగిలింది. ఈ మ్యాచ్‌లో క్విటోవాపై 3-6, 6-4, 8-10తో పెట్కోవిచ్ గెలిచింది. కాగా సఫరోవా రెండో రౌండ్‌కు చేరుకుంది. తొలి రౌండ్‌లో సఫరోవా 7-5, 6-3తో టామ్‌జనోవిచ్ ను ఓడించింది. పురుష ల సింగిల్స్ ఇతర మ్యాచ్‌ల్లో ఫ్రాన్స్‌కు చెందిన గేల్ మో న్ ఫిల్స్ 6-3. 7-6 (7-5), 6-4తో మునార్ పైపోరాడి గెలిచాడు.

సిరీస్ పోయినట్టేనా?



- గెలుపుకు 7 వికెట్ల దూరంలో సౌతాఫ్రికా
- టీమిండియా లక్ష్యం 287
- ప్రస్తుతం 35/3
- తొలి ఇన్నింగ్స్‌లో 307 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 258
- రెండో టెస్టు

"కోట్లాది మంది భారతీయుల ఆశలను కోహ్లీ సేన నీరుగార్చింది. ఫాస్ట్, బౌన్సీ పిచ్‌లపై మన బౌలర్లు రాణిస్తున్నా బ్యాట్స్‌మెన్ మాత్రం వారికి అండగా నిలవలేక పోతున్నారు. హోం సిరీస్‌లో వరుస విజయాలు సాధించిన టీమిండియా విదేశీ పర్యటనల్లోనూ సత్తా చాటుతుందని సౌతాఫ్రికా పర్యటనకు ముందు అందరూ అనుకున్నారు. కానీ మన జట్టు సొంత గడ్డపై మాత్రమే పులి అని, విదేశీ గడ్డపై పిల్లి అని తెలుస్తోంది. తొలి టెస్టు ఘోర పరాజయంతో గుణపాఠాలు నేర్చుకోవాల్సిన కోహ్లీ సేన రెండో టెస్టులోనూ తీరు మార్చుకోలేదు. ఈ మ్యాచ్‌లో ఒక్క విరాట్ కోహ్లీ మాత్రమే సెంచరీ చేశాడు. మిగిలిన వారంతా పేక మేడలా కూలిపోయారు. జట్టును ఆదుకునే వాళ్లు ఒక్కరు కూడా కనిపించడం లేదు. ఇక సిరీస్‌ను సౌతాఫ్రికాకు అప్పగించడమే మిగిలివుంది.

సెంచూరియన్: టెస్టు సిరీస్‌ను టీమిండియా కోల్పోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక్కడ జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో 287 పరుగుల గెలుపు లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన టీమిండియా 26 పరుగులకే కీలకమైన 3 వికెట్లు కోల్పోయింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 35 పరుగులు చేసింది. దీంతో గెలుపుకు సౌతాఫ్రికా 7 వికెట్ల దూరంలో ఉంది. ఇంకా చివరి రోజు ఆడాల్సివుంది. తొలి టెస్టులో మాదిరిగా కోహ్లీ సేన ఒక్క రోజులో ఆలౌటై మ్యాచ్‌ను, సిరీస్‌ను ప్రొటీస్‌కు అప్పగిస్తుందా? లేక కనీసం డ్రా కోసమైనా ఆడుతుందా? అనేది చూడాలి. మొత్తానికి ఈ మ్యాచ్ భారత అభిమానులకు టెన్షన్‌గా మారింది. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 258 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేసింది.

2 వికెట్ల నష్టానికి 90 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు మంగళవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా జట్టును మరో ఓపెనర్ డీన్ ఎల్గార్, ఏబీ డివిలియర్స్ అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 141 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని అందించారు. ఎల్గార్ (61), డివిలియర్స్ షమీ బౌలింగ్‌లో అవుటయ్యారు. అయితే కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ మాత్రం ఎంతో ఓపికగా ఆడుతూ భారత బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నాడు. ఒక ఎండ్‌లో వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో ప్లెసిస్ వికెట్లకు అతుక్కుపోయి ఆడాడు. అవతలి ఎండ్‌లో బౌలర్ మోర్కెల్ ఉండడంతో సింగిల్స్ తీసే అవకాశమున్నా ప్లెసిస్ రన్ తీయలేదు. కానీ ఎట్టకేలకు టీ విరామం తర్వాత వికెట్ సమర్పించుకున్నాడు. బుమ్రా వేసిన ఓ అద్భుతమైన బంతికి అతనికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అంతసేపు ఓపికగా క్రీజులో ఉన్నప్పటికీ అర్ధ సెంచరీ కూడా పూర్తి చేయకుండానే అవుటయ్యాడు. 141 బంతుల్లో 48 పరుగులు చేశాడు. తర్వాత వచ్చిన అరంగేట్ర ఫాస్ట్ బౌలర్ ఎంగిడి 92వ ఓవర్లో అశ్విన్ బౌలింగ్‌లో అవుట్ కావడంతో సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ముగిసింది. 258 పరుగులకు ఆలౌటైంది. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలిపితే గెలిచేందుకు కోహ్లీ సేన 287 పరుగులు చేయాల్సి వచ్చింది.

తర్వాత రెండో ఇన్నింగ్స్‌కు బరిలోకి దిగిన టీమిండియా 11 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. రబాడ వేసిన బంతిని సరిగా ఆడలేకపోయిన విజయ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. తర్వాత పుజారా బ్యాటింగ్‌కు వచ్చాడు. అయితే 12వ ఓవర్లో ఎంగిడి వేసిన తొలి బంతికి రాహుల్ అవుట్ కావడంతో టీమిండియా 16 పరుగులకే ఓపెనర్లిద్దరినీ కోల్పోయింది. తర్వాత కెప్టెన్ కోహ్లీ వచ్చాడు. అయితే మరో నాలుగు ఓవర్ల తర్వాత కోహ్లీ కూడా ఆవుట్ కావడంతో గెలుపు ఆశలు ఆవిరయ్యాయి. రివ్యూ కోరినా ఫలితం దక్కలేదు. 26 పరుగుల వద్ద మూడో వికెట్ పడింది. తర్వాత పార్థివ్ పటేల్ నైట్ వాచ్‌మన్‌గా వచ్చాడు. వీరిద్దరూ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి పుజారా (11), పార్థివ్ పటేల్ (5) క్రీజులో ఉన్నారు.

స్కోరు బోర్డు

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 335

టీమిండియా తొలి ఇన్నింగ్స్: (ఓవర్‌నైట్ స్కోరు 183/5): కోహ్లీ (సి) డివిలియర్స్ (బి) మోర్కెల్ 153, పాండ్యా రనౌట్ 15, అశ్విన్ (సి) డె ప్లెసిస్ 38, షమీ (సి) ఆమ్లా (బి) మోర్కెల్ 1, ఇషాంత్ శర్మ (సి) మార్‌క్రమ్ (బి) మోర్కెల్ 3, బుమ్రా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం 92.1 ఓవర్లలో 307 ఆలౌట్; వికెట్ల పతనం: 6-209, 7-280, 8-281, 9-306, 10-307; బౌలింగ్: మహరాజ్: 20-1-67-1, మోర్కెల్: 22.1-5-60-4, ఫిలాండర్: 16-3-46-1, రబాడ: 20-1-74-1, ఎంగిడి: 14-2-51-1.

సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: (ఓవర్‌నైట్ స్కోరు 90/2): ఎల్గార్ (సి) రాహుల్ (బి) షమీ 61, డివిలియర్స్ (సి) పటేల్ (బి) షమీ 80, ప్లెసిస్ (సి) అండ్ (బి) బుమ్రా 48, డి కాక్ (సి) పటేల్ (బి) షమీ 12, ఫిలాండర్ (సి) విజయ్ (బి) ఇషాంత్ 26, మహరాజ్ (సి) పటేల్ (బి) ఇషాంత్ 6; రబాడ (సి) కోహ్లీ (బి) షమీ 4, మోర్నే మోర్కెల్ నాటౌట్ 10, ఎంగిడి (సి) విజయ్ (బి) అశ్విన్ 1; ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం 91.3 ఓవర్లలో 258 ఆలౌట్; వికెట్ల పతనం: 3-144, 4-151, 5-163, 6-209, 7-215, 8-245, 9-245, 10-258; బౌలింగ్: అశ్విన్: 29.3-6-78-1, బుమ్రా: 20-3-70-3, ఇషాంత్: 17-3-40-2, షమీ: 16-3-49-4, పాండ్యా: 9-1-14-0.

ఇండియా రెండో ఇన్నింగ్స్: విజయ్ (బి) రబాడ 9, రాహుల్ (సి) మహరాజ్ (బి) ఎంగిడి 4, పుజారా నాటౌట్ 11, కోహ్లీ ఎల్‌బిడబ్ల్యూ (బి) ఎంగిడి 5, పార్థివ్ పటేల్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం 23 ఓవర్లలో 35/3; వికెట్ల పతనం: 1-11, 2-16, 3-26; బౌలింగ్: ఫిలాండర్: 6-3-6-0, రబాడ: 5-2-9-1, ఎంగిడి: 6-2-14-2, మోర్కెల్: 5-3-4-0, మహరాజ్: 1-0-1-0.



సాహా స్థానంలో దినేష్ కార్తీక్

- 24నుంచి మూడో టెస్టు



ముంబై: సౌతాఫ్రికాతో జరగనున్న చివరి, మూడో టెస్టు మ్యాచ్‌కు వికెట్‌కీపర్/బ్యాట్స్‌మన్ వృద్ధిమాన్ సాహాకు బదులుగా మరో వికెట్‌కీపర్/బ్యాట్స్‌మన్ దినేష్ కార్తీక్‌ను ఎంపిక చేసినట్టు మంగళవారం బీసీసీఐ ప్రకటించింది. చివరి, మూడో టెస్టు మ్యాచ్ ఈ నెల 24న జొహన్నెస్‌బర్గ్‌లో ప్రారంభం కానుంది. 11వ తేదీన ట్రెయినింగ్ సెషన్‌లో సాహా గాయపడినట్టు బీసీసీఐ పేర్కొంది. '11వ తేదీన ట్రెయినింగ్ సెషన్‌లో సాహాకు స్నాయువు గాయమైంది. బీసీసీఐ వైద్య బృందం అతడిని నిరంతరం పర్యవేక్షిస్తోంది' అని తాత్కాలిక అధ్యక్షుడు అమితాబ్ చౌదరి చెప్పారు. 32 ఏళ్ల కార్తీక్ టీమిండియాకు 23 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. అయితే చివరిసారిగా 2010లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ ఆడాడు. 51 క్యాచ్‌లు, 5 స్టంపింగ్‌లు చేశాడు. గాయం కారణంగానే సాహా రెండో టెస్టు మ్యాచ్‌లో ఆడలేదు. రెండో టెస్టుకు సాహా స్థానంలో పార్థివ్ పటేల్‌ను ఎంపిక చేశారు.

24 గంటల స్పోర్ట్స్ రేడియో చానెల్ షురూ

న్యూఢిల్లీ: స్పోర్ట్స్‌కు సంబంధించిన అన్ని ఈవెంట్లను 24 గంటలు ప్రసారం చేసేందుకు తొలిసారి భారత్‌కు చెందిన ఆన్‌లైన్ రేడియో చానెల్ తనను తాను అంకితం చేసుకుంది. దీంతో ఈ రేడియో చానెల్ కేవలం స్పోర్ట్స్‌కు చెందిన లైవ్‌డేట్స్, కామెంటరీలను, చాటింగ్‌ను 24 గంటలు ప్రసారం చేస్తుంది. మల్టీ స్పోర్ట్స్ యాప్ స్పోర్ట్స్ ఫ్లాషెస్ ఇంటర్నెట్ రేడియో చానెల్‌ను ప్రారంభించింది. క్రీడలకు చెందిన ప్రత్యేక కార్యక్రమాలను, నిపుణుల అభిప్రాయాలతో పాటు స్పోర్ట్స్ న్యూస్, ప్రపంచంలోని 400 క్రీడలకు సంబంధించిన వివరాలను ఈ చానెల్ ప్రసారం చేస్తుంది. ఇందులో ప్రీమియర్ లీగ్, ఐపీఎల్, ఫిఫా వరల్డ్ కప్ కూడా ఉన్నాయి. స్పోర్ట్స్ టీవీ చానెళ్లు వేటినైతే చూపించలేకపోతున్నాయో ఆ క్రీడలకు సంబంధించిన అన్ని అప్‌డేట్స్‌ను అందించడమే తామ ప్రధాన లక్ష్యమని స్పోర్ట్స్ ఫ్లాషెస్ వ్యవస్థాపకుడు రామన్ రహేజా అన్నారు. ఈ చానెల్ స్పోర్ట్స్ ఫ్లాషెస్ మొబైల్ యాప్, స్పోర్ట్స్‌ఫ్లాషెస్ డాట్ కామ్‌లో ఇంగ్లీష్, హిందీ భాషల్లో అందుబాటులో ఉంటుంది.

జిమ్నాస్టిక్ డాక్టర్ లైంగికంగా వేధించాడు

- యూఎస్‌ఏ జిమ్నాస్ట్ సంచలన ఆరోపణలు



లాస్ ఏంజెల్స్: యూఎస్‌ఏ మాజీ టీమ్ డాక్టర్ లార్రీ నస్సర్ తనను లైంగికంగా వేధించాడని అమెరికాకే చెందిన ఒలింపిక్ జిమ్నాస్ట్ సైమన్ బైల్స్ ఆరోపించింది. ఓ చిన్నారిపై లైంగిక దాడికి దిగన ఘటనలో 54 ఏళ్ల నస్సర్‌కు గత నెల 60 ఏళ్ల జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణం వెలుగు చూసినప్పటి నుంచి తనకు జరిగిన ఘటనను బయటపెట్టాలా? వద్దా అని తనులో తాను మదనపడినట్టు బైల్స్ ట్విట్టర్‌లో పేర్కొంది. 'ఉత్సాహంగా, సంతోషంగా ఉండే అమ్మాయిగానే నేను చాలా మందికి తెలుసు. కానీ నాకు జరిగిన ఘటనను నలుగురికి తెలపాలన్న నా అంతరాత్మను అణచివేశాను. నా కథ గురించి చెప్పడానికి ఎన్న డూ భయపడలేదు. లార్రీ నస్సర్ లైంగికంగా వేధించిన వారిలో నేను కూడా ఉన్నాను' అని 10సార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలు సాధించిన బైల్స్ పేర్కొంది. 100కుపైగా అమ్మాయిలను నస్సర్ లైంగికంగా వేధించాడు. ఇందులో కొంత మంది యూఎస్ ఒలింపియన్స్ కూడా ఉన్నారు. నస్సర్ తమను కూడా వేధించారని బైల్స్ సహచరులు అలి రైస్మన్, మెక్కైలా మరొనే, గబ్బీ డగ్లస్ చెప్పారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.